




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 11 సంచిక :140 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ గురువారం 23 జనవరి 2025 వెల : 5/-రూ॥

VOLUME : 11 ISSUE :140 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA THU 23 JANUARY 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Kakinada,Visakhapatnam, Ongole Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur


# గూగుల్ క్లౌడ్ విస్తరణకు ఏపీ అనుకూలం

- విశాఖలో డిజైన్ కేంద్రం ఏర్పాటును పరిశీలించాలని గూగుల్ కు విజ్ఞప్తి
- మూలపేటలో పెట్టుబడులకు పెట్రోనాస్ సంస్థకు ఆహ్వానం
- దావోస్ లో మూడో రోజు కూడా చంద్రబాబు కీలక సమావేశాలు




**పెన్ పవర్ డెస్క్:** సర్వర్ల కోసం సొంత చిప్‌లను రూపొందిస్తున్న గూగుల్ విశాఖపట్నంలో డిజైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాల్సిందిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గూగుల్ క్లౌడ్ సీఈవో థామస్ కురియన్‌ను కోరారు. గూగుల్ క్లౌడ్ తన సర్వర్ సప్లై చైన్ అనుసంధానించేలా తయారీ యూనిట్‌ను ఏపీలో నెలకొల్పాలని థామస్ కురియన్‌కు ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. సర్వర్ నిర్వహణ సేవల విషయంలో ఏపీని ప్రధాన కేంద్రంగా చేసుకోవాలని, ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని థామస్ కురియన్‌కు ముఖ్యమంత్రి తెలిపారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో భాగంగా దావోస్ వెళ్లిన ముఖ్యమంత్రి చంద్రబాబు.. మూడో రోజు పర్యటనలో రాష్ట్రానికి పెట్టుబడుల్ని ఆకట్టుకునేందుకు ప్రముఖ సంస్థల అధిపతులతో చర్చలు జరిపారు.

**గూగుల్‌తో ఇప్పటికే పలు ఒప్పందాలు**

క్లౌడ్ ప్రొవైడింగ్ రంగంలో ప్రపంచంలో మూడో అతి పెద్ద సంస్థ అయిన గూగుల్ క్లౌడ్.. తన ప్లాట్‌ఫామ్ కింద ఇప్పటికే భారత్‌లోని ఢిల్లీ, ముంబైలో రెండు క్లౌడ్ రీజియన్లు ఏర్పాటు చేసింది. ఇటీవల విశాఖపట్నంలో తమ 'డేటా సిటీ' ఏర్పాటు చేసేందుకు ఏపీ ప్రభుత్వంతో ఎంవోయూ కుదుర్చుకుంది. అలాగే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగాన్ని అభివృద్ధి చేయడానికి, రాష్ట్రంలోని యువతకు నైపుణ్యాభివృద్ధి అవకాశాలను పెంపొందించేందుకు ఏపీతో ఒప్పందం చేసుకుంది.

**పెట్రోనాస్ ప్రెసిడెంట్‌తో ముఖ్యమంత్రి చర్చలు**

పెట్రోనాస్ ప్రెసిడెంట్, గ్రూప్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ముహమ్మద్ తౌఫిక్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు చర్చలు జరిపారు. 'పెట్రోనాస్' మలేషియాకు చెందిన ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కంపెనీ. ప్రస్తుతం గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమోనియా, గ్రీన్ మాలిక్యులస్‌కు సంబంధించి భారత్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ప్రయత్నిస్తోంది. 2030 కల్లా ఏడాదికి 5 మిలియన్ టన్నుల గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకు సంబంధించి కాకినాడ ప్లాంటులో రూ.13,000 కోట్ల నుంచి రూ.15,000 కోట్లు పెట్టుబడి పెట్టనుంది. పెట్రోకెమికల్ హబ్‌గా అవతరిస్తున్న మూలపేటలోనూ, అలాగే గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌లోనూ పెట్టుబడులు పెట్టాల్సిందిగా ముహమ్మద్ తౌఫిక్‌ను ముఖ్యమంత్రి ఆహ్వానించారు.

**పెప్సీకో అధిపతులతో సమావేశం**

పెప్సీకో ఇంటర్నేషన్ బెవరేజస్ సీఈవో యూజీన్ విల్లెంసెన్, పెప్సీకో ఫౌండేషన్ చైర్మన్ స్టీఫెన్ కెహోతో ముఖ్యమంత్రి చంద్రబాబు చర్చలు జరిపారు. పెప్సీకో ప్రపంచంలో రెండో అతిపెద్ద

వివరాలు 2లో..

### మహారాష్ట్రలో ఘోర ప్రమాదం...

## ప్రయాణికుల మీదకు దూసుకెళ్లిన రైలు... 8 మంది మృతి



**పెన్ పవర్ డెస్క్:** మహారాష్ట్రలో ఘోర ప్రమాదం చోటుచేసు కుంది. జలగావ్ జిల్లాలో పరండా రైల్వే స్టేషన్ సమీపంలో కర్ణాటక ఎక్స్ ప్రెస్ ఢీకొట్టడంతో పలువురు మృతి చెందారు.

వివరాలు 2లో..

## కర్ణాటకలో కూరగాయల లారీ బోల్తా పడి 10 మంది రైతుల మృతి




- బుధవారం తెల్లవారుజామున ఎల్లాపూర్ తాలూకాలో దారుణం
- మరో పదిహేను మంది రైతులకు తీవ్ర గాయాలు
- మార్కెట్ కు కూరగాయలు తరలిస్తుండగా ప్రమాదం

వివరాలు 2లో..

## ఏపీ హైకోర్టుకు ఇద్దరు కొత్త జడ్జిల నియామకం

- ఏపీ హైకోర్టు అడిషనల్ జడ్జిలుగా హరిహరనాథ శర్మ, లక్ష్మణరావు
- రాష్ట్రపతి ఉత్తర్వులు
- నోటిఫికేషన్ జారీ చేసిన కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ




**పెన్ పవర్ డెస్క్:** ఏపీ హైకోర్టుకు కొత్తగా ఇద్దరు అడిషనల్ జడ్జిలను నియమించారు. ఏపీ హైకోర్టు అదనపు న్యాయమూర్తులుగా అవధానం హరిహరనాథ శర్మ, డాక్టర్ యడవల్లి లక్ష్మణరావులను నియమిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉత్తర్వులు ఇచ్చారు. ఈ మేరకు కేంద్ర లా అండ్ జస్టిస్ మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. అవధానం హరిహరనాథ శర్మ, యడవల్లి లక్ష్మణరావు ఏపీ హైకోర్టు అడిషనల్ జడ్జిలుగా రెండేళ్ల పాటు కొనసాగుతారు. వీరిద్దరినీ అదనపు జడ్జిలుగా నియమించాలన్న ప్రతిపాదనకు జనవరి 11న జరిగిన సమావేశంలో సుప్రీంకోర్టు కొలీజయం ఆమోదం తెలిపింది.

## దావోస్‌లో ఒకే వేదికపై ముగ్గురు సీఎంలు



- 'కంట్రీ స్ట్రాటజిక్ డైలాగ్' సమావేశంలో ముగ్గురు ముఖ్యమంత్రులు
- దేశం ఒక యూనిట్‌గా పెట్టుబడులు రాబట్టేలా కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ కార్యక్రమం
- చర్చకు వచ్చిన వివిధ అంశాలు

**పెన్ పవర్ డెస్క్:** దావోస్‌లో జరుగుతోన్న వరల్డ్ ఎకనామిక్ ఫోరం(%ఔజుఖీ%) సదస్సులో ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. మన దేశం నుంచి వెళ్లిన ముగ్గురు సీఎంలు ఒకే వేదికపై కనిపించారు. అదీ సౌత్ ఇండియా రాష్ట్రాల నుంచి వెళ్లిన ముగ్గురు సీఎంలు ఒకే చోట కలిశారు.

వివరాలు 2లో..

## డైరెక్టర్ సుకుమార్ ఇంట్లో ఐటీ సోదాలు

### ఎయిర్ పోర్ట్ నుంచి వెనక్కి పిలిచిన అధికారులు

- దర్శకుడు సుకుమార్ ఇంటిపై ఐటీ రైడ్స్
- రెండోరోజూ సినీ ప్రముఖుల ఇళ్లు, కార్యాలయాల్లో ఐటీ అధికారుల సోదాలు
- దర్శకుడు సుకుమార్ ఇంట్లో ఐటీ శాఖ అధికారుల తనిఖీలు
- 'పుష్ప-2' సినిమా భారీ కలెక్షన్ల నేపథ్యంలో మేకర్స్ ఇళ్లతో పాటు డైరెక్టర్ ఇంటిపై ఐటీ రైడ్స్

వివరాలు 2లో..



## బీజేపీకి గుడ్ బై చెప్పిన నితీష్ కుమార్: మణిపూర్ నుంచి మొదలైందా..!

- మణిపూర్ లో కీలక పరిణామం... బీజేపీ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకున్న నితీశ్ కుమార్ పార్టీ
- బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకున్న జేడీయూ
- తమ ఏకైన ఎమ్మెల్యే ప్రతిపక్షంలో ఉంటాడన్న రాష్ట్ర జేడీయూ అధ్యక్షుడు
- మరోసారి చర్చనీయాంశంగా మారిన నితీశ్ కుమార్ వైఖరి



వివరాలు 2లో..

## నా ఒక్కడిపైనే కాదు.. ఇండస్ట్రీ మొత్తం మీద ఐటీ దాడులు




- ఐటీ సోదాలు నా ఒక్కడిపైనే జరగడంలేదు... ఇండస్ట్రీ అంతా జరుగుతున్నాయి: దిల్ రాజు
- మొన్న ఉదయం 6 గంటల నుంచి ఐటీ సోదాలు
- దిల్ రాజు నివాసం, కార్యాలయాల్లో సోదాలు
- ఇతర నిర్మాతలపైనా ఐటీ దాడులు

**పెన్ పవర్ డెస్క్:** టాలీవుడ్ ఇండస్ట్రీ ప్రముఖుల ఇండ్లపై జరుగుతోన్న ఇన్‌కమ్ ట్యాక్స్ (ఐటీ) రైడ్స్‌పై ప్రముఖ నిర్మాత దిల్ రాజ్ స్పందించారు. నా ఒక్కడి పైనే ఐటీ దాడులు జరగడం లేదని.. టాలీవుడ్ ఇండస్ట్రీ మొత్తం మీద ఐటీ రైడ్స్ జరుగుతున్నాయని తెలిపారు. ప్రొడ్యూసర్ దిల్ రాజ్‌తో పాటు మైత్రీ మూవీ మేకర్స్, డైరెక్టర్స్ అనిల్ రావిపూడి,

వివరాలు 2లో..

## కర్ణాటక రోడ్డు ప్రమాదంపై పవన్ కల్యాణ్ స్పందన

### సింధనూరు వద్ద వాహనం బోల్తా

### నలుగురి మృతి

వివరాలు 2లో..

### మృతుల్లో ముగ్గురు వేద విద్యార్థులు

**పెన్ పవర్ డెస్క్:** కర్ణాటకలో ఓ వాహనం బోల్తా పడగా... ఏపీకి చెందిన నలుగురు మృత్యువాతపడ్డారు. దీనిపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. కర్ణాటకలోని సింధనూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వేద పాఠశాల విద్యార్థులు, ఆ వాహన డ్రైవర్ మృతి చెందడం తనను దిగ్భ్రాంతికి గురిచేసిందని వెల్లడించారు.



### దావోస్ కాంగ్రెస్ సెంటర్ లో సమావేశానికి

## కాలినడకన నారా లోకేశ్...



- దావోస్ లో వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సు
- ఏపీ ప్రభుత్వం పెట్టుబడుల వేట
- కీలక సమావేశాలతో చంద్రబాబు, నారా లోకేశ్ బిజీ

**పెన్ పవర్ డెస్క్:** స్విట్జర్లాండ్ లోని దావోస్ లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక ఫోరం సదస్సులో ఏపీ ప్రభుత్వ పెట్టుబడుల వేట కొనసాగుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ అంతర్జాతీయ కంపెనీల సీఈవోలు, చైర్మన్లతో వరుస సమావేశాలు నిర్వహిస్తూ, పెట్టుబడుల సాధనకు శక్తిమేర కృషి చేస్తున్నారు. కాగా, దావోస్ లోని కాంగ్రెస్ సెంటర్ లో ఓ సమావేశానికి నారా లోకేశ్ కాలినడకన వెళ్లడం ఓ వీడియాలో కనిపించింది. తాము బస చేస్తున్న హోటల్ నుంచి వాహనంలో బయల్దేరిన లోకేశ్...

వివరాలు 2లో..

## అమరావతి నిర్మాణానికి రూ.11 వేల కోట్లు...

### నిధుల విడుదలకు హడ్కో ఆమోదం

- ఊపందుకోనున్న ఏపీ రాజధాని అమరావతి నిర్మాణం
- రూ.11 వేల కోట్ల రుణానికి హడ్కో ఆమోదం
- హర్షం వ్యక్తం చేసిన మంత్రి నారాయణ



**పెన్ పవర్ డెస్క్:** ఏపీ రాజధాని అమరావతికి హడ్కో శుభవార్త చెప్పింది. అమరావతి నిర్మాణానికి రూ.11 వేల కోట్ల నిధుల విడుదలకు హడ్కో అంగీకారం తెలిపింది. దీనిపై ఏపీ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ స్పందించారు. అమరావతి నిర్మాణానికి రూ.11 వేల కోట్ల నిధుల

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# డాలర్ డ్రీమ్సేనా.....

అమెరికా 47వ అధ్యక్షుడిగా వైట్‌హౌస్‌లో అడుగుపెట్టిన డొనాల్డ్ ట్రంప్ తొలి రోజే పలు సంచలనాలకు తెరతీశారు. ఎన్నికల ప్ర చార సమయంలో హామీ ఇచ్చినట్లుగా అక్రమ వలసలను అరికట్టడంతో పాటుగా పదుల సంఖ్యలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. వీటిలో అత్యం త ప్రధానమైనది 'జన్మతః పౌరసత్వం'పై వేటు. దాదాపు వందేళ్లుగా అనుసరిస్తూ వస్తున్న ఈ విధానానికి ట్రంప్ స్వస్తి పలికారు. అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతల చేపట్టిన వెంటనే అక్రమ వలసలపై డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటన లక్షల మంది విదేశీయులను ఆందోళనకు గురిచేస్తోంది. అమెరికాకు అక్రమంగా వచ్చినవారిని వెనక్కి పంపడం ఖాయమని ట్రంప్ చేసిన ప్రకటన వణికిస్తోంది. తాత్కాలిక వీసాలపై వచ్చినవారిదీ ఇదే పరిస్థితి. సరైన పత్రాల్లేకుండా అమెరికాలో నివసిస్తున్న విదేశీ పౌరుల సంఖ్య దాదాపు 1.40 కోట్లు ఉంటుందని అంచనా. వీరిలో సుమారు 7.25 లక్షల మంది భారతీయులే. మెక్సికో, ఎల్ సాల్వెడార్ పౌరుల తర్వాతి స్థానం మనోళ్లదే. ఈ నిర్ణయం ప్ర భావం అమెరికాలో ఉంటున్న లక్షలాదిమంది భారతీయులపై తీవ్ర ప్రభా వం చూపించనుంది. అక్రమంగా అమెరికాలో ఉంటున్న వారితో పాటుగా విద్యార్థులు, టూరిస్టు, హెచ్1బీ లాంటి తాత్కాలిక వర్క్ వీసాలపై దే శంలో ఉంటున్న వారికి జన్మించే పిల్లలకు ఇకపై అమెరికా పౌరసత్వం ల భించదు. ఈ తరహా పౌరసత్వాన్ని ఏ దేశం కూడా ఇవ్వడం లేదని, తాముకూడా ఇచ్చేది లేదని ట్రంప్ స్పష్టం చేశారుతల్లిదండ్రుల్లో కనీసం ఒక్కరై నా అమెరికా పౌరసత్వం, శాశ్వత నివాసం, గ్రీన్‌కార్డు, అమెరికా మిలిటరీ సభ్యత్వం ఇలా ఏదైనా ఒక గుర్తింపు ఉంటేనే వారి పిల్లలకు పుట్టుకతో దే శ పౌరసత్వం ఇస్తామని తేల్చి చెప్పారు. అయితే అమెరికా మాత్రమే ఇలాంటి పౌరసత్వం ఇస్తున్నట్లు ట్రంప్ చెప్పిన దాంట్లో నిజం లేదు. ప్రపంచవ్యాప్తంగా 30కి పైగా దేశాలు ఇలా పౌరసత్వాన్ని ఇస్తున్నాయి. అమె రికాలో అంతర్యుద్ధం ముగిసిన మూడేళ్ల తర్వాత 1868లో ఆమోదించిన 14వ రాజ్యాంగ సవరణతో ఈ హక్కు లభించిందశరణార్థులుగా వచ్చిన నల్లజాతివారిని బానిసలుగా చూసే దుష్ట సంప్రదాయానికి ముగింపు పలకడానికి ఇది వీలు కల్పించింది. ఇప్పుడు ట్రంప్ తీసుకున్న నిర్ణయంతో ఇది రద్దు కానుంది. ఈ ఉత్తర్వు 30 రోజుల తర్వాతినుంచి అమలులోకి రానుంది. అయితే చట్టబద్ధంగా ఇది అమలు కావడం అసాధ్యమని నిపుణులు అంటున్నారు. ట్రంప్ ఉత్తర్వులను న్యాయస్థానాలు రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించే అవకాశం ఉందిఅమెరికా సుప్రీంకోర్టు సైతం జన్మతః పౌరసత్వాన్ని సమర్థించింది. ఆ అవకాశాలు లేకపోలేదని ట్రంప్ కూడా చెప్పడం గమనార్హం. అంతేకాదు ఉత్తర్వు అమలుకు రాజ్యాంగ సవరణ అవసరం. అమెరికా పార్లమెంటులోని ఉభయ సభలు మూడింట రెండు వంతుల మెజారిటీతో సవరణను ఆమోదించాలి. ఇది సుదీర్ఘ ప్రక్రియ. మరోవైపు ట్రంప్ నిర్ణయాన్ని న్యాయస్థానాల్లో సవాలు చేసేందుకు హక్కుల సంఘాలు సిద్ధమవుతున్నాయి. ఇదంతా అటుంచితే దీని ప్రభావం భారతీయులపై తీవ్రంగా ఉండే అవకాశం ఉంది. 2024 నాటికి అమెరికాలో దాదాపు 54లక్షల మంది భారతీయులు ఉన్నారు. దేశ జనాభాలో 1.47 శాతానికి ఇది సమానం. వీరిలో 34 శాతం మంది అమెరికాలో పుట్టిన వారు కాగా, మిగతా వా రంతా వలస వచ్చిన వారే. అందులో ఎక్కువమంది హెచ్1బీ వీసా కింద వచ్చిన వారే. వాస్తవానికి అమెరికా వెళ్లిన భారతీయుల్లో చాలామంది తమ పిల్లలకు అమెరికా పౌరసత్వం పొందేందుకు 'బర్త్ టూరిజం'ను అంటే పిల్లలకు జన్మనివ్వడం కోసమే అమెరికాకు వెళ్లడాన్ని ఒక మార్గంగా ఎంచుకొంటున్నారనే విమర్శలు కూడా ఉన్నాయి. మెక్సికో, చైనాలాంటి దేశాల వారూ ఇదే పద్ధతి అనురిస్తున్నారు. అందులో కొంత వాస్తవం లేకపోలేదు. ఎందుకంటే గ్రీన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నా అది దక్కా లంటే ఏళ్ల తరబడి వేచిచూడాలి. అందుకే తమ పిల్లలకు, తద్వారా తమ కూ అమెరికా పౌరసత్వం దక్కేందుకు ఈ మార్గాన్ని ఎంచుకొంటున్నారు. ఇప్పటికే ఇలా అమెరికాలో పుట్టిన పిల్లలు వేల సంఖ్యలో ఉ న్నారు. వీరు కూడా అమెరికాలోనే ఉండాలంటే చదువుతో పాటుగా అన్ని విషయాల్లో ను ఇబ్బందులు ఎదుర్కోవలసి ఉంటుంది. అలాగని కుటుంబాలు వేరుపడడం కూడా సాధ్యం కాదు. స్వదేశానికి తిరిగి వెళ్లడం ఒక్కటే మార్గం. ట్రంప్ కోరుకొంటున్నది కూడా అదే. అయితే దేశంలోని అన్ని వ్యవస్థలపైనా దీని ప్రభావం పడుతుందనేది నిపుణులు హెచ్చరిస్తున్నారు. అక్రమ వలసలను అడ్డుకునేందుకు సరిహద్దుల్లో ఎమర్జెన్సీ విధించి.. మరిన్ని బలగాలను మోహరిస్తామని ట్రంప్ ప్రకటించారు. చట్టవిరుద్ధంగా నివసిస్తున్న విదేశీ పౌరులను అందర్నీ గుర్తించి.. వారిని తిరిగి వారి వారి దేశాలకు పంపించేందుకు ట్రంప్ యంత్రాంగం చర్యలు మొదలుపెట్టింది. ఈ విషయంలో భారత ప్రభుత్వం కూడా ట్రంప్ సర్కారుతో కలిసి పనిచేసేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ట్రంప్ ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉండాలని మోదీ ప్రభుత్వం భావిస్తోందని.. ట్రంప్ ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉండాలని మోదీ ప్రభుత్వం భావిస్తోందని.. తత్ఫలితంగా వాణిజ్య యుద్ధాన్ని నివారించేందుకు, ట్రంప్‌నకు సహకరించేందుకు ఇది ముందస్తు ఆలోచన అని అంతర్జాతీయ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# గూగుల్ క్లౌడ్ విస్తరణకు ఏపీ అనుకూలం

- మొదటి పేజీ తరువాయి

ఫుడ్ బెవరేజెస్. ఇప్పటికే ఏపీలోని శ్రీసిటీలో బాటిలింగ్ ప్లాంట్ నిర్వహిస్తున్న పెప్సికో బెవరేజెస్... విశాఖపట్నాన్ని గ్లోబల్ డెలివరీ సెంటర్‌గా చేసుకుని పెప్సికో డిజిటల్ హబ్‌ను ఏర్పాటు చేయవచ్చని ముఖ్యమంత్రి సూచించారు. గ్లోబల్ బిజినెస్ సర్వీస్ సెంటర్‌ను విశాఖకు విస్తరించాల్సిందిగా కోరారు. కుర్‌కురే మాన్యుఫాక్చరింగ్ యూనిట్ ఏర్పాటుతో పాటు పెప్సికో తమ సప్లై చైన్ ద్వారా రైతులకు ప్రయోజనం చేకూర్చేలా ఏపీసీఎన్ఎఫ్‌తో భాగస్వామ్యం కావాలని సూచించారు. బహ్రెయిన్ ప్రైమ్ మినిస్టర్ కార్యాలయ ప్రతినిధి హమద్ అల్ మహ్మద్, ముంతాలకత్ సీఈవో అబ్దుల్లా బిన్ ఖలీఫా అల్ ఖలీఫాతోనూ ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. పారిశ్రామికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన పాలసీలను వివరించిన ముఖ్యమంత్రి... స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కోసం ఏపీకి రావాలని వారిని ఆహ్వానించారు.

## డైరెక్టర్ సుకుమార్ ఇంట్లో ఐటీ సోదాలు

### ఎయిర్ పోర్ట్ నుంచి వెనక్కి పిలిచిన అధికారులు

**పెన్ పవర్ డెస్క్:** హైదరాబాద్ లో రెండు రోజులుగా టాలీవుడ్ ప్రముఖులు, వాళ్ల బంధువుల ఇళ్లు, ఆఫీసులపై ఐటీ సోదాలు కొనసాగుతున్నాయి. నిన్నటి నుంచి దిల్ రాజు, మైత్రీ మూవీస్, మ్యాంగో మీడియా సంస్థల కార్యాలయాలపై ఐటీ సోదాలు చేస్తోంది. (జనవరి 22) పుష్పా 2 డైరెక్టర్ సుకుమార్ నివాసంలో ఐటీ అధికారులు సోదాలు చేస్తున్నారు. ఎయిర్ పోర్టు నుంచి సుకుమార్ ను నేరుగా ఇంటికి తీసుకెళ్లారు ఐటీ అధికారులు. పుష్ప 2 సినిమాకు తీసుకున్న రెమ్యూనరేషన్ ,ఆదాయ వివరాలను ఆరాదీస్తున్నారు. వాటికి సంబంధించిన డాక్యుమెంట్లను పరిశీలిస్తున్నారు. ప్రస్తుతం ఐటీ సోదాలు చేస్తున్న ఈ ప్రొడ్యూసర్స్ చిత్రాలు రీసెంట్ గా బ్లాక్ బస్టర్ సాధించాయి. దిల్ రాజు ప్రొడ్యూస్ చేసిన సంక్రాంతికి వస్తున్నాం మూవీ హిట్ కొట్టింది. అలాగే మైత్రీ మూవీస్ నిర్మించిన పుష్ప2 దేశ వ్యాప్తంగా కలెక్షన్ల సునామీ సృష్టించింది. ఈ సినిమాకు సుకుమార్ దర్శకత్వం వహించారు. ఈ క్రమంలోనే సుకుమార్ ఇంట్లో ఐటీ సోదాలు కొనసాగుతున్నాయి.

## మహారాష్ట్రలో ఘోర ప్రమాదం... ప్రయాణికుల మీదకు దూసుకెళ్లిన రైలు... 8 మంది మృతి

- మొదటి పేజీ తరువాయి

పుష్పక్ ఎక్స్ ప్రెస్ ట్రైన్ లో మంటలు చెలరేగాయన్న వదంతులతో ప్రయాణికులు భయాందోళనలకు గురై చైన్ లాగి కిందికి దిగారు. పట్టాలు దాటుతున్న ఆ ప్రయాణికులను మరో ట్రాక్ వేగంగా దూసుకొచ్చిన కర్ణాటక ఎక్స్ ప్రెస్ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఎనిమిది మంది మృతి చెందారు. దీనిపై సమాచారం అందుకున్న రైల్వే అధికారులు వెంటనే స్పందించి, ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు.

## కర్ణాటకలో కూరగాయల లారీ బోల్తా పడి 10 మంది రైతుల మృతి

**పెన్ పవర్ డెస్క్:** కర్ణాటకలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఉత్తర కన్నడ జిల్లాలో బుధవారం తెల్లవారుజామున కూరగాయల లారీ బోల్తా పడింది. దీంతో పదిమంది రైతులు అక్కడికక్కడే చనిపోయారు. మరో పదిహేను మందికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సావనూర్ కు చెందిన రైతులు తాము పండించిన కూరగాయలను కుంత మార్కెట్ లో అమ్మేందుకు లారీలో బయలుదేరారు. వీరు ప్రయాణిస్తున్న లారీ ఎల్లాపూర్ తాలూకాలో అరేబైల్– గుల్లాపురా మధ్య హైవేపై అదుపుతప్పింది. మరో వాహనానికి దారి ఇచ్చే క్రమంలో రోడ్డు పక్కనే ఉన్న 50 మీటర్ల లోయలో పడిపోయింది. దీంతో లారీలో కూర్చున్న రైతులు పదిమంది చనిపోగా మరో పదిహేను మంది గాయపడ్డారు. వాహనదారుల సమాచారంతో వెంటనే ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు.. క్షతగాత్రులను సమీప ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## కర్ణాటక రోడ్డు ప్రమాదంపై పవన్ కల్యాణ్ స్పందన

- మొదటి పేజీ తరువాయి

కర్నూలు జిల్లా మంత్రాలయంలోని వేద పాఠశాలకు చెందిన విద్యార్థులు హంపిలో ఆరాధనోత్సవానికి వెళుతూ ఈ ప్రమాదానికి గురయ్యారని తెలిసిందని వివరించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని... మృతుల కుటుంబాలకు, క్షతగాత్రులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని పవన్ స్పష్టం చేశారు.

## దావోస్ కాంగ్రెస్ సెంటర్ లో సమావేశానికి కాలినడకన నారా లోకేశ్...

- మొదటి పేజీ తరువాయి

మార్గమధ్యంలో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ట్రాఫిక్ జామ్ లో వాహనం నిలిచిపోవడంతో, తన బృందంతో కలిసి ఆయన రోడ్డు మార్గంలో కాలినడకన కాంగ్రెస్ సెంటర్ చేరుకున్నారు. కీలక సమావేశానికి సకాలంలో చేరుకోవాలన్న ఆయన తపన పట్ల నెటిజన్లు అభినందిస్తున్నారు.

## బీజేపీకి గుడ్ బై చెప్పిన నితీష్ కుమార్: మణిపూర్ నుంచి మొదలైందా..!

**పెన్ పవర్ డెస్క్:** బీజేపీతో నితీష్ కుమార్ తెగతెంపులు చేసుకోబోతున్నారా..! బీజేపీకి గుడ్ బై చెప్పబోతున్నారా..! అంటే అవుననే అనిపిస్తోంది. మణిపూర్ రాష్ట్రంలోని బీజేపీ కూటమి ప్రభుత్వానికి తన మద్దతు ఉపసంహరించుకుంటున్నట్లు జనతాదళ్ యునైటెడ్ పార్టీ అధినేత(%జీుఖఅఘు ఖుశ్రీ (ఖఅఏవఎ%)), బీహార్ సీఎం నితీష్ కుమార్ ప్రకటించారు. మణిపూర్ రాష్ట్రంలో జేడీయూకి ఒకే ఒక్క ఎమ్మెల్యే ఉన్నారు. ఇప్పటి వరకు జేడీయూ ఎమ్మెల్యే బీజేపీకి మద్దతుగా ఉన్నారు. ఇప్పుడు ఆ ఒక్క ఎమ్మెల్యే మద్దతు కూడా విత్ డ్రా చేసుకుంటున్నట్లు ప్రకటించారు నితీష్ కుమార్. మణిపూర్ సీఎం బీరెన్ సింగ్ కు ఈ మేరకు లేఖ రాసింది జేడీయూ పార్టీ. మణిపూర్ లో బీజేపీ ఆధ్వర్యంలోని రాష్ట్ర ప్రభుత్వానికి జనతాదళ్ యూ మణిపూర్ శాఖ.. తన మద్దతును విత్ డ్రా చేసుకుంటుంది.. మా పార్టీ ఏకైక ఎమ్మెల్యే ఎండీ అబ్దుల్ నాసిర్ ను ఇక నుంచి ప్రతిపక్ష ఎమ్మెల్యేగా పరిగణించండి అంటూ లేఖ రాసింది జేడీయూ మణిపూర్ శాఖ. మణిపూర్ లో బీజేపీకి.. జేడీయూ మద్దతు విత్ డ్రా చేసుకోవడం వల్ల ఏర్పడే ప్రమాదం ఏమీ లేదు.. అక్కడి బీజేపీ ప్రభుత్వం కూలిపోదు. కాకపోతే నితీష్ కుమార్ మద్దతు వల్లే కేంద్రంలోని మోదీ ప్రభుత్వం బతుకుతున్నది.. నిలబడింది. కేంద్రంలో ఇంతలా మద్దతు ఇచ్చిన జేడీయూ.. ఇప్పుడు మణిపూర్ లో అనూహ్యంగా ఈ నిర్ణయం తీసుకోవటం ఏంటనేది ఆసక్తిగా మారింది. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వంతోనూ జేడీయూ తెగతెంపులు చేసుకుంటుందా ఏంటీ.. రాబోయే రోజుల్లో జరిగే పరిణామాలకు ఇది సంకేతమా..! అన్న చర్చ మొదలైంది. నితీష్ కుమార్ ఇప్పుడే.. ఇలాంటి నిర్ణయం తీసుకోవటం వెనక కారణాలు ఏంటీ అనేది ఆసక్తిగా మారింది.

2022లో మణిపూర్‌లో జరిగిన ఎన్నికల్లో జేడీ(యూ) పార్టీ నుంచి ఆరుగురు ఎమ్మెల్యేలు గెలిచారు. బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత.. జేడీయూకి చెందిన ఐదుగురు ఎమ్మెల్యేలు బీజేపీ పార్టీలోకి జంప్ అయ్యారు. ప్రస్తుతం జేడీయూలో మిగిలింది ఒక్క ఎమ్మెల్యే మాత్రమే. ఇప్పుడు ఆ ఎమ్మెల్యే మద్దతు ఉపసంహరించుకున్నది జేడీయూ. ప్రస్తుతం కేంద్రంలోని మోదీ ప్రభుత్వం.. జేడీయూ, టీడీపీ మద్దతుతోనే నెట్టుకొస్తున్నది.

## దావోస్‌లో ఒకే వేదికపై ముగ్గురు సీఎంలు

- మొదటి పేజీ తరువాయి

ఆ ముగ్గురు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు, మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్.

ఈ ముగ్గురు ముఖ్యమంత్రులు 2025, జనవరి 22వ తేదీ ఉదయం ఒకే వేదికపై తమ అనుభవాలను పంచుకున్నారు. 'కంట్రీ స్ట్రాటజిక్ డైలాగ్' సమావేశంలో భాగంగా ఈ ముగ్గురు ముఖ్యమంత్రులు ఒకే వేదికపై కనిపించారు. దేశం ఒక యూనిట్‌గా పెట్టుబడులు రాబట్టేలా కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. అలా కలిసినప్పుడు తీసిందే ఈ ఫొటో..

## నా ఒక్కడిపైనే కాదు.. ఇండస్ట్రీ మొత్తం మీద ఐటీ దాడులు

- మొదటి పేజీ తరువాయి

సుకుమార్‌తో పాటు మరికొందరు టాలీవుడ్ ప్రముఖుల ఇళ్లలో ఐటీ అధికారులు సోదాలు చేస్తోన్న సంగతి తెలిసిందే. మంగళవారం (జనవరి 21) ఉదయం మొదలైన ఐటీ అధికారుల తనిఖీలు ఇంకా కొనసాగుతున్నాయి. మొత్తం 55 బృందాలుగా విడిపోయి హైదరాబాద్‌లోని పలు చోట్ల తనిఖీలు నిర్వహిస్తున్నారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, గచ్చిబౌలి, కొండాపూర్ ప్రాంతాల్లో తనిఖీలు జరుగుతున్నాయి. టాలీవుడ్ ప్రముఖుల ఇళ్లు, కార్యాలయాలు, బ్యాంక్ లాకర్లను క్షుణ్ణంగా ఐటీ అధికారులు పరిశీలిస్తున్నారు. నిర్మాత దిల్ రాజు ఇల్లు, ఆఫీసుల్లో ఐటీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. దిల్ రాజు సోదరుడు, కుమార్తె, బంధువుల ఇళ్లలో కూడా ఐటీ అధికారులు తనిఖీలు చేపట్టారు.


వీరు సినిమాలకు పెట్టిన బడ్జెట్, వచ్చిన ఆదాయం వంటి అంశాలపై అధికారులు ఆరా తీస్తున్నట్లు తెలిసింది. టాలీవుడ్‌పై ఒక్కసారిగా ఐటీ అధికారులు నజర్ పెట్టడం ఇండస్ట్రీలో హాట్ టాపిక్ గా మారింది.

## ఆర్జీ కర్ హత్యాచారం కేసులో సంజయ్ రాయ్‌కి ఉరిశిక్ష పడేలా అప్పీల్‌కు వెళతాం: సీబీఐ

### సంజయ్ రాయ్‌కు యావజ్జీవ శిక్షను విధించిన సీల్దా కోర్టు

### కింది కోర్టు తీర్పుపై కోల్‌కతా హైకోర్టులో అప్పీల్‌కు సిద్ధమైన సీబీఐ

### మరణశిక్షకు అర్హమైన కేసంటూ సీబీఐకి న్యాయ సలహా అందడంతో నిర్ణయం



ఆర్జీ కర్ హత్యాచారం కేసులో దోషిగా తేలిన సంజయ్ రాయ్‌కు ఉరిశిక్ష పడేలా తాము అప్పీల్‌కు వెళతామని సీబీఐ తెలిపింది. సంజయ్ రాయ్‌కి సీల్దా కోర్టు యావజ్జీవ కారాగార శిక్షను విధించింది. కింది కోర్టు తీర్పుపై కోల్‌కతా హైకోర్టులో అప్పీల్ చేసేందుకు సీబీఐ సిద్ధమైంది. ఈ కేసు అత్యంత అరుదైన నేరం కేటగిరీలోకి వస్తుందని, మరణశిక్షకు అర్హమైనదంటూ సీబీఐకి న్యాయ సలహా అందడంతో... దోషికి మరణశిక్షను విధించాలని హైకోర్టును కోరనుంది. కింది కోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ సవివరమైన వాదనలతో శుక్రవారం నాటికి అప్పీల్ దాఖలు చేసే అవకాశం ఉన్నట్లు సీబీఐ తెలిపింది.

## అమరావతి నిర్మాణానికి రూ.11 వేల కోట్లు...

### నిధుల విడుదలకు హడ్కో ఆమోదం

- మొదటి పేజీ తరువాయి

కోసం హడ్కోతో సంప్రదింపులు జరిపామని వెల్లడించారు. హడ్కో నిర్ణయంతో రాజధాని పనులు వేగవంతం అవుతాయని తెలిపారు. ఏపీ రాజధాని అమరావతి నిర్మాణం కోసం హడ్కో గతంలోనే రూ.11 వేల కోట్లు కేటాయించింది. దీనిపై గతేడాది అక్టోబరులోనే మంత్రి నారాయణ హడ్కో సీఎండీ సంజయ్ కులశ్రేష్టతో సమావేశమై నిధుల విడుదలపై చర్చించారు. హడ్కో నుంచి రుణం విడుదలకు ఏపీ ప్రభుత్వం చేపట్టాల్సిన చర్యలు, నిధుల వినియోగం తీరుతెన్నులను మంత్రి నారాయణ అప్పట్లోనే హడ్కో సీఎండీకి వివరించారు.

ఈ నేపథ్యంలో, తాజాగా ముంబయిలో జరిగిన హడ్కో బోర్డు సమావేశంలో నిధుల విడుదలకు ఆమోదం లభించింది.

పెన్ పవర్
ఉభయ గోదావరి
కాకినాడ । డా౹౹ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ । తూర్పు గోదావరి । పశ్చిమ గోదావరి । ఏలూరు

# జాతీయ రహదారులపై లైటింగ్ వ్యవస్థ పటిష్ఠం కావాల్సి ఉంది





– కలక్టర్ పి ప్రశాంతి

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, జనవరి 22:**ప్రమాదాలు జరిగిన ప్రదేశాల్లో తీసుకున్న పరిష్కార మార్గాలపై అనాలసిస్ చెయ్యాల్సి ఉంటుందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. బుధవారం ఉదయం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాతీయ రహదారి భద్రత మాసోత్సవం –2025 సందర్భంగా జిల్లా రహదారుల భద్రత కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రమాదాలు జరిగిన సందర్భాల్లో గోల్డెన్ అవర్ లో తీసుకున్న చర్యలను సమీక్షించడం జరిగిన వాటిపై అధ్యయనం చెయ్యాలని స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించి అధ్యయనాన్ని ఆర్ట్స్ కళాశాల అధ్వర్యంలో కేసుల వారీగా విశ్లేషణ చెయ్యాలని పేర్కొన్నారు. జాతీయ రహదారులు ట్రాఫిక్ వారీగా డి.ఎమ్.హెచ్.వోల ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవడం ముఖ్యం అన్నారు. రద్దీ సమయాల్లో ప్రమాదాలు జరగకుండా ట్రాఫిక్ మళ్లింపుపై దృష్టి కేంద్రీకరించాలని పేర్కొన్నారు. పోలీసు, జిల్లా యంత్రాంగం సూచించిన 27 బ్లాక్ స్పాట్స్ ప్రాంతాలలో, 16 ప్రమాద కరమైన రహదారులు,11 జంక్షన్ ప్రాంతాల్లో లైట్నింగ్, క్యాట్ ఐస్, ట్రంబుల్స్ స్ట్రిప్స్, రబ్బర్ స్ట్రిప్స్ ను జాతీయ రహదారులు అధ్వర్యంలో ఏర్పాటు చెయ్యాలని సూచించారు. హిట్ అండ్ రన్ కేసులకు సంబంధించి పరిహారం అందజేయాల్సి ఉంటుందన్నారు. అందుకు అనుగుణంగా ఐ ఆర్ ఎ డి (ఐరాడ్ – ఇంటిగ్రేటెడ్ రోడ్డు ప్రమాద డేటా) డేటా ఎంట్రీ నమోదు చేయడంలో సమన్వయ శాఖల అధికారులు ఖచ్చితంగా విధులను నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జాతీయ రహదారులపై లైటింగ్ వ్యవస్థ పటిష్ఠం కావాల్సి ఉంది ఆమేరకు భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక ప్రకారం ప్రతిపాదనలు సిఫార్సు చెయ్యాలని సమావేశంలో నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు.

ఈ సమావేశాల్లో జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు, అదనపు ఎస్పీ ఏ వి సుబ్బరాజు, జిల్లా రవాణా అధికారి ఆర్ సురేష్, ఎన్ హెచ్ అధికారి సల్మాన్ శారీ, డిఎస్పీ వెంకటేశ్వరరావు, పోలీస్, మెడికల్, ఆర్ అండ్ బి, వైద్య ఆరోగ్య శాఖ, విద్యా తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా బాల రాముని వార్షికోత్సవం



**గంగవరం, పెన్ పవర్ ,జనవరి 22:**అయోధ్యలో బాల రాముడి ప్రతిష్ట సంవత్సరం కాలం పూర్తయిన నేపథ్యంలో మండల కేంద్రమైన గంగవరం లోని రామాలయం, ఆంజనేయస్వామి ఆలయాల వద్ద భక్తులు బుధవారం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామాలయం అర్చకులు శేషాచార్యులు ఆధ్వర్యంలో భక్తులు జైశ్రీరామ్ ఆకారంలో దీపాలు వెలిగించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో గంగవరం ఎస్సై వెంకటేష్ ,హనుమాన్ ఆటో యూనియన్ అధ్యక్షుడు రాంబాబు, రామాలయం అభివృద్ధి కమిటీ కార్యదర్శి మడకం వెంకటరమణ, సమరసత సేవ మండల కోఆర్డినేటర్ కె చిన్నారావు , భక్తులు రమణమ్మ ,సుశీల, రాజా, సాయి వెంకట్ ,రాణి తదితరులున్నారు.



# పాఠశాలల పునర్వ్యవస్థీకరణకు ఖచ్చితమైన సమాచారంతో నివేదికలు సమర్పించాలి



జిల్లా కలెక్టర్ షన్ మోహన్



**కాకినాడ.పెన్ పవర్ జనవరి 22 :**విద్యార్థుల సంఖ్య ఆధారంగా పాఠశాలల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ కొరకు ఖచ్చితమైన సమాచారంతో నివేదికలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి క్లస్టర్ హెడ్ మాస్టర్లు, పర్యవేక్షక అధికారులను ఆదేశించారు.బుధవారం మద్యాహ్నం జిల్లా కలెక్టర్ నియోజక వర్గ ప్రత్యేకాధికారులు, మున్సిపల్ కమీషనర్లు, యండిఓలు, యంఈఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పాఠశాలల పునర్వ్యవస్థీకరణ అంశంపై ఆదేశాలు జారీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్యను మరింత నాణ్యతగాను, పాఠశాలల నిర్వహణను సౌలభ్యవంతంగాను తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల పునర్వ్యవస్థీకరణ చేపట్టిందని, ఇందుకు క్లస్టర్ల వారీగా ప్రస్తుతం నడుస్తున్న పాఠశాలలను వాస్తవంగా హాజరౌతున్న విద్యార్థుల వివరాలను యంఈఓలు, క్లస్టర్ హెడ్ మాస్టర్లు క్రోడీకరించాలని ఆదేశించారు. మున్సిపాలిటీలలో కమీషనర్లు, మండలాల్లో యండిఓలు ఈ ప్రక్రియను పర్యవేక్షించాలని, నియోజక వర్గ ప్రత్యేక అధికారులు క్లస్టర్ ల నుండి సమర్పించిన నివేదికలలోని సమాచారాన్ని రాండమ్ గా తనిఖీ చేయాలని కలక్టర్ ఆదేశించారు. శనివారం ఈ అంశంపై మరో మారు సమీక్షించి, విద్యార్థుల సంఖ్య ఆధారంగా జిల్లాలో పాఠశాలల పునర్వ్యవస్థీకరణ ప్రతిపాదనలను ప్రభుత్వానికి సమర్పించడం జరుగతుందన్నారు.ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ హెచ్.ఎస్.భావన, డిఈఓ పి.రమేష్, జడ్పి సిఈఓ వివిఎస్ లక్ష్మణరావు, ఆర్డిఓలు ఎస్.మల్లిబాబు, కె.శ్రీరమణి, హౌసింగ్ పిడి ఎన్.వివి.సత్యన్నారాయణ, డ్వామా పిడి పి.వెంకటలక్ష్మి, పిఓ–ఎస్ఎస్ఏ, డిఎల్డిఓలు, మున్సిపల్ కమీషనర్లు, యండిఓలు, యంఈఓలు, క్లస్టర్ హెచ్ఎంలు పాల్గొన్నారు.

# ముందుగానే లోకేష్ జన్మదిన వేడుకలు.





**కె గంగవరం పెన్ పవర్ జనవరి 22:** తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు ఒకరోజు ముందుగానే జన్మదిన వేడుకలు వినూత్న రీతిలో జరిపారు రామచంద్రపురం నియోజకవర్గ ప్రజలు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మహిళలు, కూటమి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని నారా లోకేష్ భారీ 42 అడుగుల కట్ అవుట్ కు దిష్టి తీసి, హారతులు పట్టి పూల వర్షం కురిపించారు . వినూత్నంగా జరిగిన ఈ జన్మదినం వేడుకల్లో, పెద్ద ఎత్తున మహిళలు, కూటమి నాయకులు పాల్గొని మంత్రి లోకేష్ ను నిండు మనసుతో చిరకాలం జీవించాలని ఆశీర్వదించారు. చిన్న వయసులో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ తెలుగుదేశం పార్టీ కార్యకర్తల కోసం, పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర కార్మిక శాఖమంత్రి వాసంశెట్టి సుభాష్ సుభాష్ పాల్గొని మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి, కార్యకర్తల సంక్షేమమే ధ్యేయంగా మంత్రి నారా లోకేష్ కృషి చేస్తున్నారని ప్రశంసించారు. కోటి మందికి పైగా సభ్యత్వాలు చేయడంలో మంత్రి లోకేష్ కృషి వర్ణించలేనిదన్నారు. తెలుగుదేశం పార్టీ మంచి ప్రభుత్వమని, రాజకీయ కక్షలు లేకుండా అభివృద్ధి సంక్షేమందిశగా మంత్రి నారా లోకేష్ ఎనలేని సేవలు అందిస్తున్నారని కొనియాడారు. రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తో కలిసి అలుపెరగని కృషి చేస్తున్నారన్నారు. తండ్రి నారా చంద్రబాబు నాయుడు అడుగుజాడల్లో నడుస్తూ పలు సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజాకర్షణ గల రాజకీయవేత్తగా ప్రజల మన్ననలు పొందుతున్నారన్నారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సంక్షేమమే లక్ష్యంగా రూ. 5 లక్షల ఇన్సూరెన్స్ భీమాను అమలులోకి తెచ్చి చరిత్ర సృష్టించారన్నారు. తెలుగుదేశం మంచి ప్రభుత్వమని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారధ్యంలో రాష్ట్రం స్వర్ణాంధ్ర కానుందని మంత్రి సుభాష్ ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం గారు, జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, కూటమి నాయకులు, పెద్ద ఎత్తున మహిళలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# క్షేత్రస్థాయి అధికారులు ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి పెట్టి పనిచేయాలి





● జిల్లా కలెక్టర్ షణ్మోహన్

**జగ్గంపేట, పెన్ పవర్, జనవరి 22:** రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా క్షేత్రస్థాయి అధికారులు ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి పెట్టి పనిచేయాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ షణ్మోహన్ క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా జగ్గంపేట నియోజకవర్గం కిర్లంపూడి, జగ్గంపేట మండలాల్లో పర్యటించి ప్రభుత్వ కార్యక్రమాల అమలు తీరును పరిశీలించారు. తొలుత కిర్లంపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వైద్య ఆరోగ్యశాఖ అధికారితో కలిసి సందర్శించారు. ఆస్పత్రి ద్వారా ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలు, మరుగుదొడ్ల శుభ్రత, నిర్మాణ దశలో ఉన్న అదనపు భవనం పనులను పరిశీలించి వివరాలు ఆరా తీశారు. అనంతరం బూరుగుపూడి గ్రామంలోని చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాన్ని పరిశీలించారు. గ్రామంలోని జనాభా, ఇంటింట చెత్త సేకరణ, పారిశుద్ధ్య కార్యక్రమాలు అమలు, వర్మీ కంపోస్ట్ తయారీ, రైతులకు పంపిణీ వంటి వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం జగ్గంపేట మండలం మామిడాడ గ్రామంలోని లబ్ధిదారుడు దాడి వెంకటేశ్వరరావు నిర్మించుకున్న గోకులం షెడ్డును పరిశీలించి రైతుతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని పాడి రైతులకు సూచించారు. అదేవిధంగా కాండ్రేగుల గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద సమగ్ర చిన్న నీటిపారుదల పునరుద్ధరణ పనులు చేపట్టిన సోమన్న చెరువును గ్రామస్తులతో పాటు పరిశీలించారు. 4.3 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న సోమన్న చెరువు పూడిక పనులు సక్రమంగా పూర్తి చేయాలన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకాని సంబంధించి నిర్దేశించిన పని దినాల సంఖ్య అనుగుణంగా చెరువు పూడిక పనుల్లో పురోగతి చూపించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. అనంతరం జగ్గంపేటలోని పశుసంవర్ధక శాఖ ఆసుపత్రిని పరిశీలించారు. ఆస్పత్రి ఆవరణంలో పరిశుభ్రతపై అధికారులు మరింత శ్రద్ధ పెట్టాలని జిల్లా కలెక్టర్ అధికారులు ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన పనులలో ప్రగతి కనబరచాలన్నారు. నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా క్షేత్రస్థాయి అధికారులు ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి పెట్టి పనిచేయాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న వైద్యాధికారులు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట కిర్లంపూడి, జగంపేట మండలాల ఎంపీడీవోలు బి. హరికృష్ణ, ఎ.చంద్రశేఖర్, కిర్లంపూడి, జగ్గంపేట తహసీల్దార్లు చిరంజీవి, జేవిఆర్.రమేష్, ప్రత్తిపాడు ఏపీడి ఎం.భానుప్రకాష్, డిప్యూటీ డిఎంహెచ్వో డా.సరిత ఇతర అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మండల పరిషత్ అధికారుల నిర్లక్ష్యం..!

- మూలకు చేరిన రిక్షాలు.. నిధులు చెత్త పాలు

**ఏలూరు జనవరి 22 పెన్ పవర్:** చెత్త సేకరించి, ఎదురుగా మార్చి, పంచాయతీలకు ఆదాయ వనరులను అందించాలన్న లక్ష్యంతో నిధులు వెచ్చించి గ్రామ పంచాయతీలకు పారిశుద్ధ్య సేకరణకు రిక్షాలను సమకూర్చింది. అయితే వాటిని గ్రామపంచాయతీలకు పంపిణీ చేయడంలో అధికారులు నిర్లక్ష్యం కారణంగా అవి నిరుపయోగంగా మారి పాడైపోతున్నాయి. గ్రామ పంచాయతీల సిబ్బంది పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా అధికారుల్లో కదలిక లేకపోవడంతో తుప్పు పడుతున్నాయి.

దెందులూరు నియోజకవర్గం పెదపాడు మండలం పాత ముప్పర్రు గ్రామ పంచాయతీ పాటు మరికొన్ని గ్రామపంచాయతీలకు అవసరమైన దానికన్నా ఎక్కువ సంఖ్యలో రిక్షాలు సరఫరా చేయడంతో వాటిని వినియోగించేందుకు కార్మికులు లేక మూలకు చేరాయి. గ్రామపంచాయతీలో పారిశుద్ధ్య సేకరణకు సరిపడినంత లేకపోవడంతో అవి వినియోగంలోకి రాక మూలకు చేరాయి. గత వైకాపా హయాంలో చెత్త సంపద సృష్టి కేంద్రాలను నిర్లక్ష్యంగా వదిలివేయడంతో, చెత్త సేకరణకు ఉపయోగించే రిక్షాలు ఇలా పనికి రాకుండా పడున్నాయి. మండలంలో మరికొన్ని పంచాయతీలలో ఈ విధంగా రిక్షాలు మూలకు చేరాయి. వీటిని అవసరమైన గ్రామపంచాయతీలకు బదిలీ చేయడంలో మండల పరిషత్ అధికారులు నిర్లిప్తత ప్రదర్శించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఆయా గ్రామాల్లో సంపద సృష్టి కేంద్రాలపై దృష్టి సారించినా.. గతంలో కొన్ని వాహనాలు మాత్రం దేనికి పనికి రాకుండా పోయాయి. వాటిని ఏం చేయాలో అధికారులకు, గ్రామపంచాయతీ కార్యదర్శులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. సంబంధిత అధికారులు నిర్ణయం తీసుకుని వాటిని వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.




## వరిధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద సి.పి.ఎం ధర్నా






**వి.ఆర్.పురం పెన్.పవర్.జనవరి.22:**మండలంలోని పెద్దమట్టపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో గత పది రోజులుగా ధాన్యం కొనుగోలు చేయకుండా నిలిపి వేయడాన్ని నిరసిస్తూ బుదవారం మండల సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్ మాట్లాడుతూ రైతులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రానికి తీసుకొని వచ్చి పదిరోజులు గడుస్తున్న ధాన్యం కొనక పోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నారని,కొనుగోలు కేంద్రాలు వరిధాన్యం కొంటాయని,ఆశతో రైతులు ఎదురుచూపులు చూస్తున్నారని, అన్నారు.గోదావరి వరదలు కారణంగా రైతుల వరి వ్యవసాయం వెనుక పడడంతో ఆలస్యంగా వరిధాన్యం పంట వచ్చిన రైతుల గ్రామాలు వెంకన్నగూడెం,రామవరం,చొప్పల్లి, మొద్దులగూడెం,గుర్రంపేట,నూతిగూడెం,సున్నం వారి గూడెం,తదితర గ్రామాల్లో వరి ధాన్యం ఉన్నదని అన్నారు. ఇకనైనా సంబందిత అధికారులు స్పందించి వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలని కోరారు.లేనిపక్షంలో రైతులందరిని సమీకరించి ధాన్యం తీసుకొని వెళ్లి చింతూరు ఐటీడీఏ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం చేపడతామని తెలిపారు.ప్రభుత్వం ప్రతి గింజ కొనుగోలు చేస్తామని చెప్పిందని అధికారులు కొనుగోలు చేయకుండా నిలుపుదల చేస్తున్నారని అన్నారు.ధాన్యం కేంద్రంలో తీసుకొచ్చినటువంటి వరి ధాన్యం ఎండకు ఎండుతూ రోజు రోజుకు ధాన్యం రంగు మారే అవకాశం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ కారం లక్ష్మి,పెద్దమట్టపల్లి సర్పంచ్ వెట్టి లక్ష్మి,సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సోయం చిన్నబాబు,మండల కమిటీ సభ్యులు పొడియం శ్రీరామ్ మూర్తి,శీరపు తాతబాబు,గుండెపూడి లక్ష్మణరావు,కారం సుందరయ్య,కారం సత్తిబాబు,వేటగాని సూరి,రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మెటల్ రోడ్డుకి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే



**జీలుగుమిల్లి, పెన్ పవర్, జనవరి 22:** నియోజకవర్గంలోని సిసి రోడ్లు డ్రైనేజీ వీధిలైట్లు పింఛన్లు ఇచ్చి అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లడం జరుగుతుందని పోలవరం ఎమ్మెల్యే సిరి బాలరాజు అన్నారు. బుధవారం దర్భ గూడెం పంచాయతీ పండు వారి గూడెం నుండి తపిస వారి గూడెం వరకు ఉపాధి నిధులతో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 60 లక్షలతో నిర్మించే మెటల్ రోడ్డుకి శంకుస్థాపన చేశారు. సందర్భంగా మాట్లాడుతూ బర్రింకలపాడు నుండి వంకవారి గూడెం, మడకవారిగూడెం నుండి దర్భ గూడెం వరకు మూడు కోట్ల 60 లక్షలతో మెటల్ రోడ్డు మంజూరు అయిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుండి నియోజకవర్గం అభివృద్ధికి ఎంతో కృషి చేసినట్లు ఆయన తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్రవ్యాప్తంగా ఒకే రోజు ఐదు లక్షల 70 వేల గ్రామసభలు నిర్వహించి ప్రపంచ రికార్డు సృష్టించారని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ప్రధాని నరేంద్ర మోడీకి నియోజకవర్గ అభివృద్ధిపై వారికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల జనసేన పార్టీ అధ్యక్షులు పసుపులేటి రాము, దర్భ గూడెం సర్పంచ్ సున్నం ఉషారాణి, ఎంపీటీసీలు కంచర్ల సుధారాణి, సున్నం సురేష్, ఐ టి డి ఏ ఈ ఈ లత, ఏ ఈ రహీం ,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీ శ్రీ శర్మకు లైఫ్ టైం అచీవ్ మెంట్ పురస్కారం





**ఏలూరు పెన్ పవర్ జనవరి 22:** ఏలూరు ఆర్ఆర్ పేట లోని లేడీస్ క్లబ్ లో ఏలూరు మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ నెలవారి సమీక్ష సమావేశం ఈనెల 19వ తేదీన నిర్వహించారు. ఏలూరు యూనియన్ అధ్యక్షురాలు కోడూరి కనకదుర్గ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో ప్రముఖ విద్యావేత్త, శ్రీశ్రీ విద్యాసంస్థల అధినేత ఎం బి ఎస్ శర్మను లైఫ్ టైం అచీవ్ మెంట్ పురస్కారంతో సన్మానించారు. కైకరం జిల్లా పరిషత్ విద్యార్థిని నిరుసు కుసుమలతకు నగదు పురస్కారాన్ని అందించారు. ఈ సమావేశంలో పలువురు ప్రముఖులను సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీ శ్రీ శర్మ మాట్లాడుతూ ఉత్తమమైన మార్గమన్నారు. తిండి బట్ట వసతి తరువాత సేవ అనేది మానవుడికి పరమార్ధమన్నారు. ప్రతి మనిషి తన సంపాదనలో కొంత శాతం సేవా కార్యక్రమాలకు అందించాలన్నారు. మానవసేవే మాధవసేవ అని గుర్తు ఎరగాలన్నారు. సేవ చేయడం వల్ల మానవుడికి శారీరకంగా, భౌతికంగా మనిషికి ప్రక్షాళన అనేది జరుగుతుందన్నారు. మనిషిలో ఉన్నటువంటి నేను అనే అహంకారం తొలగి, మేము అనే భావన కలుగుతుందన్నారు. స్వచ్ఛంద సేవ కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి మానవతా స్వచ్ఛంద సంస్థ వేదికగా మారిందన్నారు. కుల మతాలకు అతీతంగా మార్చురీలలో ఉచిత శాంతిరదాలతో ప్రారంభమైన మానవతా స్వచ్ఛంద సంస్థ ప్రారంభించిన మానవతా ప్రస్థానం సేవా కార్యక్రమాల్లో భాగంగా పేద విద్యార్థులకు చేయూతనివ్వడం, ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించడం, మహిళలకు స్వయం ఉపాధి కల్పించడం, మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేయడం, పర్యావరణ పరిరక్షణ కోసం గ్రీన్ హౌస్ లను కాపాడడం కోసం, గ్లోబల్ వార్మింగ్, కెరీర్ గైడెన్స్, ఉచిత విద్య, ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహించడం, విద్యాసంస్థల్లో నైతిక విద్యను ప్రోత్సహించడం, వంటి కార్యక్రమాలు అనుసరణీయమన్నారు. అదేవిధంగా తాను కూడా విద్యాసంస్థ అధినేత కావడంతో శ్రీ శ్రీ విద్యాసంస్థలో సామాజిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ కార్యనిర్వాహక సభ్యులు అనురాధ, కార్యదర్శి వల్లూరిపల్లి సాయి సుధా, కోశాధికారి అల్లూరి మోహిని, మానవతా జిల్లా అధ్యక్షులు దేవినేని భాస్కరరావు, జిల్లా కార్యదర్శి పోలవరపు దేవరత్నాకర్ రావు, మండల చైర్ పర్సన్ అడుసుమిల్లి నిర్మల, డెవలప్మెంట్ కమిటీ చైర్మన్ మేతర అజయ్ బాబు, ఏలూరు యూనిట్ కన్వీనర్ వాసిరెడ్డి శేషగిరిరావు, ఎం ఎస్ ఎం ఎస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పంట పొలాలను పరిశీలించిన మండల వ్యవసాయ శాఖ అధికారి కే. సూర్య రమేష్





**సీతానగరం, పెన్ పవర్, జనవరి 22:**సీతానగరం మండలంలోని సింగవరం గ్రామాల్లో బుధవారం నాడు పంట పోలాలను మండలంలోని వ్యవసాయ శాఖ అధికారి కె. సూర్య రమేష్ పరిశీలించారు,ఈ సందర్భంగా రైతులకు అవగాహన కల్పించారు. చీడపీడలు రాకుండా ఎలా రక్షించాలన్న అంశంపై అవగాహన నిర్వహించారు. వరి ఏపుగా పెరగడానికి కొన్ని చిట్కాలు తెలిపారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ శాఖ అధికారి కే. సూర్య రమేష్ మాట్లాడుతూ వారిపై వస్తున్న తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వాతావరణంలో వస్తున్న మార్పులు కారణంగా వరిపై తెగుళ్ల ప్రభావం పడుతుందన్నారు. ప్రతి రైతు ఇ- పంటను నమోదు చేసుకోవాలన్నారు. ఆయా రైతు భరోసా కేంద్రాల వద్ద ఆ గ్రామ రైతులు నమోదు చేసుకోవాలన్నారు. రబీలో సీజన్ లో చేసిన సంబంధించి పంటలకు ఇ- పంట నమోదు ఎంతో మేలు చేస్తుందన్నారు. సేంద్రీయ ఎరువులతో పంటలు సాగు చేయాలనిరైతులకు సూచించారు వ్యవసాయంలో దిగుబడులు పెరిగి ఎక్కువ సంవత్సరాలు పోడు బాగుండాలంటే ఘన, ద్రవ జీవామృతాలను వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ విఏఏ భాగ్యశ్రీ, రైతులు తమ్మిశెట్టి ప్రసన్న కూమార్, సంగనరాజు, బిట్రాశీను, తిరుమళ్ళ ఆంజనేయులు, గద్దే సంతోష్ కూమార్, చాదరాశి నాగేశ్వరరావు , తదితరులు పాల్గొన్నారు.

## 26వ గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లు పరిశీలించిన జేసి చిన్న రాముడు





**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, జనవరి 22:**76వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించే క్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రాంగణాన్ని ఏర్పాటు చెయ్యడం జరుగుతోందని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు పేర్కొన్నారు. బుధవారం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లను పరిశీలించడం జరిగింది.

ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవ వేడుకలను నిర్వహించేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్‌ను అధికారులతో కలిసి పరిశీలించినట్టు చెప్పారు. జిల్లా కలెక్టరు ముఖ్య అతిథిగా పాల్గొని, జాతీయ జెండా ఎగురవేయడం జరుగుతుందని పేర్కొన్నారు. సభావేదిక తదితర ఏర్పాట్లను పరిశీలించామన్నారు. స్టేజ్ ఏర్పాటు బారికేడింగ్, వేడుకలు తిలకించేందుకు వచ్చే విధ్యార్థులకు గ్యాలరీల ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్నాహ్నాం 12 గంటల వరకు వేడుకలు నిర్వహించే క్రమంలో ఎటువంటి అసౌకర్యం కలుగ కుండా ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. వేడుకల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం వివిధ శాఖల ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ అభివద్ధి కార్యక్రమాల సమాహారంగా శాఖల శకటాల ప్రదర్శన, స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ సరఫరా, స్టేజి నిర్మాణంపై అధికారులకి, సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేసారు. సభా ప్రాంగణంలో ప్రత్యేక మెడికల్ క్యాంపును నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సాంస్కతిక కార్యాక్రమాల కోసం వివిధ పాఠశాలల నుంచి ఎంపిక చేసిన విద్యార్థులు జాతీయ స్ఫూర్తిని నింపే కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ మురళీ కృష్ణ, ఇతర జిల్లా అధికారులు, నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు

## జనసేన పార్టీకి ఈసీ గుర్తింపు పై హర్షం



**జీలుగుమిల్లి పెన్ పవర్ జనవరి 22 :**జనసేన పార్టీకి కేంద్ర ఎన్నికల సంఘం గుర్తింపు ఇచ్చి, ఆ పార్టీకి గాజు గ్లాసుని చిహ్నంగా ఇచ్చినట్లు పవన్ కళ్యాణ్ కి లేఖ పంపడంపై హర్షం వ్యక్తం చేస్తున్నట్లు పోలవరం ఎమ్మెల్యే సిరి బాలరాజు అన్నారు. బుధవారం బర్రింకలపాడు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మాట్లాడుతూ జనసేన పార్టీ స్థాపించి పది సంవత్సరాల నుండి నడిచి, సమస్యల కోసం పోరాటాలు చేసినట్లు ఆయన తెలిపారు. పార్టీ సిద్ధాంతాలు ,ఆశయాలు, భావాలు మంచివని అన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి ,మంత్రులకు, ఎంపీలకు, ఎమ్మెల్యేలకు, నియోజకవర్గ ఇన్చార్జి లకు నాయకులకు, కార్యకర్తలకు, వీరా మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు.

## బెన్నబాబుకు అబ్దుల్ కలాం నేషన్ స్టార్ అవార్డు

**అన్నవరం, పెన్ పవర్, జనవరి 22 :** కాకినాడ జిల్లా శంఖవరం మండలం అన్నవరం గ్రామానికి చెందిన ఆర్ఎంపి వైద్యుడు పదిలం బెన్నబాబుకు మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం నేషన్ స్టార్ అవార్డు దక్కింది. గత మూడు దశాబ్దాలుగా విద్య,వైద్య రంగాలలో అనేక సేవలు అందించినందుకు గాను వెల్ రెడ్ ఫౌండేషన్ పశ్చిమ బెంగాల్ వారి ఆధ్వర్యంలో ఆర్ఎంపి వైద్యుడు పదిలం బెన్నబాబు కు ఈ అవార్డు ను ప్రధానం చేసారు. బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ఆర్థిక మంత్రి ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడు చేతులు మీదుగా కలాం నేషన్ స్టార్ అవార్డు ను బెన్నబాబు అందుకున్నారు.ఈ సందర్భంగా బెన్నబాబు మాట్లాడుతూ మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఎ.పి.జె.అబ్దుల్ కలాం నేషన్ అవార్డును ఎమ్మెల్సీ యనమల.రామకృష్ణ చేతులు మీదుగా అందుకోవడం చాలా ఆనందంగా ఉందని తనకు వచ్చిన ఈ అవార్డును అన్నవరం గ్రామ ప్రజలకు మరియు పరిసర ప్రాంత ప్రజలకు అంకితం చేస్తున్నట్లు తెలిపారు.



## ఎమ్మెల్యే ని కలిసిన ముద్రగడ పద్మనాభం కుమార్తె

**జీలుగుమిల్లి ,పెన్ పవర్, జనవరి 22 :**కూటమి ప్రభుత్వంలో నియోజకవర్గంలోని అభివృద్ధిపై ముద్రగడ పద్మనాభం కుమార్తె బర్లపూడి క్రాంతి తో చర్చించినట్లు పోలవరం ఎమ్మెల్యే చిరి బాలరాజు తెలిపారు. బుధవారం బర్రింకలపాడు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆమె కలిశారు. కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలపై, అభివృద్ధిపై ఇరువురు చర్చించినట్లు ఆయన తెలిపారు .ఈమెతోపాటు గోపాలపురం నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్చార్జి దొడ్డి గర్ల సువర్ణ రాజు ,ఎన్డీఏ కూటమి నాయకులు పాల్గొన్నారు.



## భాజపా రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా సత్తి వెంకటరెడ్డి



**గోకవరం పెన్ పవర్ జనవరి 22 :** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా గోకవరం గ్రామానికి చెందిన సత్తి వెంకటరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు కాకినాడ జిల్లా పార్టీ కార్యాలయంనుండి ప్రకటన వెలువడినట్లు వెంకటరెడ్డి తెలిపారు. గతంలో సత్తి వెంకటరెడ్డి బిజెపి గోకవరం మండల అధ్యక్షులుగా పనిచేశారు. మండల అధ్యక్షులుగా సమర్థవంతంగా పార్టీకి సేవలు అందించారు. అంతేకాకుండా ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు కంబాల శ్రీనివాసరావు బిజెపి తీర్థం పుచ్చుకోవడానికి ప్రముఖ పాత్ర పోషించారు. దీంతో జగ్గంపేట, రాజానగరం, రంపచోడవరం మూడు నియోజకవర్గాలలో బిజెపి పార్టీ క్రియాశీలక సభ్యత్వాలు రికార్డు స్థాయిలో నమోదు చేసేందుకు కంబాల శ్రీనివాస్ కృషి చేశారు. ఈ మూడు నియోజకవర్గాలలో భాజపా బలీయమైన పార్టీగా అవతరించింది. పార్టీ బలోపేతానికి అత్యంత కృషిచేసిన సత్తి వెంకటరెడ్డి సేవలను పార్టీ గుర్తించి ఆయనకు రాష్ట్ర కౌన్సిల్ కమిటీ సభ్యునిగా అవకాశం దక్కింది . ఈ సందర్భంగా సత్తి వెంకటరెడ్డి మాట్లాడుతూ క్రింది స్థాయి కార్యకర్తను కూడా బలమైన నాయకుడిగా తయారు చేసే ఏకైక పార్టీ భారతీయ జనతా పార్టీ అని ఆయన అన్నారు. పార్టీ పెద్దలు నాపై ఉంచిన బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వర్తించి,పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన అన్నారు.

## లాటరీలో షాప్ దక్కని వారికీ ఆర్థికంగా ఊరట నివ్వండి

- గీత కులాలకు కేటాయించిన మద్యం షాపుల లైసెన్స్ ఫీజు తగ్గించాలి
- తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బొక్కా ప్రసాద్



**కొత్తపేట, పెన్ పవర్ జనవరి22:**కూటమి ప్రభుత్వం గీత కులాలకు 335 మద్యం షాపులు రిజర్వేషన్ నోటిఫికేషన్ విడుదల చేయడం పట్ల ప్రభుత్వానికి కొత్తపేట నియోజకవర్గ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బొక్కా ప్రసాద్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఒక్కొక్క నియోజకవర్గానికి 1 లేదా 2 షాప్ లు మాత్రమే గీత కులాలకు దక్కే అవకాశం ఉందని కానీ గీత కులాలు యొక్క ఆర్థిక పరిస్థితిని ప్రభుత్వం దృష్టిలో పెట్టుకుని మద్యం షాపులు దరఖాస్తు రుసుం తగ్గించాలని కోరారు. గతంలో ఇచ్చిన మద్యం షాపుల యాజమాన్యం సిండికేట్లుగా మారి మేజర్ పంచాయితీల్లో ఏర్పాటు చేసుకున్నారని ఇప్పుడు గీత కులాలకు వచ్చే మద్యం షాపులు నిర్వహించాలంటే కత్తి మీద సాము లాంటిదని ఆయన అభిప్రాయపడ్డారు. అంతే కాక దరఖాస్తు రుసుం రెండు లక్షల రూపాయిలు నాన్ రిఫండ్ బుల్ కావడం వల్ల గీత కులాలు వారికి మేలు జరిగేది తక్కువన్నారు. ప్రభుత్వం గీత కులాల యొక్క ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందించాలనే దృఢ సంకల్పం తో ఈ నిర్ణయం తీసుకోవడం ఎంతో గొప్పదని కానీ దరఖాస్తు రుసుం తగ్గించడం వల్ల లాటరీ విధానంలో షాప్ దక్కని వారికీ ఆర్థికంగా కొంత ఉరట కలిగే అవకాశం ఉంటుందని లేని యెడల గీత కులాల వారు ఆర్థికంగా ఇబ్బంది పడే సూచనలున్నాయని ఆయన అన్నారు.

## బీజేపీ జాతీయ నేత నల్లా పవన్ ను కలిసిన జిల్లా బీజేపీ అధ్యక్షులు అడబాల



**అమలాపురం రూరల్, పెన్ పవర్, జనవరి, 22:**డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా బీజేపీ నూతన అధ్యక్షులు అడబాల సత్యనారాయణ మరియు రాష్ట్ర ఉపాధ్యక్షులు, పశ్చిమగోదావరి జిల్లా ఎన్నికల పరిశీలకులు, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా బుధవారం బీజేపీ జాతీయ కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు నల్లా పవన్ కుమార్ ని అమలాపురం లో ఆయన నివాసం లో మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా జిల్లా అధ్యక్షులు అయిన సందర్భంగా అడబాల సత్యనారాయణ గారికి నల్లా పవన్ శుభాకాంక్షలు తెలిపి శాలువా తో ఘనంగా సత్కరించి పూల బొకే అందజేసారు. పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షులు ఎన్నికలలో పరిశీలకులుగా వ్యవహరించి ఏకగ్రీవం చేసినందుకు వేమా ను అభినందించి శాలువా తో ఘనంగా సత్కరించారు. అనంతరం వారు నల్లా పవన్ ను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర యువమోర్చా కార్యవర్గ సభ్యులు గనిశెట్టి అరవింద్, బీజేపీ నాయకులు గోకరకొండ గంగన్న స్వామి, అయ్యల భాషా, అరిగెల నాని, చొల్లంగి త్రినాథ్, కాపసెట్టి కనకేశ్వరరావు, యనమదల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్ శ్రీనివాస్ కి పితృ వియోగం



**తాళ్ళపూడి, పెన్ పవర్, జనవరి 22:**తాడిపూడి గ్రామ సర్పంచ్ నామా శ్రీనివాస్(గోపాలం) తండ్రి స్వర్గస్తులైనారు. సర్పంచ్ నామా శ్రీనివాస్ ని పలువురు పరామర్శించి, సానుభూతిని తెలిపారు. ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు, వైఎస్సార్సీపీ జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు గూడా విజయరాజు, కొవ్వూరు నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు యాళ్ల బాబురావు, గజ్జరం సర్పంచ్ గండి రాంబాబు, కొల్లి దుర్గారావు, ఏలీయా, మండల వైసిపి నాయకులు తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

# సాయిచంద్రకు ఏపీటీఎఫ్ నివాళి

**తాళ్లపూడి, పెన్ పవర్, జనవరి 22:** వేగేశ్వరపురంలోని మండల పరిషత్ జూనియర్ బేసిక్ పాఠశాల ప్రధానోపాధ్యాయిని తైలం సాయిచంద్ర శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో తాళ్లపూడి మండల ఏపీటీఎఫ్ యూనియన్ సభ్యులు బుధవారం వేగేశ్వరపురంలోని వారి ఇంటికి వెళ్లి సాయిచంద్ర చిత్ర పటం వద్ద నివాళులు అర్పించారు. సాయిచంద్ర సోదరుడిని ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న ఏపీటీఎఫ్ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు దున్నా దుర్గారావు మాట్లాడుతూ సాయిచంద్ర చాలా మంచి ఉపాధ్యాయిని అని, ఏ పాఠశాలలో పనిచేసినా అంకితభావంతో పని చేసి ఎంతో మంది పిల్లలను తీర్చిదిద్దారని ఇంకా సర్వీసు ఉండగానే అకస్మాత్తుగా కుటుంబాన్ని, తోటి ఉపాధ్యాయులను విడిచి వెళ్లడం చాలా బాధాకరమని అన్నారు. మండల అధ్యక్షులు రఘువీర శాస్త్రి మాట్లాడుతూ యూనియన్ పక్షంగా అన్ని విధాలా సహాయ, సహకారాలు అందిస్తామని అన్నారు. మండల ప్రధాన కార్యదర్శి యాదం శంకరం మాట్లాడుతూ సాయిచంద్ర ఏపీటీఎఫ్ యూనియన్ కు చేసిన సహకారం కొనియాడదగినదని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల



ఉపాధ్యక్షులు రాజారత్నం, కనకదుర్గ, కార్యదర్శులు జి.వి.కె.రాజు, జిల్లా కౌన్సిలర్ పూనెం వెంకట కృష్ణ మోహన్, సభ్యులు గొల్లపల్లి కృష్ణ తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

## వాడపల్లి వెంకన్న హుండీ ఆదాయం 1,47,49,923 రూపాయలు





**ఆత్రేయపురం పెన్ పవర్ జనవరి 22:** కోనసీమ తిరుమల వాడపల్లి క్షేత్రానికి వేలాది గా భక్తులు తరలి వచ్చి ఆ ఏడువారల వెంకన్న ను దర్శించుకున్ని వారి మొక్కులును చెల్లించుకుంటున్నారు. చందన స్వరూపుడు వెంకన్న దర్శనానికి తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా ఇతర రాష్ట్రాలను భక్తులు తరలి వస్తున్నారు. బుధవారం స్వామి వారి హుండీ లెక్కింపు అధికారుల మధ్య ప్రారంభమైంది. రాజమండ్రి తనిఖీ అధికారి టీ.వీ.ఎస్. ఆర్ ప్రసాద్, గన్నవరం దేవాలయం నీవు గ్రేడ్ వన్ అధికారి ఎన్.వి.ఎన్. ఎస్. వి. ప్రసాద్ రాజు, గోపాలపురం దేవాలయం గ్రేటు 2 అధికారి బి కిరణ్, వాడపల్లి దేవస్థానం మాజీ చైర్మన్ కరుటూరు నరసింహారావు, గ్రామ ఉపసర్పంచ్ పోసిరాజు బాబురావు, సమక్షంలో హుండీ లెక్కింపు జరిగింది. ఆలయ ప్రధాన హుండీ 1,0,88,369రూ.,అన్న ప్రసాద హుండీ 22,38,344 రూ, స్వామి వారికి19 గ్రాములు బంగారం,890గ్రాముల వెండి, 50 విదేశీ కరెన్సీ నోట్లు, విశ్వేశ్వర స్వామి హుండీ ఆదాయం 4,22,210 రూ, 40 రోజులకు స్వామి వారి ఆదాయం1,47,49,923 రూపాయలు వచ్చినట్లు ఆలయ ఉప కమిషనర్ ఎన్.ఎస్. చక్రధరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చకులు దేవాలయం సిబ్బంది, గ్రామ ప్రజలు, బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

## కొత్త మంచినీటి మోటార్ ఏర్పాటు



**తాళ్ళపూడి, పెన్ పవర్, జనవరి 22:**వేగేశ్వరపురం గ్రామంలో మరిడి మహాలక్ష్మి గుడి దగ్గర ఉన్న మోటార్ పాడై పోయింది. ఈ విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు వెంటనే స్పందించి కొత్త మోటార్ ను దగ్గరుండి వేయించడం జరిగింది. ప్రజలకు నీటి ఇబ్బంది లేకుండా చేయడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశు రామారావు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొనడం జరిగింది.

## సోని సత్తి బాబుని పరామర్శించిన మెట్ల రమణబాబు



**అమలాపురం రూరల్, పెన్ పవర్, జనవరి,22** :అమలాపురం వెచ్చావారి అగ్రహారం సోనీ విజన్ సత్తిబాబు వారి తల్లి సిద్ధాబత్తుల సూర్యనారాయణమ్మ మృతిచెందారు. వీరికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరిని సీనియర్ తెలుగుదేశం నాయకులు మెట్ల రమణబాబు జంగా వెంకన్న అబ్బాయి, నల్లా సుబ్బారావు (చిన్న) అల్లాడి సోంబాబు, పరామర్శించారు.

## కొనసాగుతున్న పశు వైద్య శిబిరాలు





**సీతానగరం,పెన్ పవర్, జనవరి:22:**జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకం సౌజన్యంతో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం పశు సంవర్ధక శాఖ వారి ఆధ్వర్యంలో సీతానగరం మండలంలో ములకల్లంక గ్రామపంచాయతీ పరిధిలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు, ఈ కార్యక్రమానికి డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు, ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువైద్యశాల నెల 30 తారీఖు వరకు మండలంలోని అన్ని గ్రామాల్లోనూ ఈ శిబిరాలను నిర్వహిస్తామని, రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు ,వైద్య శిబిరాల్లో పశువులకు నట్టల నివారణ, గర్భ సంబంధిత వ్యాధులకు, గొర్రెలకు మసూచి వ్యాధి నిరోధక టీకాలను వేస్తామని, అవసరమైన మందులను ఉచితంగా అందజేస్తామని అన్నారు. సదరు ఈ శిబిరం ద్వారా సుమారు 84 పశువులకు 250 జీవాలకు చికిత్సలు చేయగా 47 మంది రైతులు లబ్ధి పొందారని తెలిపారు, ఈ కార్యక్రమంలో పశు వైద్యశాఖ అధికారి డాక్టర్ ఫణీంద్ర, వెటర్నరీ డాక్టర్లు గ్రామ సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు,

## పశు వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలి

**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, జనవరి 22:** పశు వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులు ఎల్ సుధాకర్ అన్నారు. బుధవారం మండలంలోని పుల్లాయి గూడెం గ్రామంలో లేగ దూడల ప్రదర్శన , పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని తొలుత గ్రామ సర్పంచ్ చీకట్ల మల్లేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకులు సుధాకర్ మాట్లాడుతూ బహు వార్షిక పశుగ్రాసాల సాగు చేపట్టాలని రైతులకు విన్నవించారు. మేలు రకమైన దూడలను పుట్టించి వాటికి సరైన ఆహారాన్ని అందించడం ద్వారా విలువైన పశుసంపదను సృష్టించిన వారమవుతామని తెలిపారు . మంచి పశువు ఎకరం పొలం ఆదాయాన్ని రైతుకు ఇస్తుందని రైతులు వారికి సరైన పశుగ్రాసం అందించడం, వైద్యుల సూచనల మేరకు పెంచితే వారికి అత్యధికమైన ఆదాయాన్ని సమకూర్చిపెడతాయన్నారు. 105 పశువులకు వైద్య చికిత్సలు చేసి ఉచితంగా మందులను అందజేశారు. లేగ దూడల ప్రదర్శనలో ఆలపాటి రాంబాబు కు చెందిన దూడ, కాగిత సూర్యచంద్రరావు దూడ, బాయి శెట్టి చినరాయుడు దూడ ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులు పొందాయి. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మార్లమూడి సుబ్బారావు, కూటమి నాయకులు మైలవరపు సుబ్బారాయుడు, ఆలపాటి రాంబాబు, బద్దిరెడ్డి వాసు, ఆకుల శ్రీను, పట్టపు శెట్టి కృష్ణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలోపశు వైద్యాధికారి డాక్టర్ సునీల్ కుమార్, పశు సంవర్ధక శాఖ సిబ్బంది సత్యనారాయణ, మహేష్, సువర్ణ రాజు, వెంకటేష్, పోసిబాబు, మహేష్, వెంకటేష్, ప్రకాష్, శ్రీను, చిట్టియ్య, సునీల్ తదితరులు పాల్గొన్నారు...

## జీలుగుమిల్లిలో పొగ మంచు



**జీలుగుమిల్లి ,పెన్ పవర్, జనవరి 22 :**జీలుగుమిల్లిలో పొగ మంచు వర్షం వలె కురిసింది. బుధవారం జాతీయ రహదారి అంబేద్కర్ సెంటర్ వద్ద వాహనాలు దగ్గరకు వచ్చేవరకు కనిపించడం లేదు. ఉదయం ఎనిమిది గంటలు అయినా గాని పొగ మంచు విపరీతంగా కురుస్తోంది. వాహనదారులు, పాదాచార్యులు రహదారి కనిపించక ఇబ్బందులు ఎదుర్కొన్నారు .వాహనాలు దగ్గరికి వచ్చే వరకు కూడా కనిపించక పోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు .ఎన్నడూ లేని విధంగా ఈ పొగ మంచు ఇలా కురవడం ఏమిటని ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఈ పొగ మంచి వలన జీడి మామిడి తోటలు పూతలు మాడిపోయే పరిస్థితి ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



## పారిశ్రామిక కాలుష్యం పై చర్యలు తీసుకోవాలి-డిప్యూటీ సీఎంకు మల్లాడి వినతి

**కాకినాడ.పెన్ పవర్ జనవరి 22 :**కాకినాడ తీర ప్రాంతంలో పారిశ్రామిక వ్యర్థాల కాలుష్యానికి వ్యతిరేకంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జనసేన నాయకుడు మల్లాడి రాజేంద్రప్రసాద్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కి లేఖ రాశారు. పర్యావరణ ప్రేమికులుగా, పరిరక్షకులుగా మీరు తీసుకుంటున్న చర్యలకు సమాజం నుండి భారీ స్పందన వస్తుందన్నారు. కాకినాడ తీర ప్రాంతంలో ఉన్న పరిశ్రమలు తమ వ్యర్థాలను సముద్రంలోకి వదులుతుండటంతో మత్స్య సంపదకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని,వ్యర్థాలను శుభ్రం చేసి,కాలుష్య నియంత్రణ నిబంధనల ప్రకారం నిర్ణీత ప్రదేశంలో వదిలివేస్తే తద్వారా మత్స్య సంపదకు ఇబ్బంది కలగదన్నారు. ఓఎన్ జీసీ, రిలయన్స్ కంపెనీల చమురు, గ్యాస్ నిక్షేపాల వెలికితీత వల్ల సముద్ర, నదీ జలాలు కలుషితమవుతున్నాయని లేఖ ద్వారా వివరించారు. తీరప్రాంతం, గోదావరి పరివాహక ప్రాంతాల్లో నివసిస్తున్న మత్స్యకారులు జీవనోపాధి కోల్పోతున్నారని,ఈ కలుషిత వ్యర్థాల కారణంగా మృత్యువాత పడుతున్న అరుదైన ఆలివ్ రిడ్లీ తాబేళ్లను రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ప్రజలు కోరుతున్నట్టు తెలిపారు. ఈ విషయంపై క్షుణ్ణంగా విచారణ జరిపి, తక్షణ చర్య తీసుకోవాలని పవన్ కళ్యాణ్ కు విజ్ఞప్తి చేశారు.

# లక్ష్యాలు సకాలంలో పూర్తి చేయాలి-ఉపాధి హామీ ఎపిఓ ప్రకాష్





**గంగవరం, పెన్ పవర్ ,జనవరి 22:**ఉపాధి హామీ పథకం సిబ్బందికి నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీవో ఎం ప్రకాష్ ఆదేశించారు. బుధవారం స్థానిక ఉపాధి హామీ పథకం కార్యాలయంలో క్షేత్రస్థాయి సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.
ఈ సమావేశం లో వచ్చే మార్చి నాటికి ప్రతీ పంచాయతీ లో కనీసం 10 నుండి 15 ఫాంపాండ్ లు, ఒక ఫిష్ పాండ్,40 ఎకరాల లో ట్రెంచ్ పనులు, ఒక పశువుల షెడ్,50 వ్యక్తి గత సోక్ పిట్ లు నిర్మించాలని లక్ష్యాలుగా నిర్దేశించుకోవాలని ఆదేశించారు. పని కోరిన ప్రతీ ఒక్కరికీ పని ఇవ్వాలని ప్రతీ ఒక్కరికీ రూ 300 రోజు వారి కూలీ వచ్చే టట్టు కొలతల ప్రకారం పని చేయించ వలెనాని ఆదేశించారు. ఈ సమావేశం లో ఉపాధి హామీ పథకం జేఈ పద్మనాభం, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## భారీ అన్న సమారాధన





**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, జనవరి 22:**స్థానిక కొబ్బరితోటలో శ్రీదేవి మహంకాళమ్మతల్లి 45వ వార్షిక జాతర మహోత్సవాలు ఘనంగా జరిగాయి. పది రోజులపాటు ఈ ఉత్సవాలు నిర్వహించారు. ఆఖరు రోజైన బుధవారం ఉదయం నుండి భారీ అన్న సమారాధన నిర్వహించారు. సుమారు 25 వేల మందికి పైగా భక్తులు ఈ అన్న సమారాధనలో పాల్గొన్నారని నిర్వాహకులు తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా కమిటి సభ్యులు పర్యవేక్షించారు.
ఈ అన్నసమారాధనలో తాడేపల్లిగూడెం మాజీ ఎమ్మెల్యే పసల కనకసుందరరావు, బీజెపీ తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్చార్జి ఈతకోట తాతాజీ, పసల అచ్యుతం, పసల చంటి , పాలురి వెంకటేశ్వరావు, గట్టిం మాణిక్యాలరావు ,ఛాంబర్ ఆఫ్ కామర్స్ సెక్రటరీ రవి అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు. అఖండ అన్నసమారాధనలో సత్యసాయి సేవా సంఘం సభ్యులు, హైస్కూల్ వాలంటీర్లు, లలితా సహస్రనామస్తోత్ర పారాయణ కమిటీ సభ్యులు, నవోదయ ఫ్రెండ్స్ యూనియన్ సభ్యులు, వివిధ స్వచ్ఛంధ సంస్థల సభ్యులు సేవా సహకారాలు అందించారు. ఈ కార్యక్రమాన్ని నవోదయ ఫ్రెండ్స్ యూనియన్ అధ్యక్షులు యెగ్గిన నాగబాబు కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు.

## వ్యవహారిక భాష పితామహుడు గిడుగు - విజయ్ కుమార్



**గోపాలపురం,పెన్ పవర్, జనవరి 22:**వ్యవహారిక భాష ఉద్యమ పితామహులు గిడుగు రామ్మూర్తి పంతులు అని గోపవరం ప్రాథమిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గొల్లపల్లి విజయ్ కుమార్ అన్నారు. గిడుగు వర్ధంతి కార్యక్రమం స్థానిక పాఠశాల ఆవరణలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు ఉపాధ్యాయులు మంచిలి కుమారస్వామి మాట్లాడుతూ గ్రాంధిక భాష, మాతృభాష అయిన తెలుగు మనుగడకు అవరోధమని గిడుగు భావించాలన్నారు. ఆనాటి పండితులతో సుదీర్ఘ పోరాటం చేసి వ్యవహారిక భాషను ఉద్యమంగా తీసుకొచ్చిన గిడుగు ఒక పిడుగు అని కొనియాడారు. భాష వేత్తలలో ఎనలేని కీర్తి పొందిన రామ్మూర్తి పంతులు సర్వదా ఆదర్శనీయుడు అన్నారు. సవర భాష వ్యాకరణ కర్తగా, సామాజిక సేవ వేత్తగా పేరుగాంచిన పిడుగు రామ్మూర్తి పంతుల్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. భాష అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయ సహకారాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లికార్జున రావు, కాశి విశ్వేశ్వరరావు, ఫణి కుమార్ శర్మ, భాస్కరరావు, సి ఆర్ పి కొయ్య నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

## టి నీలిమకు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ అవార్డు



**కాకినాడ.పెన్ పవర్ జనవరి 22 :**నిపుణుల బృందం సిఫారసు మేరకు టీ నీలిమ సిద్ధాంత వ్యాసం ఏ స్టడీ ఆన్ ఫోస్టరింగ్ లాంగ్వేజ్ లెర్నింగ్ ఇన్ ఇంగ్లీష్ ఫర్ స్పెసిఫిక్ పర్పస్( ఈఎస్ పి) లెర్నర్స్ అండ్ ఇంటిగ్రేటెడ్ అప్రోచ్ జేఎన్టీయూకే అధికారులచే ఆమోదముద్ర పొందినది.ఈమెకు పిహెచ్డి డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ అవార్డు ఇంగ్లీష్ విభాగంలో లభించింది. తెలంగాణ రాష్ట్రం హైదరాబాదులోని ఈ ఎఫ్ ఎల్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ ఎడ్యుకేషన్ లోని ఇఎల్టి విభాగాధిపతి డాక్టర్ జి సువర్ణ లక్ష్మి ఆధ్వర్య పర్యవేక్షణలో సమర్పించారు.

## అన్నివేళలా అందుబాటులో ఉంటా- ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్,జనవరి 22:**అనారోగ్యం ఉన్న వ్యక్తులకు ఏ సమయంలో అయినా ఆపద వస్తే స్వయంగా తనకు ఫోన్ చేయవచ్చని ప్రభుత్వ విప్, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రిని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని అన్ని విభాగాలను పరిశీలించి అక్కడున్న రోగులను పరామర్శించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ముందుగా మెడికల్ రూము ను పరిశీలించి అక్కడ గడువు దాటిన మందులు ఉన్నాయా లేదో తనిఖీ చేశారు, టెస్టింగ్ ల్యాబ్ లో అన్ని మిషన్లు సరిగా పని చేస్తున్నాయ లేనిది చూశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేషెంట్లు తమ సమస్యలు చెప్పుకునేందుకు స్వయంగా తన ఫోన్ నెంబర్ ఆస్పత్రి వద్ద ఏర్పాటు చేస్తానన్నారు. ఆసుపత్రిలో డయాలసిస్ పేషెంట్ల తాకిడి ఎక్కువగా ఉన్నందున రూ.రెండు కోట్ల తో ప్రత్యేక వసతి ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. త్వరలోనే ఆసుపత్రి నూతన భవనాలు కూడా ప్రారంభోత్సవం చేస్తామని అన్ని రకాలుగా రోగులకు అండగా ఉండేందుకు సిబ్బందికి సూచనలు ఇచ్చామన్నారు.ఏ రోగి కూడా అనారోగ్యంతో వచ్చి ఇబ్బంది పడకూడదని వారికి నూరు శాతం చికిత్స చేసి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా పంపించే విధంగా వైద్యులు సేవలందించాలని సూచించారు. వైద్యుల పనితీరు పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈయన వెంట ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ తాతారావు,జనసేన నాయకులు వర్తనపల్లి కాశి,అడపా ప్రసాద్, పైబోయిన వెంకట్రామయ్య, యాంట్లపాటి రాజు, పాలూరి వెంకటేశ్వరరావు,మైలవరపు రాజేంద్రప్రసాద్, మద్దాల మణికుమార్,అడ్డగర్ర సూరి,ఆడబాల మురళి,యడ్లపల్లి శ్రీరామ్,సూరపు శ్రీను,బయనపాలేపు ముఖేశ్ తదితరులు పాల్గొన్నారు.

## హిందూ దేవాలయాలను సమాజానికి అప్పగించిన తొలి రాష్ట్రంఆంధ్రప్రదేశ్ -డా.బూరగడ్డ శ్రీనాధ్



**ఏలూరు జనవరి 22 పెన్ పవర్** :దేవాలయ ఆస్తుల వివరాలు మరియు భూముల లీజుదారుల వివరాలు,లీజుకు సంబంధించిన పూర్తి సమాచారం పట్టికలో స్పష్టంగాపొందు పర్చాలని,హైందవ సమాజం యొక్క ఆకాంక్ష ను ప్రతిబింబించేలా ప్రతిఒక్కరి చర్యలు ఉండాలని,భక్తుల మనోభావాలను గౌరవించే విధంగా అందరూ నడుచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని విశ్వహిందూ పరిషత్ కృష్ణాజిల్లా అధ్యక్షుడు డా.బూరగడ్డ శ్రీనాథ్ అన్నారు.నేడు ఆ పారదర్శకత ఎంతలా లోపించిందో చెప్పడానికి హైందవ శంఖారావం సభ విజయోత్సవం ఒక చక్కని ఉదహరణ అని,భక్తులు అలాగే హిందూ సమాజం కూడా సహనం కోల్పోవడం వల్లనే విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఇంత పెద్ద యుద్ధం ప్రకటించాల్సి వచ్చిందని, త్వరలోనే దేవాలయాలకు మంచి రోజులు రాగలవని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.ప్రతి దేవాలయంలో సేవల నిర్వహణ మరియు ఆర్ధిక సంబంధమైన సమాచారాన్ని అందరికి అందుబాటులో ఉంచడం కోసం చురుకుగా కృషి చేయాలని, ప్రతి దేవాలయంలో ఈ విషయాలు బహిర్గత పర్చేలా ఒక విస్తృత సమాచార బోర్డు ఏర్పాటు చేయడం మంచిదని,ఈ బోర్డు దేవాలయానికి సంబంధించిన ఆస్తులు మరియు ఆభరణాలను వివరించే ముఖ్యమైన సమాచారానికి కేంద్ర సమాచారంగా పనిచేయాలన్నారు. ఈ సమాచారాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచడం ద్వారా,దేవాలయాలు తమ ఆర్థిక కార్యకలాపాలనుస్పష్టంగా వివరించగలవని,మరియు భక్తులకు వారి విరాళాలు బాధ్యతాయుతంగా నిర్వహించబడుతున్నాయని నమ్మకం కలిగించగలవన్నారు. భౌతిక ఆస్తులను వివరించడమే కాకుండా బోర్డుపై ప్రతి దేవాలయానికి చెందిన భూములు,వాటి నుండి పొందే ఆదాయం లాంటి ముఖ్యమైన వివరాలను కూడా అందించాలని,ఇది దేవాలయ ఆర్థిక స్థితిని మరింత స్పష్టంగా భక్తులు అర్థం చేసుకోవడానికి సహాయపడుతుందన్నారు.దేవాలయ భూమిని ఉపయోగిస్తున్న అద్దెదారుల గుర్తింపులపై పారదర్శకత వీటిలో చాలా ముఖ్యమైనదని.ఈ సమాచారం నిర్వహణా సంస్థల బాధ్యతను పెంచడమే కాకుండా,సమాజానికి ఈ వనరుల నుండి ఎవరు లాభం పొందుతున్నారో గుర్తించడంలో సహాయపడుతుందన్నారు.దేవుని కైంకర్యాలకు ఉపయోగించే వస్తువులు,పూజా సామాగ్రి మరియు వాటి నిర్వహణ సేవల వంటివాటికి అవసరమైన వస్తువుల సరఫరాదారులతో ఉన్న ఒప్పందాలను స్పష్టంగా ఆ బోర్డు లో పేర్కొనాలని, వారి మధ్య గల ఈ ఒప్పందాలను వెల్లడించడం ద్వారా,దేవాలయాలు న్యాయమైన ఆచారాలకు మరియు నైతిక వనరుల సరఫరాలో కట్టుబడిన తమ అంకితభావాన్ని చూపటానికి వీలు ఉంటుందన్నారు.

## జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో జై బాపూజి, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమం

### జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాదేపల్లి సత్యానందం

**కాకినాడ.పెన్ పవర్ జనవరి 22** :ఆల్ ఇండియా కాంగ్రెస్, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పిలుపులో భాగంగా సంవత్సరం పాటు జై బాపూజి, జై భీమ్, జై సంవిధాన్ అనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే విధంగా కార్యక్రమానికి రూపొందిస్తున్నట్లు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాదేపల్లి సత్యానందం ( చిట్టీబాబు ) పేర్కొన్నారు. బుధవారం ఆయన జిల్లా కాంగ్రెస్ కార్యాలయం కళా వెంకట్రావు భావనంలో మీడియాతో మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బాజాపా ప్రభుత్వం మతతత్వ ధోరణి అజెండాగా చేసుకుని ప్రజల్లో మతాల మధ్య చిచ్చు పెడుతుందని ప్రపంచ దేశాల్లో ఎంతో ప్రాదాన్యత కలిగిన భారత రాజ్యాంగాన్ని అవమానించేవిధంగా వ్యవహారించడం జరుగుతుందని చిట్టిబాబు పేర్కొన్నారు. భారత రాజ్యాంగ రూపకల్పనలో క్రియాశీలక పాత్ర పోషించిన వారిని నేటి భాజాపా అవహేళన చేయడం దుర్మార్గపు చర్యని దీనిని ప్రజలు చూస్తూ సహించే పరిస్థితి దేశంలో లేదని అన్నారు. జరుగుతున్న నియంత పాలన దుష్ట, కుట్రలు ప్రజలకు తెలియజేయడం కోసం సంవత్సరం పాటు భారత రాజ్యాగానికి ఎదురువుతున్న అవమాన్ని తెలియజేయడం కోసం జై బాపూజి, జై భీమ్, జై సంవిధాన్ అనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే విధంగా కార్యక్రమానికి రూపొందిస్తున్నట్లు తెలిపారు. దీనికి ఆల్ ఇండియా కాంగ్రెస్, పిసిసి ప్రెసిడెంట్ షర్మిల రెడ్డి, మాజీ కేంద్ర మంత్రి ఎం ఎం పల్లంరాజు కార్యాచరణ అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్ చార్జ్ మరోతి శివగణేష్ మాట్లాడుతూ సువిశాల భారతదేశం లో 140 కోట్లమంది స్వేచ్ఛగా జీవించెందుకు రూపోందించిన భారత రాజ్యాంగం నేడు భాజాపా ప్రభుత్వ ఆరాచకంలో అబాసులు పాలవుతుందని ఆరోపించారు. దీనిలో భాగంగానే రాజ్యాంగ రూపకల్పనలో విశేష సేవలు అందించి తమ మేధస్సును కనబరిచిన మహనీయులు కీర్తి ప్రతిష్టలు, వారి చరిత్ర ను నిర్వీర్యం చేసే కుట్రలో భాగంగా కేంద్ర హొమ్ మంత్రి అమిత్ షా అంబేద్కర్ ను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేయడం జరిగిందని అన్నారు. ఆర్ ఎస్ ఎస్, బాజపా చేస్తున్న కుట్రను ప్రజలకు తెలియ జేయడం కోసం జై బాబుజి, జై భీమ్, జై సంవిధాన్ లక్ష్యం గా ముందుకు వెళ్లడం జరుగుతుందని దీనికి కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు సంసిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.



## తంటికొండ దేవస్థానం హుండీ లెక్కింపు





**గోకవరం, పెన్ పవర్, జనవరి 22 :** జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం తంటికొండ శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామివారి దేవస్థానం హుండీ లెక్కింపు బుధవారం నిర్వహించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వడ్డాది సత్యనారాయణ తెలిపారు.సీతానగరం గ్రూప్ టెంపుల్ కార్యనిర్వహణాధికారి పాటి సత్యనారాయణ పర్యవేక్షణలో హుండీ లెక్కించగా 5 నెలల 15 రోజుల కాలానికి 8,37,212 రూపాయలు వచ్చినట్లు కార్యనిర్వహణాధికారి తెలిపారు.ఆలయఛైర్మన్ బద్దిరెడ్డి అచ్చన్నదొర, గ్రామపెద్దలు,ఇతర అధికారులు హుండీ లెక్కింపులో ఉన్నారు.

## పంచాయతీల అభివృద్ధికి కార్యదర్శులు కీలకం



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, జనవరి 22:** గ్రామ పంచాయతీల అభివృద్ధికి కార్యదర్శుల పాత్ర కీలకమని ఎంపిడిఓ విశ్వనాథ్ శర్మ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుల సంఘ డైరీ ని బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎండిఓ మాట్లాడుతూ కార్యదర్శులు సంఘటితమై ఇటు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిలా పనిచేయాలన్నారు. యూనియన్ తరపున వేసిన డైరీలో ఇటు ప్రభుత్వ విధానాలు, జీవోలతోపాటు సమగ్ర సమాచారం నిక్షేత్రం చేయడం అభినందనీయమ న్నారు. ఈ కార్యక్రమంలో ఇఓపి ఆర్ డి ఎం వెంకటేష్, కార్యదర్శుల సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు, మండల అధ్యక్షులు రావిపాటి వీరబ్రహ్మం, కార్యదర్శి బి ఫణి కుమార్, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు బాలగోపాల శ్రీనివాస చంద్రరాజు, తదితరులు పాల్గొన్నారు.

## జెఇఇ మెయిన్స్ మొదటి దఫా పరీక్షలు ప్రారంభం



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, జనవరి 22:**దేశ వ్యాప్తంగా ఉన్న జాతీయ సాంకేతిక విద్యా సంస్థల్లో ప్రవేశాలకు నిర్వహించే ప్రవేశ పరీక్ష జెఇఇ మెయిన్స్ మొదటి విడత పరీక్ష బుధవారం ప్రారంభమయింది. పరీక్ష కోసం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా మూడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. శ్రీ వాసవి ఇంజనీరింగ్ కళాశాల లో ఉదయం సాయంత్రం పరీక్ష నిర్వహించారు . ఉదయం జరిగిన పరీక్షకు 219 మంది హాజరు కావాల్సి ఉండగా 217 మంది, సాయంత్రం జరిగిన పరీక్షకు 221 మందికి గానూ 220 మంది హాజరు అయినట్లు కళాశాల ప్రిన్సిపాల్ , చీఫ్ సూపరింటెండెంట్ డాక్టర్ రత్నాకరరావు తెలిపారు. మెయిన్స్ పరీక్షలు ఈ నెల 30 వరకు జరగనున్నట్లు ఆయన తెలిపారు. పరీక్ష కేంద్రం కో ఆర్డినేటర్ నటరాజ్, సిస్టమ్ అడ్మిన్ కొల్లా సురేష్ టీసీఎస్ సంస్థ ప్రతినిధులు పరీక్షా నిర్వహణను పర్యవేక్షించారు.

## గోపాలపురంలో దోమల మందు పిచికారి



**గోపాలపురం,పెన్ పవర్, జనవరి 22:**గోపాలపురం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఉప్పరగూడెంలో బుధవారం దోమల మందు పిచికారి చేశారు. గ్రామ సర్పంచ్ పైడి శిరీష,కార్యదర్శి అనురాధల పర్యవేక్షణలో సిబ్బంది వీధి వీధి తిరిగి దోమల మందును కొట్టారు. గ్రామంలో దోమలు వృద్ధి చెందుతున్న నేపథ్యంలో వాటి వలన ప్రజలు అనారోగ్య భారిన పడే అవకాశం ఉందని దోమల నివారణకు మందు ఫాగింగ్ చేయించినట్లు గ్రామ కార్యదర్శి తెలిపారు. ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి అని మురుకునీటి నిలువలు ఉండకుండా చూడాలని సూచించారు.

# నగరంలో పలు అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే కొండబాబు

## పాల్గొన్న కలెక్టర్ ఆర్ డి ఓ ఎమ్మార్వో

**కాకినాడ.పెన్ పవర్ జనవరి 22 :**కాకినాడ నగరంలో నిర్వహించు పలు అభివృద్ధి కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ తో కలిసి దుమ్ములపేట,పర్లవపేట,ఏటిమోగ తదితర ప్రాంతాలను శాసనసభ్యులు వనమాడి కొండబాబు పరిశీలించారు.గత తెలుగుదేశ ప్రభుత్వ హయాంలో దుమ్ములపేట ప్రాంతం నందు పేద వర్గాలకు అందించిన పట్టా భూములను,కాకినాడ నుండి ఏటి మోగ మీదుగా గురజనాపల్లి వరకు నిర్మించు మూడవ బ్రిడ్జి నిర్మాణ ప్రతిపాదన ప్రాంతాన్ని , జగన్నాధపురం ఎం.ఎస్.ఎన్ చాటిస్ నందు గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ప్రతిపాదన తయారుచేసి నిధులు మంజూరు చేసిన ఎం.ఎస్.ఎన్ స్టేడియం ప్రాంతాలను పరిశీలించారు.
ఈ కార్యక్రమంలో కాకినాడ ఆర్డీఓ మల్లిబాబు, కాకినాడ అర్బన్ ఎం.ఆర్వో జితేంద్ర, తదితర అధికారులు పాల్గొన్నారు.



# జనం కోసం పుట్టిందే జనసేన - క్రాంతి



**గోపాలపురం ,పెన్ పవర్, జనవరి 22:**ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ,సమాజ సేవ కార్యక్రమాలు చేపట్టడానికి జనసేన పార్టీ ఉద్భవించిందని కాపు నేత ముద్రగడ పద్మనాభం కుమార్తె ముద్రగడ క్రాంతి అన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పర్యటనలో భాగంగా ఆమె బుధవారం గోపాలపురం నియోజకవర్గాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ దొడ్డిగర్ల సువర్ణ రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ను ఆదర్శంగా తీసుకుని సమాజ సేవకు అంకితం అవ్వాలని పిలుపునిచ్చారు. అలాగే పార్టీ పటిష్ఠతకు జనసేనికులు , వీర మహిళలు కృషి చెయ్యాలన్నారు.సువర్ణరాజు మాట్లాడుతూ క్రాంతి పార్టీ బలోపేతానికి ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. గతంలో జరిగిన ఎన్నికల్లో పిఠాపురం అభ్యర్థి పవన్ కళ్యాణ్ విజయాన్ని కాంక్షిస్తూ విస్తృతంగా పర్యటించి విజయానికి కృషి చేశారన్నారు. అనంతరం క్రాంతి దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన నాయకులు పోసిన గణపతి, మద్దాల కాశీ విశ్వనాథ సనారి, ఉమామహేశ్వరరావు, రగడ రాంబాబు, నరేంద్ర, స్వామి, రామ్ లీలా తదితరులు పాల్గొన్నారు.

# పొలం పిలుస్తోందిలో ఎన్ పి ఎస్ ఎస్ యాప్ పై రైతులకు అవగాహన.





**ఏలేశ్వరం, పెన్ పవర్, జనవరి 22**: మండలంలో నిర్వహిస్తున్న పొలం పిలుస్తుందిలో ఎన్ పి ఎస్ ఎస్ యాప్ పై రైతులకు అవగాహన సదస్సు వ్యవసాయ శాఖ బుధవారం నిర్వహించారు. గత రెండు రోజులుగా మండల పరిధిలో సిరిపురం,పేరవరం, లింగంపర్తి గ్రామాల్లో వ్యవసాయ అనుబంధ శాఖల ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మండల వ్యవసాయ అధికారిణి బి జ్యోతి మాట్లాడుతూ ఎన్ పి ఎస్ ఎస్ యాప్ ను ప్రతీ ఒక్క రైతు రిజిస్ట్రేషన్ చేసుకుని తమ పొలంలో ఉన్న పురుగు తెగుళ్ల వివరాలను ఫోటో తీసి అప్లోడ్ చేయడం ద్వారా నివారణ మార్గాలు తక్షణమే తెలుసుకోవచ్చును అని అన్నారు. క్షేత్ర సందర్శన చేసి ఎన్ పి ఎస్ ఎస్ యాప్ వినియోగం గూర్చి డెమో రూపంలో వివరించారు. జీవన ఎరువులు అజోస్పైరిల్లం, రైజోబియం, పాస్ఫో బాక్టీరియా ల వినియోగం ద్వారా చాలా వరకు ఎరువుల వాడకం తగ్గడంతో పాటు నాణ్యమైన పంటను పండించి మన ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు అని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల ఉద్యానవనశాఖ అధికారి డి శ్రీవల్లి, సిరిపురం గ్రామ నీటి సంఘం అధ్యక్షులు చిలకమర్తి ఆదినారాయణ, పేరవరం గ్రామ సర్పంచ్ భేరి సూర్యవరలక్ష్మి ,
గ్రామ ప్రజా ప్రతినిధులు కర్రి సుబ్బారావు, కర్రీ సూర్యప్రకాష్, అవసరాల కరణం, బర్ల అర్జునరావు, నీటిసంఘము వైస్ ప్రెసిడెంట్ ఏలూరి రాంబాబు, దేగల సత్యనారాయణ, చెరుకు శ్రీనివాస్, వేమగిరి సత్యానందం,నల్లాల బుజ్జి, జ్యోతుల వీరస్వామి, పెంటకోట శ్రీధర్, నూకతాటి ఈశ్వరరావు, గ్రామ వ్యవసాయ ఉద్యానవన సహాయకులు, గ్రామ పశుసంవర్ధక శాఖ సహాయకులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, గ్రామ పెద్దలు , రైతులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల పట్ల ప్రజలు జాగ్రత్తలు పాటించాలి



**జగ్గంపేట, పెన్ పవర్, జనవరి 22:** రోడ్డు ప్రమాదాల పట్ల ప్రజల జాగ్రత్తలు పాటించాలని జగ్గంపేట సీఐ వై ఆర్ కే శ్రీనివాస్ కోరారు. బుధవారం జగ్గంపేటలో బస్టాండ్, ఏలేశ్వరం రోడ్డు, జేవిఆర్ సెంటర్ వరకు వాక్తాన్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జగ్గంపేట ఎస్సై టి.రఘునాథరావు, గండేపల్లి ఎస్సై యువి శివ నాగబాబు, కిర్లంపూడి ఎస్సై జి.సతీష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జగ్గంపేట బస్టాండ్ లో ప్రయాణికులకు రోడ్డు భద్రతా చర్యలను వివరించారు. రోడ్డుపై ప్రయాణించేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు. ప్రమాదాల నివారణకు ప్రజలు సహకరించాలని ప్రకార్డుల ద్వారా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి పెద్ద పీట



● కమిషనర్ భావన

**కాకినాడ.పెన్ పవర్ జనవరి 22 :**ప్రజాసమస్యల పరిష్కారానికి పెద్ద పీట వేస్తూ.. కాకినాడ నగరపాలక కమిషనర్ భావన బుధవారం తెల్లవారుజాము నుంచి పలు ప్రాంతాల్లో పర్యటించారు. ముఖ్యంగా ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వస్తోన్న ఫిర్యాదులపై కమిషనర్ క్షేత్రస్థాయి పరిశీలన చేపడుతున్నారు. దీనిలో భాగంగా నగరంలోని మూడో సర్కిల్, ఆరో వార్డులోని ఖాళీస్థలాన్ని పరిశీలించారు. చెత్తతో అధ్వానంగా ఉన్న ఆ ఖాళీస్థలాన్ని శుభ్రం చేసే పనులను పరిశీలించారు. ప్రైవేటు ఖాళీ స్థలాల యజమానులు తమ స్థలాల్లో చెత్త, మురుగునీరు నిలిచిపోకుండా చూడాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.అలాగే తొమ్మిదో డివిజన్ కన్నయ్యకాపునగర్లో డ్రెయిన్ ధ్వంసమై మురుగునీరు రోడ్డుపైకి వస్తోందంటూ వచ్చిన ఫిర్యాదుపైనా కమిషనర్ భావన క్షేత్రస్థాయిలో పర్యటించారు. డ్రెయినేజీని పరిశీలించారు. వెంటనే మరమ్మతులు చేపట్టాలని సర్కిల్ స్పెషలాఫీసర్ టీపీఆర్వో శైలజకు సూచించారు.ఈ పర్యటనలో కమిషనర్ వెంట అదనపు కమిషనర్ కె.టి.సుధాకర్, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్వైజర్లు, శానిటరీ ఇన్స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సింగమ్మ తల్లి ఉత్సవాలు





**గోపాలపురం / దేవరపల్లి,పెన్ పవర్, జనవరి 22:**నియోజకవర్గంలోని యర్నగూడెం గ్రామ శివారులో కొలువై ఉన్న శ్రీ సింగమ్మ తల్లి అమ్మవారి 27వ వార్షిక మహోత్సవాలు బుధవారం రెండవ రోజుకు చేరుకున్నాయి. మూడు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలు, పూలదండలతో అందంగా అలంకరించారు. భక్తుల సౌకర్యార్థం చలువ పందిరిలు, త్రాగునీటి వసతులు ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వెళ్లి అమ్మవారిని దర్శించుకుని, మొక్కుబడులు చెల్లించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం భారీ అన్న సమారాధన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఉత్సవ కమిటీ నిర్వాహకులు పుట్ట బాలసుబ్రమణ్యం తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించాలని కోరారు. ఇది ఇలా ఉంటే భక్తుల కోరిన కోరికలు తీర్చే అమ్మవారిగా సింగమ్మ తల్లి ఆలయం ఈ ప్రాంతంలో పేరుగాంచింది. ఏడాది పొడవునా భక్తులు వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడును చెల్లించుకుంటారు. ఆలయ ప్రాంగణంలోని వంటలు వండుకొని విందు ఆరగించి తిరిగి ఇంటి ముఖం పడుతూ ఉంటారు. అయితే ఈ ఆలయాన్ని స్వర్గీయ పుట్ట వెంకట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఉత్సవాలు జరిగేవి. ఆలయం వెనుక భాగంలో చింత, తెల్ల మద్ది వృక్షాలు ఒకదానిని ఒకటి పెనవేసుకుని ఉంటాయి. అవి ఇటు ఆలయానికి, భక్తులకు నీడను ఆహ్లాదాన్ని అందిస్తూ ఉంటాయి. సూర్యనారాయణపురం గ్రామ శివారులో జాతీయ రహదారి పక్కనే ఉన్న ఈ అమ్మవారి ఆలయం ఇటీవల దినదిన అభివృద్ధి చెందడం ఆనందదాయకం.

# ఆర్థిక సంఘం నిధులు విడుదలకై కృషి చేస్తా



## రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ

**కాకినాడ.పెన్ పవర్ జనవరి 22 :**కాకినాడ రూరల్ మండలంలోని పంచాయతీ ఎన్నికలు జరగని ఆరు గ్రామాలకు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయడానికి కృషి చేస్తానని కాకినాడ గ్రామీణ శాసనసభ్యులు పంతం నానాజీ పేర్కొన్నారు. స్థానిక గుడారిగుంటలో ఎమ్మెల్యే కార్యాలయంలో రమణయ్యపేట మాజీ సర్పంచ్ అడబాల రత్న ప్రసాద్ ఆధ్వర్యంలో 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల కోరుతూ వినతి పత్రాన్ని ఎమ్మెల్యే నానాజీకి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో 15వ ఆర్థిక సంఘం నిధులు మళ్లించడంతో గ్రామాలలో తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాలు వంటి కనీస వసతులు కరువయ్యాయని అన్నారు. కాకినాడ నగరపాలక సంస్థలో విలీన ప్రతిపాదన ఉన్న ఈ ఆరు గ్రామాలకు పంచాయతీ ఎన్నికలు జరగని కారణం చేత 15వ ఆర్థిక సంఘం నిధులను కేంద్ర ప్రభుత్వం నిలుపుదల చేసిందని అన్నారు.చట్ట ప్రకారం ఈ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించి ఎన్నికైన ప్రజాప్రతినిధుల తీర్మానాన్ని అనుసరించి విలీనం చేయాలా లేదా అనేది నిర్ణయించాల్సి ఉందని అన్నారు. ఈ గ్రామాలకు ఇంటి పన్నులే ఆదాయ వనరుగా ఉండి పారిశుధ్య కార్మికులకు జీతాలు కూడా చెల్లించలేని స్థితి నెలకొంది అని అన్నారు.విలీనంపై కొందరు గ్రామస్తులు న్యాయస్థానంలో వ్యాజ్యం వేయడంతో రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించడం లేదని అన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి ఈ విషయాలను తీసుకువెళ్లి ఆర్థిక సంఘం నిధులు విడుదలకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే ని కలిసిన వారిలో చింతపల్లి సుబ్బారావు, ప్రసాద్ నాయుడు, రాజా, బుద్ధరాజు సత్యనారాయణ రాజు, దాసరి శ్రీధర్ తదితరులు ఉన్నారు.

# ప్రతిభకు సత్కారం



**కాకినాడ.పెన్ పవర్ జనవరి 22 :** తెలుగు సాహితీ లోకంలో వివిధ సాహిత్య ప్రక్రియలో ప్రతిభను కనబరిచిన వారికి శ్రీ శ్రీ కళావేదిక వారు మరియు వరల్డ్ రైటర్స్ ఫారం, వరల్డ్ పోయెట్రీ అకాడమీ, టి ఏ ఎన్ ఏ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంయుక్తంగా జాతీయ ప్రతిభా పురస్కారాలను అందించారు. విజయవాడ నగరంలో శ్రీ కౌత పూర్ణానంద విలాస్ కళావేదికలో జరిగిన జాతీయస్థాయి కార్యక్రమంలో ఈ అవార్డుల ప్రధానోత్సవం నిర్వహించారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకు చెందిన సాహిత్యంలో ప్రతిభ కనబరిచిన యువ కవులకు, రచయితలకు ఈ అవార్డులు అందజేశారు. విశిష్టమైన ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లాకు చెందిన రిటైర్డ్ పోస్ట్ మాస్టర్ అలై డా. తురగా సూర్యారావుకి కవిత–సాహితీ ప్రతిభకు గాను ఆయనకి తెలుగు కీర్తి పురస్కారం అందజేసి దుశ్శాలువా వేసి, గర్లాండ్ వేసి, షీల్డ్ తో సత్కరించినారు.దానికి ఆయన కృతజ్ఞతలు తెలుపుతూ శ్రీ శ్రీ కళావేదిక సీఈఓ అయిన డాక్టర్ కత్తిమండ ప్రతాప్ కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసి శ్రీ శ్రీ కళావేదిక మరింత ముందుకు వెళ్లాలని తురగా సూర్యారావు కోరినారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బోయి భీమన్న సతీమణి బోయి హైమావతి, శ్రీ శ్రీ కళావేదిక సీఈవో డాక్టర్ కత్తిమండ ప్రతాప్, జాతీయ కన్వీనర్ రామావతి, ఈశ్వరి భూషణ్, టీ పి సారథి, డాక్టర్ కే ఎన్ రావు దంపతులు (శంఖారావం) పాల్గొన్న ఈ సభలో కాకినాడ నుండి వేదుల శ్రీరామశర్మ (శిరీష) కూడా పాల్గొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల సాహితీవేత్తలు,కవులు, కళాకారులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు పిల్లి పరామర్శ



**కాజులూరు పెన్ పవర్ జనవరి 22:** మండల పరిధిలోని గొల్లపాలెం గ్రామానికి చెందిన డాక్టర్ సత్తి శ్రీరామ రెడ్డి ఇటీవల అరుణా చలంలో మృతి చెందారు. ఈ నేపథ్యంలో వైసిపి సీనియర్ నాయకులు డాక్టర్ సత్తి శ్రీరామారెడ్డి కుటుంబ సభ్యులను బుధవారం రామచంద్రపురం నియోజకవర్గం గ వైసిపి ఇన్చార్జ్ పిల్లి సూర్యప్రకాష్ తదితర నాయకులు పరామర్శించారు. అరుణాచలంలో శ్రీరామ్ రెడ్డి అకాల మరణానికి గల కారణాలు సూర్యప్రకాశ్ అడిగి తెలుసుకున్నారు.ఏ సమస్య వచ్చినా పార్టీ అండగా నిలుస్తోందని పిల్లలకు మనోధైర్యం కలిపించారు. అనంతరం ఇదే గ్రామం అనారోగ్యంతో మృతి చెందిన కోక వెంకటేశ్వరరావు (బుజ్జి) కుటుంబీకుల పరామర్శించి, ఆయన భౌతిక కాయానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.పార్టీ అభివృద్ధికి వారు చేసిన సేవలను సూర్య ప్రకాష్ కొనియాడారు.మృతుల కుటుంబీకులను పరామర్శించిన వారిలో ఆయనతో పాటు జడ్పీటీసీ వనం వెంకట సుబ్బారావు, ఎంపీటీసీ జొన్నకూటి పద్మజా వెంకటేశ్వరావు పెట్ట శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ కొప్పుల సత్యనారాయణ, మాదిరెడ్డి చిన్ని, ఈశ్వర్ రెడ్డి,ఆర్యవటం మాజీ పిఏసిఎస్ చైర్మన్ కుడిపూడి సూర్యనారాయణ,పృధ్వీరాజ్,పితాని సుబ్రమణ్యం,పెంకె వెంకటరమణ, దంగేటి వెంకన్న,తదితరులు న్నారు.

## మంత్రి గొట్టిపాటిని కలిసిన ఆక్వా రైతులు



**కాజులూరు పెన్ పవర్, జనవరి 22:** రైతు సంక్షేమం కోసం ప్రభుత్వాలు పాటుపడాలంటూ కాకినాడ జిల్లా ఆక్వా రైతులు బుధవారం రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి కొట్టిపాటి రవికుమార్ కలిసి తమ సమస్యలను వివరించారు.కాజులూరు, కరప మండల పరిధి లోని ఆక్వా రైతులంతా కొల్లి హనుమంతరావు, చుండ్రు రుద్ర రావు చౌదరి ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ మంత్రని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి ఉపయోగ గోదావరి జిల్లాల్లో ఆక్వా రైతులు ఆప్కో రైతులు పడుతున్న కష్టాలను మంత్రికి వివరించారు. ఆక్వా కొనసాగించాలంటే రాష్ట్ర ప్రభుత్వం,అధికారులు సహకరించాలని వారు కోరారు. ఈ నేపథ్యంలో ఆక్వా రైతులు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించారని రుద్రరాజు మీడియాకు తెలిపారు.విద్యుత్ సమస్యలు అధిగమించేందుకు త్వరలో చర్యలు చేపట్టనున్నట్లు ఆయన రైతులకు హామీ ఇచ్చారని పేర్కొన్నారు. రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటిని కలిసిన వారిలో జక్కన రాజేష్,సిహెచ్ ఆనందరెడ్డి,బోళ్ల శ్రీను,నెక్కంటి చినబాబు,వనుం నారాయణరావు, కామిరెడ్డి ఈశ్వరరావు,డేగల అబ్బు, తదితర ఆక్వా రైతులు ఉన్నారు.

## సారా విక్రయ కేంద్రాలపై దాడులు

**ఆలమూరు, పెన్ పవర్, జనవరి 22:**ఆలమూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో మండపేటలో నాటు సారా విక్రయిస్తున్న కేంద్రాలపై బుధవారం దాడులు జరిగాయి.ఈ దాడిలో బి.నరేష్,మోరంపూడి సన్యాసిరావును అరెస్టు చేసి వారి వద్ద నుంచి 15 లీటర్లు నాటు సారాను స్వాధీన పరుచుకున్నారు. అనంతరం వారిని ఆలమూరు మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా వారికి 15 రోజులు రిమాండ్ విధించినట్లు ఆలమూరు ఎక్సైజ్ సీఐ ఐడి నాగేశ్వరరావు తెలియజేశారు.ఈ దాడులలో ఎస్సై కే రాంబాబు,సిబ్బంది పాల్గొన్నట్లు తెలిపారు.అలాగే మండపేట రూరల్ మండలం పరిధిలోని జెడ్ మేడపాడు వద్ద అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బట్టల సోమాలమ్మ అనే మహిళ నుంచి ఏడు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆమెపై కేసు నమోదు చేసి నట్లు ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగేశ్వరరావు తెలిపారు. సర్కిల్ పరిధిలోని ఆలమూరు, కపిలేశ్వరపురం,మండపేట మండలాలలో నాటు సారా కానీ, మద్యాన్ని అక్రమంగా విక్రయించినట్లయితే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



## ఆసుపత్రుల అభివృద్ధికి కట్టుబడి పని చేస్తున్నాం



**ఆలమూరు, పెన్ పవర్, జనవరి 22:**ప్రజారోగ్య దృష్ట్యా ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి పని చేస్తుందని కొత్తపేట శాసనసభ్యులు బండారు సత్యానందరావు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని(సిహెచ్సి) నియోజకవర్గ జనసేన ఇంచార్జ్ బండారు శ్రీనివాసరావుతో కలిసి ఆయన క్షుణ్ణంగా పరిశీలించి, సిబ్బందితో సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. ముందుగా ఆసుపత్రిలో ఉన్న రోగుల వార్డులను, ప్రసూతి, మార్చురీ భవనాలను, డ్రైనేజులు తీరు పరిశీలించి, పలు వివరాలను ఆసుపత్రి సిబ్బంది నుండి ఆయన సేకరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ గా ప్రతి అంశాన్ని కూలంకషంగా చర్చించడం జరిగిందన్నారు. ఇందులో వైద్యులను ఇబ్బందులకు గురిచేసే అంశాలు ఉన్నాయన్నారు. స్థానికులు కొందరు మద్యం సేవించి ఆసుపత్రి సిబ్బందిపై దౌర్జన్యం చేసిన సంఘటనపై ఆయన తీవ్రంగా స్పందించారు. ఇటువంటివి పునరావృతం కాకూడదని స్థానిక ఎస్సై ఎం.అశోక్ కు అల్లరిమూకలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇక్కడ ఏడుగురు వైద్యులకు గాను ప్రస్తుతం నలుగురు మాత్రమే ఉండటంతో వైద్య సేవలు రోగులకు తక్కువగా అందుతున్నాయని వైద్యులు తెలిపారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే గైనిక్ డాక్టర్ ఈ ఆస్పత్రికి ఎంతో అవసరమని వెంటనే తీసుకోవడం జరుగుతుందని, అలాగే ఇతర సంబంధిత వైద్యులను భర్తీ చేస్తామన్నారు. డ్రైనేజీ వ్యవస్థ మెరుగు పరిచేందుకు ఆర్డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడి వేగంగా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ఏ.రాజుకు ఆదేశించారు. ఆస్పత్రి పరిసరాలు వర్షం వస్తే నీటి నిల్వలు ఉండకుండా వెంటనే మార్గాలు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే ఆసుపత్రి కమిటీ సభ్యులు, వైద్యులు సమస్యలపై చర్చించుకుని తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఏ.రాజు, ఎస్సై ఎం.అశోక్, ఆసుపత్రి సూపరిండెండెంట్ గోపిరామ్ పిల్లి, కూటమి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## మడికి సచివాలయ కార్యదర్శికి గ్రేడ్-4 పదోన్నతి

**ఆలమూరు, పెన్ పవర్, జనవరి 22:**రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల గ్రామ సచివాలయ గ్రేడ్ 5 కార్యదర్శిలకు గ్రామ పంచాయతీ గ్రేడ్ -4 కార్యదర్శులుగా పదోన్నతి కల్పించిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా ఆలమూరు మండలంకు సంబంధించి మడికి సచివాలయ-2 కార్యదర్శి షేక్ మహమ్మద్ అలీ ఈ పదోన్నతిని పొందారు. మండలంలో ఎనిమిది మంది సచివాలయ గ్రేడ్ 5 కార్యదర్శిలు ఉండగా అందులో ఆలీ ఒకరికే ఈ పదోన్నతి లభించింది. ఈయనకు కౌన్సిలింగ్ ద్వారా గ్రేడ్ -4 గ్రామపంచాయతీలో కార్యదర్శిగా నియమిస్తారు.



# మహిళలు విద్యావంతులు కావాలి

**ఆలమూరు, పెన్ పవర్, జనవరి 22:**మహిళలు విద్యావంతులు కావడం ద్వారా అన్ని రంగాల్లో ఉన్నత శిఖరాలకు చేరుకోగలుగుతారని ఎంపీడీవో ఏ.రాజు అన్నారు. ఆలమూరు మండల డ్వాక్రా మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉల్లాస్ వయోజన విద్య కార్యక్రమంపై రెండో విడత శిక్షణా తరగతులు బుధవారం నిర్వహించారు. మహిళలు కనీస విద్యను అభ్యసించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉల్లాస్ వయోజన విద్యను ఏర్పాటు చేసిందన్నారు. ప్రతీరోజు డ్వాక్రా సంఘాలలో విద్యావంతులైన వారు నిరక్షరాస్యులైన వారిని గుర్తించి విద్యను నేర్పించాలని కోరారు. అంగన్వాడీ కేంద్రాలలో విద్యావంతులైనవారు పది మందికి విద్యను ప్రతీరోజు సాయంత్రం ఐదు నుంచి 7 గంటల వరకు నేర్పించాలన్నారు. అనంతరం శిక్షణకు అవసరమైన పుస్తకాలను అందజేశారు. నోడల్ ఆఫీసర్ విజయభాస్కర్, ఏపీఎం ఎం.ధనరాజు, ఏవో మెహర్ ప్రకాష్, అకౌంటెడ్ కుమార్ పాల్గొన్నారు.



## కమనీయం రమణీయం శ్రీ సీతారాముల కళ్యాణం.. కన్నుల విందుగా







**కళ్యాణం.. మహోద్భుతం..**

**అంగరంగ వైభవముగా శ్రీరాముని శోభాయాత్ర**

**కడప ఎమ్మెల్యే రెడ్డప్ప గారి మాధవి రెడ్డి , శ్రీనివాసుల రెడ్డి దంపతులు**

**కడప, పెన్ పవర్ జనవరి 22:**
కడప నగరమంతా కాషాయంతో శ్రీరాముని అయోధ్య ఐక్య వేదిక వారి ఆధ్వర్యంలో కడప మున్సిపల్ మైదానంలో ఈ రోజు ఉదయం నిర్వహించిన శ్రీ సీతారాముల కళ్యాణంలో ప్రభుత్వ విప్ %ఇ% కడప ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవి , టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు %ఇ% జిల్లా అధ్యక్షులు రెడ్డెప్పగారి శ్రీనివాస రెడ్డి పాల్గొని సీతా రాముల ఆశీర్వాదం పొందడం జరిగింది. అనంతరం
అనంతరం 9 గంటలకు మున్సిపల్ స్టేడియం నుండి శ్రీరాముని మహా శోభా యాత్రలో జయ జయ నినాదాలులతో వేలాదిగా తరలి వచ్చిన భక్తుల శ్రీరామ నామ సంకీర్తనల మధ్య కడప నగర వీధుల మధ్య శోభాయాత్రను ప్రారంభించడం జరిగింది.

# వెల్నెస్ క్లినిక్ ను సద్వినియోగం చేసుకోండి





**కడప , పెన్ పవర్ జనవరి 22 :** ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, కడప నందు ఈ రోజు (బుధవారం) అనగా.. 22 జనవరి 2025 ఉదయం 10 గంటలకు డిఎంఈ, ఏపి వారి ఆదేశాల మేరకు వెల్నెస్ క్లినిక్ ప్రారంభించడం జరిగినది. ఈ వెల్నెస్ క్లినిక్ వారంలో రెండు రోజులు అనగా సోమవారం మరియు బుధవారం ఓపి నెంబర్ 222 లో అందుబాటులో ఉండును ఈ ఓపిని కమ్యూనిటి మెడిసిన్ డిపార్ట్మెంట్ వైద్యులు మరియు డైటీషియన్స్ మరియు నర్సింగ్ సిబ్బంది నిర్వహిస్తారు. జీవనశైలి మార్పులు వల్ల వస్తున్న వివిధ రకాల వ్యాధులు ఉదాహరణకి బీపీ, షుగర్, గుండె జబ్బులు, కిడ్నీ జబ్బులు వంటివి చిన్న వయసులోనే రావడం జరుగుతుంది. ఇలాంటి వాటిని ముందుగానే గుర్తించి నివారించడానికి ఇక్కడ ప్రత్యేక ఓపి నిర్వహించడం జరుగుతుంది. ఈ వెల్నెస్ క్లినిక్ ని ప్రజలు సద్వినియోగం చేసుకొని చిన్న వయసులోనే పైన పేర్కొన్న వ్యాధులు రాకుండా జాగ్రత్త పడవలసిందిగా సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ జి. వి. రమాదేవి గారు, సూపరింటెండెంట్, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, కడప, డాక్టర్ ఎ. సురేఖ గారు, ప్రిన్సిపాల్, గవర్నమెంట్ మెడికల్ కాలేజీ, కడప, ఎస్ పి ఎం డిపార్ట్మెంట్ హెచ్ ఓ డి డాక్టర్ గోపి క్రిష్ణ గారు , సిఎస్ఆర్ఎంఓ డాక్టర్ వై .శ్రీనివాసులు గారు, డాక్టర్ ఎస్. ఆర్. రాజేశ్వరి గారు, ఎస్.పి.ఎం విభాగం లోని వైదులు, సిబ్బంది, నర్సింగ్ సూపరింటెండెంట్ మరియు నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## వెల్నెస్ క్లినిక్ ను సద్వినియోగం చేసుకోండి

**కడప, పెన్ పవర్ జనవరి 22:** ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, కడప నందు ఈ రోజు (బుధవారం) అనగా.. 22 జనవరి 2025 ఉదయం 10 గంటలకు డిఎంఈ, ఏపి వారి ఆదేశాల మేరకు వెల్నెస్ క్లినిక్ ప్రారంభించడం జరిగినది. ఈ వెల్నెస్ క్లినిక్ వారంలో రెండు రోజులు అనగా సోమవారం మరియు బుధవారం ఓపి నెంబర్ 222 లో అందుబాటులో ఉండును ఈ ఓపిని కమ్యూనిటి మెడిసిన్ డిపార్ట్మెంట్ వైద్యులు మరియు డైటీషియన్స్ మరియు నర్సింగ్ సిబ్బంది నిర్వహిస్తారు. జీవనశైలి మార్పులు వల్ల వస్తున్న వివిధ రకాల వ్యాధులు ఉదాహరణకి బీపీ, షుగర్, గుండె జబ్బులు, కిడ్నీ జబ్బులు వంటివి చిన్న వయసులోనే రావడం జరుగుతుంది. ఇలాంటి వాటిని ముందుగానే గుర్తించి నివారించడానికి ఇక్కడ ప్రత్యేక ఓపి నిర్వహించడం జరుగుతుంది. ఈ వెల్నెస్ క్లినిక్ ని ప్రజలు సద్వినియోగం చేసుకొని చిన్న వయసులోనే పైన పేర్కొన్న వ్యాధులు రాకుండా జాగ్రత్త పడవలసిందిగా సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ జి. వి. రమాదేవి గారు, సూపరింటెండెంట్, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, కడప, డాక్టర్ ఎ. సురేఖ గారు, ప్రిన్సిపాల్, గవర్నమెంట్ మెడికల్ కాలేజీ, కడప, ఎస్ పి ఎం డిపార్ట్మెంట్ హెచ్ ఓ డి డాక్టర్ గోపి క్రిష్ణ గారు , సిఎస్ఆర్ఎంఓ డాక్టర్ వై .శ్రీనివాసులు గారు, డాక్టర్ ఎస్. ఆర్. రాజేశ్వరి గారు, ఎస్.పి.ఎం విభాగం లోని వైదులు, సిబ్బంది, నర్సింగ్ సూపరింటెండెంట్ మరియు నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## మండలంలో 56 మందికి షోకాజ్ నోటీసులు జారీ

**-విధులకు గైర్హాజరు కావడం పైనే**
**-ఎంపీడీవో జె. రాంబాబు**

**కాజులూరు పెన్ పవర్ జనవరి 22:** మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశానికి గ్రామ సచివాలయాలలో పనిచేస్తున్న వ్యవసాయ సహాయకులు, విద్యుత్ శాఖ సహాయక సిబ్బంది , గ్రామ సర్వేయర్లు, రెవెన్యూ అధికారులు 56 మందికి ఎంపీడీవో సోఫాస్ నోటీసులు జారీ చేయడం పై టుమారో రైతుంది. గ్రామ సచివాలయం పరిధిలో పనిచేస్తున్న సిబ్బంది కి మండల పరిషత్తు ఢిల్లీలో పెట్టి జీతాలు చెల్లిస్తుందని పేర్కొన్నారు. అయితే ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాను సమావేశాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. జి ఎస్ డబ్ల్యూ డైరెక్టర్ ఆదేశాల మేరకు మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేస్తే గ్రామ పంచాయతీ కార్యదర్శులు మినహా,వివిధ శాఖల సిబ్బంది గైర్హాజరు కావడంతో క్రమశిక్షణ చర్యల్లో భాగంగా జిల్లా ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందని ఎంపిడిఓ సూచించినట్లు వివరించారు.జి ఎస్ డబ్ల్యూ సమావేశానికి డుమ్మా కొట్టిన వారందరూ 24 గంటల్లో సమాధానం ఇవ్వాలని కోరారు.సమాదానం ఇవ్వని సిబ్బందికి జనవరి 9వ తేదీన ఎంపీడీవో నిర్లక్ష్యం వహించిన 56 మందికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు.దీంతో నోటీసులు వ్యవహారం వివాదాస్పదంగా మారింది.తమ శాఖల అధికారుల ఆదేశాల మేరకు విధుల్లోనే పనిచేస్తుంటే మాకు నోటీసులు ఇవ్వడం ఏమిటని ఆయా శాఖల సిబ్బంది ప్రశ్నిస్తున్నారు.అయితే నోటీసులు ఇవ్వడం వాస్తవమే, కొందరు సమాధానం ఇచ్చారు, ఇంకా మరికొందరు సమాధానం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. విద్యుత్ శాఖ కు సంబంధించిన సహాయకులు సమాధానం ఇవ్వలేదని, వారిపై జిల్లా అధికారులు దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందని వివరించారు.మిగిలిన వారి సమస్య తొలగిపోయిందని ఎంపీడీవో జె.రాంబాబు వివరించారు.

# 23న విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక.

**ఆలమూరు, పెన్ పవర్, జనవరి 22:**మండపేట విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలోని సమస్యలు పరిష్కారానికి ఈనెల 23న విద్యుత్ వినియోగదారుల సమస్యల ప్రజా వేదిక నిర్వహిస్తున్నట్లు సిజిఆర్ఎఫ్ కార్యదర్శి ఎన్ మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. మండపేటలో జరిగే వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక లో విద్యుత్ సమస్యలు ఉన్నవారు వచ్చి నేరుగా పరిష్కరించుకోవాలని ఆయన కోరారు. విద్యుత్ శాఖకు సంబంధించిన అన్ని రకాల సమస్యలను పరిష్కరించడం జరుగుతుందన్నారు. విద్యుత్ సమస్యల పరిష్కార వేదికకు సి జి ఆర్ ఎఫ్ చైర్మన్ డి సత్యనారాయణ,సాంకేతిక సభ్యులు ఎన్ ఎం మణి, ఆర్థిక సభ్యులు షేక్ బాబర్ హాజరుకానున్నారని వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి విద్యుత్ సమస్యలను వారి సమక్షంలో పరిష్కరించుకోవాలని మురళీకృష్ణ కోరారు.



# ఉద్యోగ నియామకాల డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ నోట్ అప్రూవల్ ఇవ్వండి

- వైద్య ఆరోగ్యశాఖ నియామకాల్లో ఆరోపణల వెల్లువ
- పబ్లిక్ హెల్త్, క్వాలిటీ కన్సల్టెంట్ నియామకాల్లో రిజర్వేషన్లకు మంగళం
- తన కొడుకు ఉద్యోగం కోసం చక్రం తిప్పిన ఓ పేపరు విలేఖరి
- గతంలో గిరిజనులకు చెందిన ఉద్యోగాన్ని కూతురికి ఇప్పించే విషయంలో కూడా
- ఉద్యోగ నియామకాల్లో ఆరోపణలు మూటగట్టుకున్న డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ
- ఆ నియామకాలను రద్దు చేయాలి
- ఆయా ఉద్యోగ నియామకాలపై ఆర్టిఐ ద్వారా సమాచారం కోరిన
- జాతీయ మానవ హక్కుల కమిటీ, ఉత్తరాంధ్ర చెరువులు పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షులు వంగల దాలినాయుడు




**కురుపాం/ పార్వతీపురం: పెన్ పవర్, జనవరి -22,** ఇటీవల వైద్య ఆరోగ్య శాఖ పార్వతీపురం మన్యం జిల్లాలో జరిగిన నియామకాలకు సంబంధించి డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ చేసిన నోట్ అప్రూవల్ ను ఇవ్వాలని సమాచార హక్కు చట్టం ద్వారా జాతీయ మానవ హక్కుల కమిటీ, ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షులు వంగల దాలినాయుడు సమాచారం కోరారు. బుధవారం ఆయన పార్వతీపురంలోని వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ సూపరింటెండెంట్, ఆర్టిఐ అధికారి పి.యం.కామేశ్వర రావుకు సమాచార హక్కు చట్టం సమాచారానికి చెందిన దరఖాస్తును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లాకు సంబంధించిన వైద్య ఆరోగ్యశాఖ నియామకాలపై పలు ఆరోపణలు వచ్చాయన్నారు. ఆయా నియామకాలకు సంబంధించి చేసిన అప్రూవల్ నోట్ లో ఏమైనా అవకతవకలు జరిగితే తెలుసుకోవచ్చన్నారు. ఆయా నియామకాలు నిబంధనలకు పాతరేసి నగదుకు అమ్ముకున్నారంటూ పత్రికల్లో న్యూస్ వచ్చిందన్నారు . అవి ఎంతవరకు నిజమో తేల్చేందుకే సమాచార హక్కు చట్టం ద్వారా ఆయా ఉద్యోగాలు ఎంపికలో పనిచేసిన డిస్టిక్ సెలక్షన్ కమిటీ వివరాలు, ఆ కమిటీ చేసిన నోట్ అప్రూవల్ సమాచారాన్ని కోరానన్నారు. వైద్య ఆరోగ్య శాఖలో క్వాలిటీ కన్సల్టెంట్, పబ్లిక్ హెల్త్ కన్సల్టెంట్ ఉద్యోగాలతో పాటు టిబి కోఆర్డినేటర్, మెడికల్ ఆఫీసర్, సీనియర్ డిఆర్, హెచ్ఐవి సూపర్వైజర్, అకౌంటెంట్ ఉద్యోగాలు నియామకంలో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయన్నారు . వాటి నియామకాల్లో తన కుమారుడికి ఒక ఉద్యోగం ఇప్పించుకునేందుకు పార్వతీపురానికి చెందిన ఓ పేపర్ విలేఖరి చక్రం తిప్పినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయన్నారు. గతంలో కూడా ఐటిడిఏ పరిధిలో ఉన్న ఓ విద్యాసంస్థలో గిరిజనులకు చెందిన ఒక ఉద్యోగాన్ని ఆ విలేకరి తన కూతురికి ఇప్పించుకున్నారన్నారు. గిరిజనులకు చెందిన ఉద్యోగం ఆ విలేకరి కూతురుకి ఇవ్వటం పట్ల గిరిజన సంఘాలు, గిరిజన నిరుద్యోగులు ఐటిడిఏ కార్యాలయం ముందు టెంట్ వేసి నిరసన దీక్షలు చాపట్టారన్నారు. అయినప్పటికీ ఆ విలేఖరి చెప్పినట్లే పార్వతీపురం మన్యం జిల్లాలో అధికారులు ఆడుతున్నారన్నారు. ముఖ్యంగా ఐటీడీఏ పరిధిలో గాని, వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో గాని ఏ ఉద్యోగాలు నియామకం చేపట్టినా తప్పనిసరిగా ఆ విలేకరి కి ఒక ఉద్యోగం ఇవ్వటం అధికారులు ఆనవాయితీగా పాటిస్తున్నారని ఆరోపించారు. ఈ నియామకాల్లో కూడా ఆ విలేకరి కొడుకుకి కూడా ఒక ఉద్యోగం అధికారులు కట్టబెట్టినట్లు తెలిసిందన్నారు. ఉద్యోగ నియామకాల్లో ఆ విలేఖరి చక్రం తిప్పినట్లు తెలిసిందన్నారు . గతంలో జిల్లా ఆస్పత్రిలో కూడా పలు ఉద్యోగ నియామకాల్లో ఆ విలేఖరి ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయన్నారు. భయంతోనే ఉద్యోగాలు ఇస్తున్నారా లేక ముడుపులు తీసుకొని ఇస్తున్నారనేది తేట తెల్లం చేసేందుకు డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ నోట్ అప్రూవల్ను అడిగినట్లు తెలిపారు. పార్వతీపురం వైద్యారోగ్య శాఖ కార్యాలయం చేపట్టిన ఉద్యోగాలకు తగిన ప్రచారం, సమయం ఇవ్వకుండా, తక్కువ సంఖ్యలో సింగిల్ డిజిట్ లో తాము అనుకున్న వారి నుండి మాత్రమే దరఖాస్తులు స్వీకరించి ఉద్యోగ భర్తీలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయన్నారు . రిజర్వేషన్లు పాటించకుండా ఆ విలేఖరి కూతురు, కొడుక్కి, పలుకుబడి ఉన్న మరి కొంతమందికి అధికారులు ఉద్యోగాలు ఇచ్చినట్లు ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయన్నారు. సమాచార హక్కు చట్టం ద్వారా వచ్చే సమాచారాన్ని బట్టి స్పష్టత వస్తుందన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో నియామకాలన్నీ రిజర్వేషన్లు పాటించకుండా, నిబంధనలను తుంగలో తొక్కి ఉద్యోగ నియామకాలు చేపట్టడం ఎంతవరకు సమంజసమన్నారు. తక్షణమే ఆ నియామకాలన్నింటిని రద్దు చేయాలన్నారు. ఆయా నియామకాలపై దర్యాప్తు నిర్వహించాలన్నారు. దీనికి కారణమైన అధికారులపై చర్యలు చేపట్టాలన్నారు. ఆ విలేఖరి కొడుకు, కూతురుకి ఇచ్చే ఉద్యోగాలపై కూడా దర్యాప్తు నిర్వహించాలన్నారు. ఆయా నియామకాలపై తక్షణమే దర్యాప్తు నిర్వహించాలన్నారు. సమాచారం వచ్చాక పక్కా సమాచారంతో ప్రభుత్వానికి ఫిర్యాదు చేయటంతోపాటు అవసరమైతే న్యాయపరమైన పోరాటానికి వెళతానన్నారు. ప్రభుత్వం స్పందించి ఆయ నియామకాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

## శీతాకాల రుగ్మతలకు ఆయుర్వేదంతోఉపశమనం :డాక్టర్ హేమాక్షి.





**కురుపాం / సీతానగరం మండలం,జనవరి22:** శీతాకాలంలో ప్రబలే పలు ఆరోగ్య సమస్యలకు ఆయుర్వేద వైద్యంతో మంచి ఉపశమనం కలుగుతుందని బూర్జ,ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ టి. హేమాక్షి పేర్కొన్నారు.పలు ఆరోగ్య సమస్యలతో వైద్యశాలకు వచ్చిన వారికి బుధవారం ఆమె తనిఖీలు చేపట్టి ఆయుర్వేద మందులు అందజేసి వినియోగించే విధానాన్ని వారికి తెలియజేసారు. వైద్యశాల ఆవరణలో ఉన్న వివిధ రకాల ఔషద మొక్కలు,వాటి ఉపయోగాలు గురించి అక్కడ వారికి ఆమె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ హేమాక్షి మాట్లాడుతూ ప్రతీ రోజూ ఆసుపత్రికి పలు ఆరోగ్య సమస్యలతో వస్తున్న వారికి ఆరోగ్య తనిఖీల నిర్వహిస్తున్నామని,ముఖ్యంగా ప్రస్తుత చలికాలంలో జలుబు, పడిసెము,దగ్గు,ఆయాసం,ఉబ్బసం,గొంతు నొప్పి,దంత,చర్మ సంబంధిత సమస్యలు ఉంటున్నాయని,ఇందుకు అవసరమైన మందులు ఆయుర్వేద వైద్యశాల లో అందుబాటులో ఉన్నాయని, వృద్ధులు ఎక్కువగా వినియోగించుకుంటున్నారనీ తెలియజేసారు.ప్రాచీన కాలం నుండి మన దేశ ఆయుర్వేద వైద్య విధానాలపై ఎంతో ప్రాచుర్యం ఉందనీ,ఆరోగ్యం విషయంలో ఆయుర్వేదం ఆవశ్యకతపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆయుష్ ఏఎన్ఎం వై.పద్మ ,తదితరులు ఉన్నారు.

## యుపిహెచ్సీ, టీకా కార్యక్రమం తనిఖీ చేసిన డాక్టర్ జగన్మోహన్





**కురుపాం / పార్వతీపురం, పెన్ పవర్, జనవరి22:** జగన్నాధపురం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మరియు టీకా కార్యక్రమాన్ని వైద్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్మోహనరావు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఆరోగ్య కేంద్రంలో స్కానింగ్ కొరకు సమీప గిరిజన గ్రామాల నుండి వచ్చిన గర్భిణీలతో మాట్లాడి ఆరోగ్య తనిఖీ వివరాలు ఎంసిపి కార్డులో పరిశీలించారు.కాన్పు తేదీలపై గర్భిణీలకు స్పష్టమైన అవగాహన కల్పించాలన్నారు. గైనకాలజిస్ట్ డాక్టర్ జి. నిహారిక గర్భిణీలకు యుపిహెచ్సీ లో స్కానింగ్ నిర్వహించారు.ప్రతీ రోజూ ఆరోగ్య కేంద్రానికి తనిఖీల కొరకు ఎంత మంది వస్తున్నారని ఓపి రికార్డులో పరిశీలించారు.వ్యాక్సిన్,మందుల లభ్యతపై అడిగి తెలుసుకున్నారు. లెప్రసీ,ఎన్సిడి సర్వేలు,అంగన్వాడీ,స్కూల్ హెల్త్ స్క్రీనింగ్ ల గురించి అడిగి గుర్తించిన ఆరోగ్య సమస్యలపై దృష్టి సారించి క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించాలన్నారు.

టీకా కార్యక్రమం: అనంతరం డాక్టర్ జగన్మోహన్ కొత్తవలస 7, 8 వార్డులో సార్వత్రిక టీకా కార్యక్రమాన్ని పరిశీలించారు.ఎంత మంది పిల్లలకు టీకాలు వేశారు,టీకా వివరాలు,ఆర్సిహెచ్ రికార్డులో పరిశీలించారు.మొబైల్ లో యూవిన్ పోర్టల్ పరిశీలించి వైద్య సిబ్బందికి తగు సూచనలు చేశారు.శ్వాస సంబంధిత సమస్యలు తలెత్తకుండా నవజాత శిశు ఆరోగ్యాన్ని పర్యవేక్షణ చేయాలన్నారు.గర్భిణీ,శిశు ఆరోగ్య సూచనలకు సంబంధించి పోస్టర్స్ టీకా కేంద్రంలో ప్రదర్శించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఎంజిఎం చాంద్, సూపర్వైజర్స్ సత్తిబాబు,ఇందిర, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

# కూటమి ప్రభుత్వం అభివృద్ధికే ప్రాధాన్యత...





- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు
- రెండు కోట్ల రూపాయలు అభివృద్ధి పనులు కి శంకుస్థాపన.
- రెండు నెలల్లో పది కోట్ల రూపాయలు తో అభివృద్ధి ... బోండా జగన్నాథం

**గాజువాక: పెన్ పవర్ జనవరి 22:**కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి కి పెద్ద పీట వేస్తుందని అని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక నియోజకవర్గం ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. బుధవారం జీవీఎంసీ 87 వార్డు లో రెండు కోట్ల అభివృద్ధి పనులు కి శంకుస్థాపన చేసారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ పనులు అన్ని పూర్తి చేస్తామని ఇండోర్ స్టేడియం మరియు మరిన్ని అభివృద్ధి పనులు చేయటం లక్ష్యం గా పెట్టుకున్నామని అన్నారు.అనంతరం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, స్థానిక కార్పొరేటర్ బోండా జగన్నాథం మాట్లాడుతూ రెండు నెలల్లో సుమారు పది కోట్ల రూపాయలు తో అభివృద్ధి పనులు కి శంకుస్థాపన చేయనున్నామని అన్నారు. స్మార్ట్ వార్డు గా అభివృద్ధి చేస్తానని గ్రేటర్ లో అభివృద్ధి లో ప్రథమ స్థానం మన వార్డు ఉండేటట్లు చేస్తానని హామీ ఇచ్చారు. దశబ్ద కాలం గా పెండింగ్ లో ఉన్న గ్రౌండ్ న ఎమ్మెల్యే సహకారం తో పూర్తి చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు రాజన్ రాజ, జిల్లా నాయకులు దివ్య అప్పారావు, కల్లేపల్లి శ్రీనివాస్ వర్మ, సీనియర్ నాయకులు ప్రగడ దానయ్య, పావడ రమణమూర్తి, ఆనంద్ కుమార్, సూరిశెట్టి పెంటారావు, ద్రోణాద్రి అప్పలనాయుడు , జనసేన నాయకులు ఇందిరా ప్రియదర్శిని, కర్రి నరసింగరావు,కనితి ఈశ్వరరావు, గెద్దాడ రాంబాబు, మల్లా రాము, గెద్దాడ అప్పారావు, పోతల కృష్ణ,కడుపుట్ల శ్రీను, జోసెఫ్, నాగేశ్వరరావు , జాన్ రమేష్, ఆదినారాయణ, కోరుకొండ కళ్యాణ్ చక్రవర్తి, సూరిబాబు, రాజు, దేముడు, పాల్, సాయి వర్మ, మాటూరి రాము, భాస్కర్,కర్రి రాజు, గణేష్, రధాలమ్మా శెట్టిబలిజ సేవా సంఘం, గణేష్ నగర్ అసోసియేషన్, తిరుమల నగర్ అసోసియేషన్, సిద్ధార్థ నగర్ అసోసియేషన్, సచివాలయం సిబ్బంది, ఆర్ పి లు, మహిళలు పాల్గొన్నారు

# ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి..

- పశు వైద్యాధికారిణి డా: శైలజ...





**కురుపాం, పెన్ పవర్, జనవరి-22,**పశు ఆరోగ్య శిబిరాల ను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్య అధికారిణి శైలజ అన్నారు. బుధవారం . మండలంలోని నీలకంఠపురం గ్రామంలో దూడ లకు, గొర్రెలు ,మేకల కు నట్టల నివారణ , ఆవులకు గర్భకోస చికిత్స, చూడి పరీక్షలు ను డా: శైలజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పాడి రైతులకు పశు వైద్య శిబిరాలు, వాటి ఉపయోగము వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మన్మదరావు గారు, మాజీ ఎంపిపి నీలకంటేశ్వరరావు , మాజీ ఎంపీటీసీ నానాజీ , ప్రదీప్ , సిబ్బంది,రైతులు పాల్గొన్నారు.

# ఎనిమిది అభివృద్ధి పనులకు శంకుస్థాపన

రూ.కోటిన్నర వ్యయంతో పనులకు శ్రీకారం





**గాజువాక పెన్ పవర్ జనవరి 22:** జీవీఎంసీ 65 వ వార్డులో తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు,ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సుడిగాలి పర్యటన చేశారు.వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహ పాత్రుడుతో కలిసి సుమారు రూ.కోటిన్నర వ్యయ%శీ%తో చేపట్టనున్న ఎనిమిది అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.తొలుత భానోజి కోలనీలోని ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్యే,కార్పొరేటర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఇక్కడి పాఠశాల,అంగన్వాడీ భవన%శీ% పరిస్థితిని కార్పొరేటర్ ఎమ్మెల్యేకు వివరించారు.ఆ తర్వాత సంజీవి కోలనీలో శిలా ఫలకాన్ని ఆవిష్కరించి అనంతరం వాంబే కోలనీలో పర్యటించారు.ఇక్కడ పాత సామాజిక భవనాన్ని పూర్తి స్థాయిలో ఆధునీకరించి చేపట్టే పనులకు భూమి పూజ చేశారు.కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో అభివృద్ధి,సంక్షేమ%శీ% పరుగులు పెడుతోంది అన్నారు.ప్రజల అవసరాలను తీర్చడమే లక్ష్యంగా ఆయా అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు.65 వ వార్డుని ఆదర్శంగా తీర్చిదిద్దే%శీ%కు పూర్తి సహకారం అందిస్తానని చెప్పారు.ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ శేషాద్రి,ఈఈ అప్పారావు,కార్పొరేటర్లు పల్లా శ్రీనివాస్,గంధం శ్రీనివాస్,నియోజకవర్గ సమన్వయ కర్త ప్రసాదుల శ్రీనివాస్,వార్డు తెదేపా అధ్యక్షుడు రట్టి వాసు,ఇంచార్జ్ బైపిల్లి గాంధీ,కార్పొరేషన్ డైరెక్టర్ కృష్ణ,జనసేన నాయకురాలు రెయ్యి రత్నం,కృష్ణ,సుజాత,ఉమా,మహాలక్ష్మి,జగదీశ్,స్వరూపారాణి,సింగంపల్లి దేముడు,శివంగి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

# 27న కురుపాంలో సంకల్ప్ మెగా జాబ్ మేళా

జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

**కురుపాం /పార్వతీపురం, పెన్ పవర్, జనవరి 22 :** ఈ నెల 27వ తేదీ ఉదయం 9.00గం.ల నుంచి కురుపాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సంకల్ప్ మెగా జాబ్ మేళా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన జారీ చేశారు. ఆం.ప్ర.రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధికల్పనలో భాగంగా 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, ఏదైనా డిగ్రీ చదువుకొని, 18 ఏళ్ళు నిండి 28 ఏళ్ల లోపు వయసు గల నిరుద్యోగ యువతీ యువకులు ఈ జాబ్ మేళాకు హాజరుకావచ్చన్నారు. ఈ మేళాలో 23 కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరై, అర్హత కలిగిన అభ్యర్థులను వారి కంపెనీలోకి తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ వివరించారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు తమ వివరాలను హెచ్ టి టి : // నైపుణ్యం . ఏ పి.గౌ . ఇన్ వెబ్ సైట్ నందు తప్పనిసరిగా నమోదు చేసుకొని, రిఫరెన్స్ నెంబర్ తో పాటు బయోడేటా, ఆదార్ కార్డు, విద్యార్హత సర్టిఫికేట్లు ఒరిజినల్ మరియు జెరాక్స్, ఒక పాస్ పోర్ట్ సైజ్ ఫోటోతో సోమవారం ఉదయం 9.00గం.లకు జాబ్ మేళా జరిగే ప్రదేశానికి హాజరుకావాలని స్పష్టం చేశారు. మరిన్ని వివరాలకు 63034 93720, 89788 78557 మొబైల్ నెంబర్లను సంప్రదించి తెలుసుకోగలరని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# అంతా క్లియర్... పోర్టు వివాదానికి ఫుల్ స్టాప్

**కాకినాడ, జనవరి 22, పెన్ పవర్:** కాకినాడ సీ పోర్టుకు సంబంధించి గత కొన్ని నెలలుగా జరుగుతున్న వివాదం ఎట్టకేలకు ఓ కొలిక్కి వచ్చింది. కేవీరావుకు కాకినాడ పోర్టుకు సంబంధించిన వాటాలను అరబిందో తిరిగి ఇచ్చేసింది. దీంతో కాకినాడ సెజ్ అరబిందో వశమైంది. కేవీరావుకు కాకినాడ సీ పోర్టు, అరబిందోకు కాకినాడ సెజ్ కేటాయింపుపై రాజీ కుదిరినట్లు తెలుస్తోంది. దీంతో గత ఎనిమిది నెలలుగా సాగుతోన్న వివాదానికి ఫుల్‌స్టాప్ పడినట్లు అయింది.అప్పట్లో రూ.2,500 కోట్ల విలువైన 2.15 కోట్ల షేర్లను తన వద్ద రూ. 494 కోట్లకే లాగేసుకున్నారని కేవీరావు ఆరోపించారు. అదే సమయంలో కాకినాడ సెజ్‌లో కేవీరావుకు చెందిన 8 వేల ఎకరాలు అరబిందో సొంతమైంది. వైసీపీ హయంలో బలవంతంగా వాటాలను బదిలీ చేసుకున్నారని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సీఐడీకి కేవీరావు ఫిర్యాదు చేశారు. సీఐడీ ఫిర్యాదు ఆధారంగా రూ.494 కోట్ల చెల్లింపులపై ఈడీ కూడా రంగంలోకి దిగి, మనీలాండరింగ్ కేసు నమోదు చేసింది. ఇప్పటికే వైసీపీ ఎంపీ వి.విజయసాయి రెడ్డి, వైవీ విక్రాంత్ రెడ్డిలను ఈడీ అధికారులు విచారించారు. దీంతో ఈ వివాదం కీలకమలుపు తిరిగింది. కేవీరావు నుంచి అప్పట్లో తీసుకున్న వాటాలను అరబిందో సంస్థ తిరిగి ఆయనకే అప్పగించింది. దీంతో కాకినాడ సీపోర్టు డీల్ రివర్స్ అయింది. కాకినాడ సీపోర్టు మళ్లీ పాత యజమాని కేవీరావు చేతికే దక్కిందికాకినాడ సీపోర్టుకు సంబంధించిన 41.12 శాతం వాటాలను కేవీరావుకు మూడు రోజుల క్రితమే అరబిందో బదిలీ చేసినట్లు తెలుస్తోంది. ఈ వివాదంపై పై స్థాయిలోని వ్యక్తులు రంగంలోకి దిగి, ఇరు పక్షాలను కూర్చోబెట్టి మధ్యవర్తిత్వం చేశారని సమాచారం. పెద్ద స్థాయిలోనే డీల్ కుదిరినట్లు సమాచారం. పోర్టులోని వాటాలను బదిలీ చేసేందుకు సిద్ధపడిన అరబిందో ఒక షరతు పెట్టింది. సెజ్‌ను వదిలేయాలంటూ షరతు విధించింది. దీనికి సమ్మతించిన తరువాతే అరబిందో పేరుతో ఉన్న 2.15 కోట్ల షేర్లు కేవీరావుకు బదిలీ చేసినట్లు తెలిసింది. దీనికి సంబంధించి అప్పట్లో కేవీరావుకు అరబిందోకు ఇచ్చిన మొత్తాన్ని, షేర్లు బదిలీ చేయడంతో తిరిగి అరబిందోకి కేవీరావు ఇచ్చేశారని తెలిసింది. దీంతో కాకినాడ పోర్టు కేవీరావు వశమైంది. మరోవైపు కాకినాడ సెజ్‌లో ఉన్న కేవీరావుకు చెందిన 8 వేల ఎకరాలను అరబిందో వశమైంది. ఇప్పుడు ఎవరి వ్యాపారాలు వారు చేసుకోవాలని పెద్దలు రాజీ కుదిర్చిన సమయంలో పేర్కొన్నట్లు తెలిసింది.1990లో కాకినాడ సీపోర్టును ఏడీబీ రుణంతో నిర్మించారు. ప్రభుత్వం నిర్మించిన ఈ పోర్టును 1998లో చంద్రబాబు, దాని నిర్వహణ బాధ్యతను ప్రైవేట్ వ్యక్తులకు ఇచ్చారు. అలా ఆ పోర్టు కేవీరావుకు వచ్చింది. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం అండతో కేవీరావుకు చెందిన కాకినాడ సీపోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్‌లోని 41 శాతం వాటాలను అరబిందో రియాల్టీ బదిలీ అయ్యాయి. అప్పుడు అరబిందో యాజమాన్యం తాము 41 శాతం వాటాలను కొనుగోలు చేసుకున్నామని చెప్పింది. అయితే కేవీరావు మాత్రం తనను బెదిరించి వాటాలను లాక్కొన్నారని ఆరోపించారు. అంతేతప్ప వాటిని తిరిగి పొందడానికి పెద్దగా న్యాయపోరాటం చేసిన దాఖలాలు లేవు. ఏం చేసిన ఫలితముండదని కేవీరావు భావించి ఉండొచ్చని పలువురు అంటున్నారుఅయితే 2024 ఎన్నికల్లో ప్రభుత్వం మారింది. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అప్పటి వరకు మిన్నకున్న కేవీరావు ఒక్కసారిగా అరబిందో తనను బెదిరించి సీపోర్టులోని వాటాలను లాక్కొందని విమర్శిస్తూ సీఐడీకి ఫిర్యాదు చేశారు. దీంతో సీఐడీ కేసు నమోదు చేసి విచారణ మొదలెట్టింది. అరబిందోకు చెందిన విక్రాంత్ రెడ్డికు సీఐడీ నోటీసులు ఇచ్చింది. సీఐడీ విచారణ ప్రారంభించింది. మరోవైపు ఈడీ కూడా మనీలాండరింగ్ కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించింది. దీంతో విక్రాంత్ రెడ్డి బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌లో కేవీరావు ఇన్‌ప్లీడ్ అయ్యారు. ఇలా కాకినాడ పోర్టు వివాదం సాగుతున్న నేపథ్యంలో వాటాలను వెనక్కి ఇచ్చేందుకు అరబిందో అంగీకరించి, బదిలీ చేసినట్లు తెలిసింది. దీంతో ఈ వివాదానికి ఫుల్‌స్టాప్ పెట్టినట్టు అయింది.

# ఎందుకీ డిప్యూటీ సీఎం అంశం

**విజయవాడ, జనవరి 22, పెన్ పవర్:** మంత్రి నారా లోకేష్‌ను డిప్యూటీ సీఎం చేయాలంటూ ఇటీవల వరుసగా టీడీపీ నేతలు గొంతు విప్పుతున్నారు. ఏపీలో టీడీపీ-బీజేపీ- జనసేనల కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఆర్నెల్లు పూర్తయ్యాయి. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎంగా జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఉన్నారు. మంత్రి వర్గంలో మూడు పార్టీల నేతలు ఉన్నారు. ఈ క్రమంలో గత నాలుగైదు రోజులుగా మంత్రి నారా లోకేష్‌ను డిప్యూటీ సీఎం చేయాలనే డిమాండ్ అనూహ్యంగా తెరపైకి వచ్చింది.నారా లోకేష్‌ను డిప్యూటీ సీఎం చేయాలనే డిమాండ్ ఇప్పటికిప్పుడు అనూహ్యంగా పుట్టుకొచ్చిందా, దీనికి వేరే కారణాలు ఉన్నాయా అనే చర్చ రాజకీయ పార్టీల్లో జోరుగా సాగుతోంది. సమయం, సందర్భం లేకుండా ఎందుకు లోకేష్‌ను డిప్యూటీ సీఎం చేయాలనే డిమాండ్‌ను టీడీపీ ఎమ్మెల్యేలు, మంత్రులు భుజానికి ఎత్తుకున్నారనే సందేహాలు అందరిలోను ఉన్నాయి.టీడీపీ నేతల డిమాండ్లు వ్యూహాత్మకంగా చేసినవేననే అనుమానాలు కూడా ఇతర పార్టీల్లో ఉన్నాయి. ఈ క్రమంలో ఈ డిమాండ్ల వెనుక ఇతర కారణాలపై కూడా రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది.ఈ వివాదానికి అసలు కారణం తిరుమలలో వైకుంఠ ఏకాదశి టోకెన్ల జారీ సందర్భంగా జరిగిన తొక్కిసలాట ఘటనగా తెలుస్తోంది. వైకుంఠ ఏకాదశి దర్శనం టోకెన్ల జారీ సందర్భంగా తిరుపతిలోని బైరాగిపట్టెడలో ఉన్న రామానాయుడు స్కూల్ సమీపంలోని పద్మావతి పార్క్‌లో తొక్కిసలాట జరిగి ఆరుగురు భక్తులు జనవరి 8వ తేదీన ప్రాణాలు కోల్పోయారు.ఈ ఘటన జరిగిన మర్నాడు సీఎం చంద్రబాబు ప్రమాద స్థలాన్ని సందర్శించారు. ముఖ్యమంత్రి బాధితుల్ని పరామర్శించిన తర్వాత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కూడా ఘటనా స్థలాన్ని సందర్శించి బాధితుల్ని పరామర్శించారు. సాధారణంగా ముఖ?యమంత్రి పర్యటన తర్వాత ఇతర మంత్రులు విడిగా పర్యటించాల్సిన అవసరం ఉండదు. సీఎం పర్యటనలో వైద్య శాఖ మంత్రి సత్యకుమార్, బీజేపీ నేతలు కూడా పాల్గొన్నారు. ఘటన జరిగిన తర్వాత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వచ్చే వరకు జనసేన ముఖ్య నేతలు ప్రమాదం జరిగిన ప్రాంతానికి రాలేదు.దర్శనం టోకెన్లు 9వ తేదీ గురువారం తెల్లవారుజామున జారీ చేయాల్సి ఉండగా బుధవారం ఉదయం నుంచి కౌంటర్ల వద్దకు భారీగా జనం చేరుకున్నారు. రామానాయుడు హైస్కూల్ జాతీయ రహదారికి దగ్గర్లో ఉండటంతో ఎక్కువ మంది టోకెన్ల కోసం అక్కడికే వచ్చారు. వారందర్నీ స్కూల్ దగ్గర్లో ఉన్న పార్కులోకి పంపి తాళాలు వేశారు. రాత్రి 8.40 గంటల సమయంలో ఓ మహిళ అస్వస్థతకు గురి కావడంతో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఆమెను బయటకు తీసుకు రావడానికి గేటు తీశారు. అప్పటికే పార్కులో సామర్థ్యానికి మించి జనం ఉన్నారు.సరిగ్గా అదే సమయంలో పార్కులోకి మరో 50మందిని అనుమతించారు. ఓ రాజకీయ పార్టీ ద్వితీయ శ్రేణి నాయకుడు ఒత్తిడి చేయడంతో వారిని లోపలకు పంపారు. గేట్లు తీయడంతో క్యూ లైన్లలోకి వదులుతున్నారని వెనుక ఉన్నవారు భావించారు. దీంతో ఒక్కసారిగా అలజడి చెలరేగింది. అప్పటికే ఉదయం నుంచి తిండితిప్పలు లేకుండా ఉన్న జనం బయటకు వెళ్లేందుకు ముందుకు పరుగులు తీశారు. ఇదంతా కూటమి పార్టీల్లోని ఓ చోటా నాయకుడి నిర్వాకం వల్ల జరిగిందని ఘటన జరిగిన రోజే పోలీసులు ప్రభుత్వానికి స్పష్టం చేశారు.తొక్కిసలాటలో ఆరుగురు భక్తులు ప్రాణాలు కోల్పోవడంతో ప్రభుత్వం ఆత్మరక్షణలో పడింది. పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో దిద్దుబాటు చర్యలు చేపట్టాల్సి వచ్చింది. అదే సమయంలో కూటమి ప్రభుత్వంలో ఉన్న పవన్ కళ్యాణ్



బాధితుల పరామర్శ సందర్భంగా చేసిన వ్యాఖ్యలు ప్రభుత్వాన్ని ఇరకాటంలోకి నెట్టేశాయి. టీటీడీ ఛైర్మన్‌తో పాటు అందరూ క్షమాపణలు చెప్పాలని పవన్ ఏ ఉద్దేశంతో చేసినా అంతిమంగా ప్రభుత్వానికి మాత్రం విమర్శలు తప్పలేదు. పోలీసుల్ని, టీటీడీని బాధ్యుల్ని చేస్తూ పవన్ వ్యవహరించిన తీరు టీడీపీ నేతల్లో చాలామందికి రుచించలేదుతిరుపతిలో తొక్కిసలాట ఘటనకు కారణాలు స్పష్టంగా తెలిసినా పవన్ డిమాండ్‌తో తిరుపతి ఎస్పీని ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ నిర్ణయం వైసీపీకి బాగా ఊరటనిచ్చింది. తిరుపతి ఎస్పీ ముఖ్యమంత్రికి సన్నిహితుడని వైసీపీ పలుమార్లు విమర్శలు గుప్పించింది. పవన్ డిమాండ్ కారణంగా ఎస్పీ సుబ్బారాయుడును ప్రభుత్వం బదిలీ చేసింది. పొత్తు ధర్మం కోసం చంద్రబాబు సర్దుకుపోతున్నా జనసేన నుంచి తగిన సహకారం లేదనే భావన టీడీపీలో ఉంది. జనసేన తరపున తీసుకునే ఏ నిర్ణయానికైనా చంద్రబాబు సంపూర్ణంగా సహకరిస్తున్నారని ఈ క్రమంలో అనవసర రాద్ధాంతం దేనికనే వాదన టీడీపీ చేస్తోంది.పవన్ కళ్యాణ్ ఇటీవల కర్నూలు జిల్లాలో గ్రీన్ కో సంస్థ నిర్మిస్తోన్న పవర్ ప్లాంటును సందర్శించారు. అటవీ పర్యావరణ మంత్రిగా ఉన్న పవన్ కర్నూలు జిల్లాలో నిర్మిస్తోన్న పంప్డ్ స్టోరేజీ పవర్ ప్లాంట్ నిర్మాణాన్ని సందర్శించారు. ఈ పర్యటన తర్వాతే టీడీపీ వైఖరిలో మార్పు వచ్చిందని జనసేన అనుమానిస్తోంది. డిప్యూటీ సీఎం హోదాలో పవన్ కళ్యాణ్ పర్యటనలపై టీడీపీకి అభ్యంతరం ఉండాల్సిన అవసరం ఏముందనేది ఆ పార్టీ వాదనగా ఉంది.కూటమి పార్టీల తరపున నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో కూడా జనసేన కార్యకర్తలు పవన్ కళ్యాణ్‌ను ఉద్దేశించి సీఎం సీఎం అంటూ చేస్తోన్న నినాదాలు కూడా టీడీపీలో అసంతృప్తికి కారణం అయ్యాయి. సమయం సందర్భం లేకుండా చేస్తోన్న ఈ నినాదాలపై పవన్ కూడా బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నినాదాలు కూడా ఉద్దేశ పూర్వకంగా జరుగుతున్నవనే అనుమానాలు టీడీపీలో ఉన్నాయి.మరోవైపు డిప్యూటీ సీఎంగా ఉన్న పవన్ కళ్యాణ్ కంటే నారా లోకేష్ ఎక్కువ అధికారాన్ని అనుభవిస్తున్నారనే భావన జనసేనలో ఉంది. కూటమి ప్రభుత్వంలో ఏ శాఖలో ఎలాంటి నిర్ణయం తీసుకోవాలన్నా అంతిమంగా నారా లోకేష్ అనుమతి పొందాలనే క్లారిటీ టీడీపీ మంత్రులకు స్పష్టత ఉంది. ఇది జనసేన వర్గాలకు రుచించడం లేదు. పేరుకు డిప్యూటీ సీఎం అయినా లోకేష్ వద్దే ఎక్కువ అధికారం ఉందని జనసేన భావిస్తోంది.పవన్ కళ్యాణ్ ఇటీవల సోదరుడు నాగబాబును మంత్రి వర్గంలో తీసుకోవాలనే డిమాండ్‌ను తెరపైకి తెచ్చారు.నాగబాబు రాజ్యసభకు పంపాలని ప్రయత్నించినా మూడింటిలో ఒక స్థానం బీజేపీకి ఇవ్వడంతో జనసేనకు అవకాశం దక్కలేదు. 21 మంది ఎమ్మెల్యేలు ఉన్న జనసేన పార్టీలో పవన్‌కు సీఎం పదవి, నాగబాబుకు మంత్రి పదవి వంటి డిమాండ్లు చేస్తే 135మంది ఎమ్మెల్యేలు ఉన్న పార్టీలో లోకేష్‌ను డిప్యూటీ సీఎం చేయాలని అడిగితే తప్పేంటనే వాదన టీడీపీ వర్గాలు చేస్తున్నాయి.అదే సమయంలో జనసేనలో ఒక కులానికి మాత్రమే ప్రాధాన్యత ఇవ్వడం కూడా చర్చనీయాంశంగా మారింది. మంత్రి పదవులు, ఎంపీలు, ఎమ్మెల్సీ అవకాశం, పిఏసీ ఛైర్మన్, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ఛైర్మన్ వంటి పదవులు పవన్ చెప్పిన వారికే ఇచ్చారని టీడీపీ గుర్తు చేస్తోంది. నాగబాబుకు మంత్రి పదవి విషయంలో కూడా ఎలాంటి పేచీ పెట్టలేదని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు.లోకేష్‌ను టీడీపీతో చంద్రబాబు రాజకీయ వారసత్వాన్ని అందించే క్రమంలో తాజా డిమాండ్లు పుట్టుకొచ్చాయి. చంద్రబాబు తర్వాత ఆ పగ్గాలు నారా లోకేష్‌కు దక్కాలని టీడీపీ భావిస్తోంది. అదే సమయంలో ఏపీలో శాశ్వత రాజకీయ భవిష్యత్తు కోసం జనసేన ప్రయత్నాలు చేస్తోంది. పవన్ కళ్యాణ్ ముఖ?యమంత్రి అయ్యేందుకు ఏ అవకాశాన్ని జారవిడుచుకోకూడదని జనసేన భావిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో రెండు కులాలకు పరిమితమైన అధికార పగ్గాలను ఎప్పటికైనా దక్కించుకోవాలనే అకాంక్ష జనసేనలో బలంగా ఉంది.ప్రస్తుతం చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వానికి ఎలాంటి ఢోకా లేదు. రాజకీయ అవసరాల దృష్ట్యా అన్ని పార్టీలతో సర్దుకుపోయే ధోరణిలోనే చంద్రబాబు ఉన్నారు. అదే సమయంలో కుమారుడి రాజకీయ భవిష్యత్తు విషయంలో కూడా బాబు స్పష్టమైన అవగాహన ఉంటారని టీడీపీ సీనియర్లు చెబుతున్నారు. లోకేష్‌కు డిప్యూటీ సీఎం పదవి డిమాండ్ కాకతాళీయంగా పుట్టుకొచ్చిందా, దీని వెనుక ముందస్తు వ్యూహాలు ఉన్నాయా అనేది కాలమే తేలుస్తుంది.

## మళ్లీ రాజ్యసభకు అన్నయ్య...



**విజయవాడ, జనవరి 22, పెన్ పవర్:** రాజకీయ వ్యూహాలు రచించడంలో నరేంద్ర మోదీ, అమిత్ షా ద్వయం దిట్ట. ఏ నిర్ణయం తీసుకున్నా దానివల్ల బీజేపీకి ఎంత లబ్ధి జరుగుతుందనే ఈ ఇద్దరు నేతలు ఆలోచిస్తారు. ప్రస్తుత రాజకీయాల్లో ఇది చాలా అవసరం. గతంలో వీరిద్దరు తీసుకున్న నిర్ణయాలు బీజేపీకి ఎంతో లాభం చేశాయి. అయితే.. అవి నార్త్ ఇండియా వరకే పరిమితం అయ్యాయి. సౌత్‌పై పట్టు కోసం వీరు ఎంత ప్రయత్నించినా.. అనుకున్న స్థాయిలో ఫలితాలు రావడం లేదు. దీంతో ప్రాంతీయ పార్టీలపై ఆధారపడాల్సి వస్తోంది.ఈ నేపథ్యంలో బీజేపీ మరో గట్టి ప్లాన్ వేసినట్టు పొలిటికల్ సర్కిల్‌లో టాక్ వినిపిస్తోంది. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలపై బీజేపీ ఫోకస్ పెట్టిందని తెలుస్తోంది. ఇప్పటికే ఏపీలో పవన్‌కు రూట్ మ్యాప్ ఇచ్చిన బీజేపీ.. ఇప్పుడు తెలంగాణపైనా నజర్ పెట్టింది. ఈ క్రమంలోనే మెగాస్టార్ చిరంజీవిని తమవైపునకు తిప్పుకునే ప్రయత్నం చేస్తోంది. చిరంజీవిని మళ్లీ రాజ్యసభకు పంపాలని బీజేపీ ప్రయత్నిస్తున్నట్టు తెలిసింది.ఇటీవల ఢిల్లీలోని కిషన్ రెడ్డి ఇంట్లో సంక్రాంతి వేడుకలు జరిగాయి. ఈ వేడుకలకు ప్రధాని మోదీ వచ్చారు. మెగాస్టార్ చిరంజీవి కూడా ఈ వేడుకలకు హాజరయ్యారు. మోదీ, చిరంజీవికి ఎంతో ప్రాధాన్యం ఇచ్చారు. ఈ పరిణామాలే చిరంజీవిని రాజ్యసభకు పంపిస్తారనే ఊహాగాణాలకు బలం చేకూరుస్తున్నాయి. అయితే.. మళ్లీ పొలిటికల్ ఎంట్రీ ఇవ్వడం చిరుకు ఇష్టం లేదనే టాక్ వినిపిస్తోంది.దీనికి బీజేపీ మరో ప్లాన్ వేసినట్టు తెలుస్తోంది. బీజేపీలో చేరకున్నా.. రాష్ట్రపతి కోటాలో అన్నయ్యను పెద్దల సభకు పంపాలని ప్లాన్ చేస్తున్నట్టు కామెంట్స్ వినిపిస్తున్నాయి. ఇప్పటికే సుధామూర్తి లాంటివారిని అలాగే రాజ్యసభకు పంపారు. చిరంజీవిని కూడా ఇదే తరహాలో పంపాలని బీజేపీ ఆలోచిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఈ కారణంగానే పవన్ మరో సోదరుడు నాగబాబును రాజ్యసభకు పంపకుండా ఆపారనే చర్చ జరుగుతోంది.దక్షిణాది రాష్ట్రాల్లో ఒక్క కర్ణాటకలో మినహా.. వేరే ఎక్కడా బీజేపీకి చెప్పుకోదగ్గ స్థాయిలో బలం లేదు. సొంతంగా పోటీ చేసే దమ్మున్నా.. ఫలితాలు ఆశించిన స్థాయిలో వస్తాయనే నమ్మకం లేదు. అయితే.. మెగా ఫ్యామిలీకి ఏపీ, తెలంగాణలో భారీ స్థాయిలో ఫ్యాన్ బేస్ ఉంది. దీన్ని ఉపయోగించుకోవాలని బీజేపీ ప్లాన్ చేస్తున్నట్టు తెలుస్తోంది. 2029 అసెంబ్లీ ఎన్నికల వరకైనా.. పవన్, చిరు ద్వారా బలపడాలని బీజేపీ ఆలోచిస్తున్నట్టు తెలుస్తోంది.బీజేపీ ఇప్పటికే పవన్‌కు బాగా సపోర్ట్ ఇస్తోంది. అటు ఏపీలో పవన్ డిప్యూటీ సీఎంగా ఉన్నారు. పవన్ ద్వారా ఏపీలో బలమైన సామాజికవర్గాన్ని తమవైపునకు తిప్పుకోవాలని బీజేపీ ప్లాన్ చేస్తున్నట్టు ఆ మధ్య చర్చ జరిగింది. అటు పవన్ కళ్యాణ్ కూడా సనాతన హిందూధర్మం పేరుతో సంచలన వ్యాఖ్యలు చేశారు. వాటికి బీజేపీ సహా.. సంఘ్ పరివార్ నుంచి మద్దతు లభించింది. ఏపీలో ప్రస్తుతం పవన్‌తో రాజకీయం నడుస్తోంది. కానీ తెలంగాణలో ఆ పరిస్థితి లేదు.అందుకే.. చిరంజీవిని రాజ్యసభకు పంపి, తెలంగాణలో బలపడాలని బీజేపీ ప్లాన్ చేస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. పవన్‌ను ఏపీలో.. అన్నయ్యను తెలంగాణలో ఉపయోగించుకోవాలని కమలం లీడర్లు భావిస్తున్నట్టు తెలుస్తోంది. అయితే.. బీజేపీ ప్రతిపాదనలకు చిరంజీవి ఒప్పుకుంటారా అన్నది అసలు సమస్య. అందుకే ఇటు పవన్ ద్వారా, అటు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ద్వారా అన్నయ్యను ఒప్పించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయనే ప్రచారం జరుగుతోంది.

## సీనియర్లకు చెక్ పెట్టినట్టేనా

**ఒంగోలు, జనవరి 22, పెన్ పవర్:** వైసీపీ అధికారం కోల్పోయిన తర్వాత దాదాపు ఏడు నెలల నుంచి నిస్తేజంగా కనిపిస్తుంది. ఇంత దారుణమైన ఓటమిని చవి చూడటంతో నేతల నుంచి కార్యకర్తల వరకూ ఎవరూ జీర్ణించుకోలేకపోయారు. ఓటమి సంభవించినా కేవలం పదకొండు సీట్లకే తాము పరిమితమవుతామని వారు ఊహించలేదు. దీంతో పార్టీలో ఉండటం వేస్ట్ అన్న అభిప్రాయానికి వచ్చి నేతలు వెళ్లిపోతున్నారు. కీలకమైన నేతలు, జగన్ వారిపై నమ్మకం ఉంచి టిక్కెట్లు ఇచ్చిన వారు, మంత్రిపదవులు కట్టబెట్టిన వారు కూడా రాజీనామా చేశారు. ఒక్కొక్కరుగా వెళ్లిపోతున్నా ఉన్నవారితో పార్టీని మరింత బలోపేతం చేయాలని జగన్ భావించి త్వరలోనే తాను రాష్ట్ర వ్యాప్త పర్యటనకు వస్తానని ప్రకటించారు అంతే కాదు కొత్త నాయకత్వానికి పగ్గాలు అప్పగించాలని కూడా జగన్ భావిస్తున్నారు సీనియర్ నాయకులైతే రాజకీయాల్లో విలువలు లేకుండా వ్యవహరిస్తారన్న నమ్మకంతో జగన్ ఉన్నారని తెలిసింది. వారు అధికారం ఉంటేనే పక్కన ఉంటారని, దాదాపు 80 శాతం మంది సీనియర్ నేతలు అధికారం కోల్పోయిన వెంటనే పార్టీకి దూరమవుతారని కూడా భావించి కొత్త నాయకత్వానికి నియోజకవర్గ పగ్గాలు అప్పగించాలని చూస్తున్నారు. ఇందుకోసం నియోజకవర్గాల వారీగా కొత్త నాయకత్వం కోసం వెదుకులాటను జగన్ అండ్ టీం ప్రారంభించినట్లు వార్తలు అందుతున్నాయి. తన రాష్ట్ర పర్యటనలో కాకపోయినా తర్వాత అయినా వారిని నియోజకవర్గ ఇన్ ఛార్జిగా నియమించి ఇప్పటి నుంచే వారిని జనంలోకి పంపి అందరికీ పరిచయం చేయాలన్న యోచనలో వైసీపీ అధినేత ఉన్నట్లు తెలిసింది. నూతన నాయకత్వం, యువకులు అయితే తనను నమ్ముకుని ఉంటారని జగన్ భావించడమే ఇందుకు కారణం. అందుకే ఏడు నెలల్లోనే అధికార పార్టీ అయిన కూటమి ప్రభుత్వంపై పోరుకు సిద్ధమయ్యారు. తాను లేకపోయినా నాయకత్వం ఎలా ఉందో పరిశీలినకు తనకు ఉపయోగపడుతుందని భావించి ఈ రకమైన కార్యక్రమాలకు తెరదీశారంటున్నారు. నియోజకవర్గాల నుంచి నివేదికలు తెప్పించుకుని అందుకు అనుగుణంగా యాక్టివ్ గా ఉన్న ఐదుగురు యువకులైన నేతల పేర్లను తెప్పించుకుంటున్నారు. అందులో ఒకరికి నియోజకవర్గాల పగ్గాలను అప్పగిస్తే ఎన్నికలు ఎప్పుడు జరిగినా వారిని అభ్యర్థులుగా ప్రకటించవచ్చన్న ఆలోచనతో జగన్ ఉన్నారని చెబుతున్నారు.. అయితే జగన్ ఆలోచించిన కొందరు సీనియర్ నేతలు మాత్రం ఈ కార్యక్రమాలకు యాక్టివ్ అయినట్లు కనిపిస్తుంది. మొన్నటి వరకూ మౌనంగా ఉన్న నేతలందరూ రైతు సమస్యలు, విద్యుత్తు ఛార్జీల పెంపుదల వంటి కార్యక్రమాల్లో సీనియర్ నేతలు పాల్గొంటున్నారు. ముఖ్యమైననేతలు రోడ్లపైకి వచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఒకింత ఆందోళనకు దిగుతున్నారు. ఇదే సమయంలో కేసులు ఎదుర్కొంటున్న నేతలు మాత్రం ఇటువంటి కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. తమపై ఏదో ఒక కేసు పెడతారని భావించి వారు ఈ ఆందోళన కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. వారికి మాత్రం వచ్చే ఎన్నికల్లో మినహాయింపు ఇస్తారని చెబుతున్నారు. నియోజకవర్గాల సంఖ్య పెరుగుతుండటం కూడా ఈ కార్యక్రమాల ద్వారా కొత్త నాయకత్వాన్ని ఎంపిక చేసుకునేందుకు సులువు అవుతుందని జగన్ అంచనా వేస్తున్నారు. మొత్తం మీద జగన్ స్ట్రాటజీ పనిస్తుందా? లేదా? అన్నది చూడాలంటే వెయిట్ చేయాల్సిందే.

# టీమిండియా జెర్సీలపై పాకిస్థాన్ పేరు... ఐసీసీ ఏం చెప్పిందంటే..!

- ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో తెరపైకి మరో వివాదం
- టీమిండియా జెర్సీలపై పాకిస్థాన్ పేరు ఉండడానికి బీసీసీఐ నిరాకరణ
- ఈ వివాదంపై తాజాగా స్పందించిన ఐసీసీ
- టోర్నీ లోగోను తమ జెర్సీలపై ముద్రించడం ప్రతి జట్టు బాధ్యత అన్న ఐసీసీ
- అన్ని జట్లూ ఈ నియమానికి కట్టుబడి ఉండాలని సూచన



**హైదరాబాద్ పెన్ పవర్:** ఫిబ్రవరి 19 నుంచి పాకిస్థాన్, దుబాయ్ వేదికలుగా జరగాల్సి ఉన్న ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో మరో వివాదం తెరపైకి వచ్చింది. భారత జట్టు ధరించే జెర్సీలపై ఆతిథ్య దేశం పాకిస్థాన్ పేరు ఉండటాన్ని బీసీసీఐ నిరాకరిస్తున్నట్టు తెలుస్తోంది. ఐసీసీ టోర్నీలలో భాగంగా ఆతిథ్య దేశపు పేరు, లోగోను జెర్సీపై ముద్రించడం ఆనవాయతీ. కానీ, బీసీసీఐ మాత్రం తాము ఆడేది దుబాయి వేదికగా కనుక పాకిస్థాన్ పేరును తమ ఆటగాళ్ల జెర్సీలపై ముద్రించబోమని చెబుతున్నట్లు సమాచారం. ఈ వివాదంపై తాజాగా ఐసీసీ స్పందించింది. ఛాంపియన్స్ ట్రోఫీ నిబంధనలను అన్ని దేశాలూ పాటించాల్సిందేనని సంబంధిత వర్గాలు స్పష్టం చేశాయి. "టోర్నమెంట్ లోగోను తమ జెర్సీలపై ముద్రించడం ప్రతి జట్టు బాధ్యత. అన్ని జట్లూ ఈ నియమానికి కట్టుబడి ఉండాలి" అని ఐసీసీ అధికారి ఒకరు చెప్పినట్లు ఏ-స్పోర్ట్స్ పేర్కొంది. ఆటగాళ్ల కిట్‌పై ఛాంపియన్స్ ట్రోఫీ లోగో, ఆతిథ్య దేశం పాకిస్థాన్ పేరుతో కనిపించకపోతే భారత జట్టుపై కఠిన చర్యలు తీసుకోవచ్చని అపెక్స్ బోర్డు పేర్కొంది. ఐసీసీ నిబంధనల ప్రకారం, మ్యాచ్‌లు ఎక్కడ జరుగుతున్నాయనే దానితో సంబంధం లేకుండా జెర్సీలపై జట్లకు ఆతిథ్యం ఇచ్చేవారి పేరు రాయాలని తెలిపింది. ఇదిలాఉంటే... గత కొన్ని నెలలుగా బీసీసీఐ, పీసీబీ మధ్య చాలా ఉద్రిక్తతలు చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా ఛాంపియన్స్ ట్రోఫీ కోసం తమ జట్టును పాకిస్థాన్‌కు పంపడానికి భారత బోర్డు నిరాకరించడం, చివరికి ఈ విషయంపై ఐసీసీ రాజీ కుదర్చడంతో హైబ్రిడ్ మోడల్‌లో టోర్నీ నిర్వాహణకు పాక్ అంగీకరించడం జరిగాయి. అయితే, భవిష్యత్తులో భారత్ ఆతిథ్యం ఇచ్చే ఐసీసీ టోర్నీలకు కూడా దాయాది దేశం మన దగ్గరకు రాకుండా తటస్థ వేదికలోనే ఆడనుంది. అలాగే బీసీసీఐ కొన్ని అదనపు రుసుములు కూడా చెల్లించాల్సి ఉంటుంది.

# అగ్ర స్థానానికి చేరువలో అర్షదీప్.. తొలి టీ20 ముందు ఊరిస్తున్న రెండు రికార్డులు



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత టీ20 క్రికెట్ లో ఫాస్ట్ బౌలర్ అర్షదీప్ సింగ్ వేగంగా దూసుకొస్తున్నాడు. భారత టీ20 తుది జట్టులో ఖచ్చితంగా ఉండే అర్షదీప్.. కెరీర్ ప్రారంభం నుంచి అత్యంత నిలకడ చూపిస్తూ ఆకట్టుకుంటున్నాడు. 2022లో భారత్ తరపున అరంగేట్రం చేసిన ఈ లెఫ్టర్మ్ పేసర్.. చూస్తూ ఉండగానే టీ20 క్రికెట్ లో భారత టాప్ ఫాస్ట్ బౌలర్లు భువనేశ్వర్ కుమార్, జస్ప్రీత్ బుమ్రాలను దాటేశాడు. టీ20 క్రికెట్ లో 95 వికెట్లు తీసి బుమ్రా, భువీలను వెనక్కి నెట్టాడు. దీంతో టీ20 క్రికెట్ లో భారత్ తరపున అత్యధిక వికెట్లు తీసుకున్న రెండో బౌలర్ గా నిలిచాడు.

**అగ్ర స్థానానికి చేరువలో అర్షదీప్:**

ఇప్పటివరకు భారత్ తరపున 60 టీ20 మ్యాచ్ లాడిన అర్షదీప్ సింగ్ 8.32 ఎకానమీతో 95 వికెట్లు పడగొట్టాడు. నేడు ఇంగ్లాండ్ తో జరగనున్న తొలి టీ20లో రెండు వికెట్లు తీస్తే టీమిండియా తరపున టీ20ల్లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ గా చరిత్ర సృష్టిస్తాడు. భారత లెగ్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ 96 వికెట్లతో ఈ లిస్ట్ లో టాప్ లో ఉన్నాడు. అర్షదీప్ రెండో స్థానంలో ఉండగా.. భువనేశ్వర్ కుమార్ 90, జస్ప్రీత్ బుమ్రా 89 వికెట్లు పడగొట్టి వరుసగా మూడు, నాలుగు స్థానాల్లో నిలిచారు. స్వదేశంలో ఇంగ్లాండ్ తో జరుగుతున్న మూడు మ్యాచ్ ల టీ20 ఈ సిరీస్ లో మరో 5 వికెట్లు పడగొడితే 100 వికెట్ల క్లబ్ లోకి చేరతాడు. అదే జరిగితే టీ20 ఫార్మాట్ లో భారత్ తరపున ఈ ఘనత సాధించిన తొలి ప్లేయర్ గా చరిత్ర సృష్టిస్తాడు. ఓవరాల్ గా 164 వికెట్లతో న్యూజి లాండ్ ఫాస్ట్ బౌలర్ టిమ్ సౌథీ టాప్ లో ఉన్నాడు. భారత్, ఇంగ్లాండ్ మధ్య నేడు (జనవరి 22) కోల్‌కతా లోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా తొలి టీ20 జరగనుంది.

**టీ20ల్లో భారత్ తరపున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్లు:**

1) యుజ్వేంద్ర చాహల్ - 96
2) అర్ష్‌దీప్ సింగ్ - 92
3) భువనేశ్వర్ కుమార్ - 90
4) జస్ప్రీత్ బుమ్రా - 89

# కారణం లేకుండా చాహల్ కెరీర్‌ను నాశనం చేశారు: బీసీసీపై మాజీ క్రికెటర్ ఫైర్



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా లెగ్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ రెండేళ్లుగా భారత వన్డే జట్టులో స్థానం దక్కించుకోలేకపోతున్నాడు. ఫామ్ లో ఉన్నప్పటికీ టీమిండియాలో చాహల్ కు చోటు దక్కకపోవడం కాస్త ఆశ్చర్యం కలిగించేదే. ఈ క్రమంలో వన్డే వరల్డ్ కప్ తో పాటు వచ్చే నెలలో జరగనున్న ఛాంపియన్స్ ట్రోఫీ టోర్నీకి చాహల్ కు చోటు దక్కలేదు. చాహల్ కెరీర్ ముగిసిపోవడానికి బీసీసీఐ కారణమని టీమిండియా మాజీ ఓపెనర్, ప్రస్తుతం కామెంటేటర్ ఆకాష్ చోప్రా అభిప్రాయపడ్డాడు. బీసీసీఐ,టీమ్ మేనేజ్‌మెంట్ ఎలాంటి స్పష్టమైన కారణం లేకుండా చాహల్ కెరీర్‌ను ముగించిందని చోప్రా ఆరోపించాడు. రెండేళ్ల క్రితం వన్డేలకు దూరంగా ఉన్నప్పుడు చాహల్ గణాంకాలు బాగున్నాయని వాదించాడు. చోప్రా మాట్లాడుతూ.. "యుజ్వేంద్ర చాహల్ కెరీర్ పూర్తిగా ముగిసిపోయింది. అతనికి భారత జట్టులో దారులు మూసుకుపోయాయి. బీసీసీఐ,టీమ్ మేనేజ్‌మెంట్ ఇలా ఎందుకు చేశారో నాకు అర్థం కాలేదు. చాహల్ చివరిసారిగా 2023లో వన్డే ఆడాడు. అతని వన్డే గణాంకాలు అద్భుతంగా ఉన్నాయి. చాలా వికెట్లు తీయడంతో పాటు నిలకడగా రాణించాడు". అని చోప్రా తన యూట్యూబ్ ఛానెల్‌లో చెప్పాడు. ప్రస్తుతం చాహల్ కు భారత జట్టులో చోటు దక్కడం కష్టంగానే కనిపిస్తుంది. టీ20 వరల్డ్ కప్ 2024 స్క్వాడ్ లో స్థానం దక్కినా అతనికి ఆడే అవకాశం రాలేదు. ఆ తర్వాత సెలక్టర్లు చాహల్ పూర్తిగా పక్కన పెట్టేశారు. భవిష్యత్ లోనూ చాహల్ భారత జట్టులోకి రావడం కష్టంగానే కనిపిస్తుంది. అతని వయసు 34 ఏళ్ళు కావడం దీనికి ప్రధాన కారణం. 34 ఏళ్ల చాహల్ ఇప్పటివరకు భారత్ తరపున 72 వన్డేలు, 80 టీ20లు ఆడాడు. రెండు ఫార్మాట్లలో కలిపి 217 వికెట్లు పడగొట్టాడు. 96 వికెట్లతో భారత్ తరపున చాహల్ అత్యధిక వికెట్లు తీసిన ఆటగాడిగా అగ్ర స్థానంలో కొనసాగుతున్నాడు.



సౌందర్య శర్మ తన వంపులను చూపుతుంది

# తండేల్ లుక్: రెంచీతో రిపేర్లు ఇంకేం చేస్తాడు!



అందమైన అమ్మాయి కళ్ల ముందే నాట్యమాడుతోంది. అలా లయబద్ధంగా నాజూకు నడుము సొగసును పరిచేస్తూ కవ్వించేస్తోంది. అలాంటి సన్నివేశంలో పాడైన మరబోటును బాగు చేయడానికి మనసు ఎలా ఒప్పుతుంది? ఆ కుర్రాడి చేతిలో రెంచీ కదులుతుందా? ... ఇదిగో ఇక్కడ - తండేల్ - బీచ్ సన్నివేశం చూస్తుంటే విషయం అర్థమైపోతోంది. నాగచైతన్య-సాయిపల్లవి జంటగా నటించిన తండేల్ ఎమోషనల్ లవ్ స్టోరిని ఎలివేట్ చేస్తుందని తొలి నుంచి మేకర్స్ చెబుతున్నారు. దానికి తగ్గట్టే ఈ జంట నడుమ రొమాన్స్ మరో లెవల్ లో వర్కవుట్ చేసారని ఈ కొత్త స్టిల్ చెప్పకనే చెబుతోంది. నాగచైతన్య మత్స్యకారుడిగా మాస్ లుక్ లో కనిపిస్తున్నాడు. అతడికి జతగా అందమైన అమ్మాయి (సాయిపల్లవి) బాగానే కుదిరింది. ఆ ఇద్దరి నడుమా రొమాన్స్ వేరే లెవల్ లో వర్కవుట్ చేస్తున్నారు దర్శఖుడు చందు మొండేటి. శ్రీకాకుళం మత్స్యకారుడు పాక్ సముద్ర జలాల్లో చిక్కుకుని, అరెస్టయ్యాక ఏం జరిగిందనేది తెరపైనే చూడాలి. ఎమోషనల్ డ్రామాలో ప్రేమకథ ఎలా వర్కవుటైందో చూడాలన్న ఆసక్తి నెలకొంది. ఇప్పటికే రెండు సింగిల్స్ విడుదలై ఆకట్టుకున్నాయి. మేకర్స్ మూడవ సింగిల్ హైలెస్సా హైలెస్సాను జనవరి 23న విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. రాక్‌స్టార్ దేవి శ్రీ ఈ మెలోడీని ప్రత్యేకంగా తీర్చిదిద్దారని సమాచారం. బన్నీ వాసు ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తుండగా, అల్లు అరవింద్ సమర్పిస్తున్నారు. ఫిబ్రవరి 7 న సినిమా థియేటర్లలో విడుదల కానుంది.



సోనాల్ చౌహాన్ సంప్రదాయ లుక్స్

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, And Published at Flat No: F5 C/o M.Ramesh kumar,1st Floor, Prasanthi Appt,Sriram Nagar, Station Road, Bhanugudi, Kakinda, East Godavari -533003, Andhra Pradesh, Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2017/73154, e-mail:penpower9@gmail.com